


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 119 | బుధవారం 29 - 04 -2026 | పేజీలు : 12 | వెల-3


## అమరావతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్

**70 నిముషాల్లోనే ప్రయాణం**

**చంద్రబాబు విజినరీ లీడర్ - కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్**

చంద్రబాబు నేతృత్వంలో విశాఖపట్నం త్వరలోనే ఐటీపట్నం కాబోతోందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. అమరావతి – హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య 70 నిమిషాల్లో, చెన్నై నుంచి అమరావతికి 112 నిమిషాల్లో ప్రయాణం సాధ్యమవుతుందని వివరించారు.

## మహిళా బిల్లును ఆమోదించి తీరుతాం

40 ఏళ్లుగా విపక్షాలు అడ్డుకుంటూనే ఉన్నాయి

వారణాసిలో ప్రధాని మోడీ

2లో



## ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీ

## 14మంది మహిళల దుర్మరణం

ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 14 మంది మృతిచెందగా, 84 మంది గాయపడ్డారు. దేశ రాజధాని జకార్తా శివారులో ఉన్న బెకాసి వద్ద ఈ ప్రమాదం జరిగింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని తొలగించే ప్రయత్నం జరుగుతుందని రైల్వే అధికారులు చెప్పారు. ఓ కమ్యూటర్ ట్రైన్‌తో పాటు లాంగ్ డిస్టెన్స్ రైలు సోమవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు చేరుకున్నట్లు ఇండోనేషియా రైల్వే శాఖ అధికారులు తెలిపారు. గాలింపు ప్రక్రియ ముగిసినట్లు రెస్క్యూ ఏజెన్సీ అధికారులు తెలిపారు. రైల్వే బోగీలు నుజ్జు నుజ్జు అయ్యాయని, వాటిల్లో చిక్కుకున్న

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

ఆలయం వద్ద ఘన స్వాగతం పలికిన మంత్రి ఆనం, టీటీడీ చైర్మన్

పండితుల నుంచి వేదాశీర్వచనం అందుకున్న ఉపరాష్ట్రపతి

ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించాక ఇది రెండోసారి తిరుమల పర్యటన

2లో





# గూగుల్..ఏపీకి గేమ్ ఛేంజర్

**దేశానికి ఎపి డేటా గేట్‌వేగా నిలుస్తుంది**

**గ్రోత్ ఇంజిన్‌గా మారనున్న గూగుల్**

**2028 నాటికి గూగుల్ సెంటర్ పూర్తి**

**ఎంఓయూలతోనే కాదు..వాటిని ముందుకు తీసుకెళ్తున్నాం**

**గూగుల్ సెంటర్‌కు శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు**

2లో

గూగుల్ రాక.. విశాఖకే కాదు.. ఏపీకి ఒక గేమ్ ఛేంజర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీ చరిత్రలో మరచిపోలేని రోజు ఇదన్నారు. భారతదేశానికి ఏపీ..అంతర్జాతీయ డేటా గేట్‌వేగా నిలుస్తుంది. విశాఖలోని తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, గూగుల్‌కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్.. ఏపీ టెక్నాలజీతోపాటు దేశానికే గ్రోత్ ఇంజిన్‌గా మారుతుందన్నారు. టెక్నాలజీ హబ్‌కు భవిష్యత్‌లో తుర్లవాడ పేరు మార్మోగుతుందన్నారు. టెక్నాలజీలో ఏపీ సగర్వంగా తలెత్తుకొని నిలబడుతుంది. కొత్త ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ స్వాగతం పలుకుతుంది. ఏఐ డేటా సెంటర్ ఒక గిగావాట్ సామర్థ్యంతో పని చేస్తుంది. సెర్చ్ ఇంజిన్‌గా మొదలైన గూగుల్.. ఇప్పుడు భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మారబోతోంది. ప్రముఖ సంస్థలు విశాఖలో పెట్టుబడులకు రావడం శుభపరిణామం. గూగుల్ ఆవిష్కరణలు.. ఏపీ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రెండూ కలుస్తున్నాయి.



# సిక్కింలో మోదీ ‘ఫుట్‌బాల్’ సందడి..

## రూ. 4 వేల కోట్లతో అభివృద్ధి ప్రాజెక్టుల జాతర!

**సిక్కిం రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50 ఏళ్లు ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిన ప్రధాని**

**తన చిన్ని స్నేహితులతో ఫుట్‌బాల్ ఆటను ఎంజాయ్ చేశానన్న ప్రధాని**

2లో

సిక్కిం రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ గ్యాంగ్‌టక్ వెళ్లారు. తన పర్యటన సందర్భంగా, ఈ ఉదయం పాల్జోర్ స్టేడియంలో యువతీయువకులతో కలిసి ప్రధాని ఫుట్‌బాల్ ఆడారు. ఎంతో బిజీగా ఉండే ప్రధాని... కాసేపు యువతతో కలిసి ఆటను ఎంజాయ్ చేశారు. ఈ సందర్భంగా తన సంతోషాన్ని ఎక్స్ వేదికగా ఆయన పంచుకున్నారు. “నా చిన్ని స్నేహితులతో ఫుట్‌బాల్ ఆడటం చాలా సరదాగా, ఉత్తేజంగా అనిపించింది“ అని ఆయన పేర్కొన్నారు.మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా విద్య, వైద్య, మౌలిక సదుపాయాల రంగాలకు సంబంధించి రూ. 4 వేల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

సిక్కిం యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్, హెలెన్ లెప్చా మెడికల్ కాలేజ్ ప్రారంభోత్సవం వంటివి ఇందులో కీలకం. ఈ పర్యటనలో భాగంగా ఈశాన్య రాష్ట్రాల కోసం 6 క్రికెట్ అకాడమీలను కూడా ప్రధాని ప్రకటించారు.

## మేమింతే..!



**గాడి తప్పిన ఇంజనీరింగ్ శాఖ**

**ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న డెలిగేటెడ్ ఏఈలు**

**పట్టించుకోని ఉన్నతాధికారులు**

గత ప్రభుత్వ హయాంలో ఇంజనీరింగ్ విభాగాధిపతులు సచివాలయాల్లో పనిచేస్తున్న కొంతమంది వార్డు అమ్యూనిటీస్ సెక్రటరీలను అనధికార ఉత్తర్వుల ద్వారా డెలిగేటెడ్ ఏఈలుగా నియమించారు. వారి సేవలను వినియోగించుకుంటున్నారు. అంతా బాగానే ఉన్నప్పటికీ డెలిగేటెడ్ ఏఈలుగా ఉన్న కొందరు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. మేమింతే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. రెగ్యులర్ ఏఈల కంటే డెలిగేటెడ్ ఏఈలు బాగా పని చేస్తున్నప్పటికీ డబ్బు ప్రలోభాలు వారిపై ప్రభావం చూపుతున్నాయన్న ఆరోపణ లున్నాయి.

2లో

# పెట్రోల్,డీజిల్ కొరతకు చెక్..

ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని రోజులుగా ఎదురైన పెట్రోల్, డీజిల్ కొరత సమస్య క్రమంగా తగ్గుముఖం పట్టింది. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయానికి రాష్ట్రంలోని సుమారు 90 శాతం పెట్రోల్ బంకుల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు వెల్లడించారు. సరఫరా మెరుగుపడటంతో పెట్రోల్ బంకుల వద్ద రద్దీ భారీగా తగ్గిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సమస్యను అధికారులు నిరంతరం పర్యవేక్షించారు. ఇంధన సరఫరాను వేగవంతం చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈరోజు సాయంత్రం 6 గంటల వరకు వినియోగదారులకు 5,373 కిలోలీటర్ల పెట్రోల్, 8,777 కిలోలీటర్ల డీజిల్ సరఫరా చేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇదే రోజు స్టాక్ పాయింట్ల నుంచి పెట్రోల్ బంకులకు 10,402 కిలోలీటర్ల పెట్రోల్, 17,805 కిలోలీటర్ల డీజిల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈరోజు అర్ధరాత్రి నుంచి రేపు ఉదయం వరకూ ఏపీలోని 100 శాతం బంకుల్లో పెట్రోల్, డీజిల్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందని అధికారులు చెబుతున్నారు. పరిస్థితి మెరుగుపడటంతో అధికారులు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

2లో



## గాడి తప్పిన ఇంజనీరింగ్ శాఖ ఒకసారి చేతులు కలిపితే పూర్తి బాధ్యత మాదే



2లో

**విశాఖలో గూగుల్ ఆధ్వర్యంలో భారత్ ఏఐ శక్తి కాంక్లేవ్**

**దేశ డిజిటల్ ప్రయాణంలో ఇది కొత్త అధ్యాయం అన్న మంత్రి లోకేష్**

**15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏఐ హబ్.. 2 లక్షల ఉద్యోగాల అంచనా**

**2047 నాటికి విశాఖను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం**

**పదేళ్లలోనే విశాఖలో హైదరాబాద్ స్థాయి అభివృద్ధి సాధిస్తామని ధీమా**

విశాఖపట్నం కేంద్రంగా భారతదేశ డిజిటల్ ప్రగతిలో ఒక సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టామని, ఇది కేవలం గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రారంభం మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు కీలకమైన మలుపు అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. గూగుల్ ఆధ్వర్యంలో విశాఖ నోవాటెల్ హోటల్‌లో మంగళవారం జరిగిన ‘భారత్ ఏఐ శక్తి కాంక్లేవ్’లో ఆయన

# మేమింతే..!

నగరపాలక సంస్థలో ఇంజనీరింగ్ శాఖ పూర్తిగా గాడి తప్పినట్లు కనిపిస్తుంది. ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని రిజిడ్యువల్ (అవశేష) క్లోరిన్ స్థాయిల కోసం క్రమం తప్పకుండా పరీక్షించడం అవసరం. దీనికోసం అమ్యూని టీస్ సెక్రటరీ నీటి సరఫరా సమయంలో అందుబాటులో ఉండాలి. వారికి ప్రభుత్వం ఇతర సర్వే పనులు అప్పగించడంలో ఆర్‌సీ టెస్టులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఈఎన్‌సీ సమావేశం ఉన్నప్పుడు హడావిడిగా పరీక్షలు నిర్వహిస్తున్నారని, వాటిని సీరియస్‌గా తీసు కోవడం లేదని స్పష్టం కనబడుతోంది. పంప్‌హౌస్‌లో అనేక మంది ఖాళీగా ఉన్నప్పటికి వారికి ఆర్‌సీ పరీక్షలు అప్పగించకుండా అమ్యూనిటీస్ విభాగానికి అదనపు పనులు అప్ప గించినట్లు సమాచారం. ఈఒక్క విషయం సంబంధిత ఎస్ఈకి తన శాఖపై ఉన్న నియంత్రణ స్థాయిని స్పష్టంగా తెలియజేస్తుందని వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**ఎంపిక ఎలా చేశారో?** డిలిగేటేడ్ ఏఈల ఎంపిక ప్రమాణాలేమిటో స్పష్టత లేకుండా పోయింది. ఆ స్థానాల్లో ఉన్న కొందరు అధికారుల ప్రవర్తనపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు ఇతరులను వేధించడమే తమ పనిగా భావిస్తున్నట్లుగా కనిపిస్తుంది.

**మారని తీరు** ఒక మహిళా డెలిగేటేడ్ ఏఈ డబ్బునే ప్రాధాన్యంగా తీసుకుంటూ విధులు నిర్వహిస్తున్నారు. 22 నుంచి 25 వార్డుల వరకు డెలిగేటెడ్ ఏఈగా పని చేస్తున్న ఓ అమ్యూనిటీస్ సెక్రటరీపై గతంలో అదే వార్డులో పనిచేసే సమయంలో ఓ మహిళా ఉద్యోగికి సం బంధించిన విషయంపై మరో మహిళా ఉద్యోగిని బెదిరించినట్లు ఆరోపణలున్నాయి. ఈ ఘటన అనంతరం సంబంధిత ఉద్యోగిని తల్లిదండ్రులు ఎస్సీ/ఎస్టీ కేసు నమోదు చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అప్పటి ఇన్‌చార్జి ఎస్ఈ జోక్యం చేసుకుని సంబంధిత ఆ ఉద్యోగిని తనకు అనుకూలమైన చోటుకు ట్రాన్స్‌ఫర్ చేసి విషయాన్ని సద్దుమణిగించినట్లు తెలిసింది. ఆ ఘటనలో ఆ డెలిగేటెడ్ ఏఈ, అప్పటి ఇన్‌చార్జి ఎస్ఈ ఒకే సామాజికవర్గానికి చెందినవారు కావడంతో విషయం బయటకు రాలేదని కొన్నివర్గాలు చెబుతున్నాయి. అతడు ఇతర వార్డులకు బదిలీపై వెళ్లిన తరువాత కూడా తన ప్రవర్తన కొనసాగించినట్లు ఆధారాలు పుష్కలంగా ఉన్నాయి. తన ఉద్యోగానికి పూర్వమే జారీ అయిన పనులకు సంబంధించిన ఫైళ్లను కమిషనర్ లాగిన్‌కు పంపిస్తూ, కాంట్రాక్టర్ల వద్ద నుంచి అనుచితంగా లాభా లు పొందాడు. ఈవిషయాన్ని గమనించిన అప్పటి కమిషనర్ రవీంద్రబాబు ఆయనను పిలిచి మందలించినప్పటికీ అదే తరహా ప్రవర్తన కొనసాగించినట్లు తెలిసింది. అతడిని డెలిగేటెడ్ ఏఈ పదవి నుంచి తొలగించారు.

**మళ్లీ తనకు అనుకూలమైన..**రవీంద్రబాబు బదిలీపై వెళ్లిన వెంటనే సంబంధిత డెలిగేటెడ్ ఏఈ మళ్లీ తనకు అనుకూలమైన వార్డులను పొందినట్లు సమా చారం. అనంతరం తన కార్యాకలాపాలను కొనసాగించి నట్లు వర్గాలు చెబుతున్నాయి. గత కమిషనర్ తనకు అప్పగించిన వార్డులను తొలగించినప్పటికీ మళ్లీ అదే వ్యక్తికి వార్డులు అప్పగించాలనే ఉద్దేశ్యంతో ఇంజనీరింగ్ విభా గంలోని కొందరు అధికారులు అత్యుత్సాహం చూపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అంతా నా ఇష్టం..**అమ్యూనిటీస్ సెక్రటరీలకు సంబంధించిన సెలవులు, బదిలీలు, అరియర్స్ బిల్లుల విష యంలో ఓ క్లర్క్ అంతా నా ఇష్టం అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నాడు. ప్రతి పనికి డబ్బు లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది మహిళా సెక్రటరీలు ఇష్టనుసారంగా లీవ్ లెటర్లను తపాలాలో వేసి వెళ్లిపోతున్న ఘటనలున్నాయి. ఇంత జరుగుతున్నా ఎస్ఈ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

**అదనపు విధులు..** అమ్యూనిటీస్ సెక్రటరీల ఇప్పటికే తక్కువ సంఖ్యల్లో ఉన్నారు. వారిలో కొంత మంది డిప్యుటేషన్‌పై ఇతర శాఖల్లో పనిచే స్తుండటంతో, మిగిలిన వారిపై పని భారమంతా పడుతున్నట్లు సమాచారం. కొత్త కమిషనర్ తమకు ఉన్న అదనపు భారాన్ని అర్థం చేసుకొని 3, 4 సచివాలయాల బాధ్య తలను తొలగిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**విచారణ చేపడతాం** కొత్తగా బాధ్యతలు చేపట్టాను. ఇంకా నా దృష్టికి రాలేదు. ఇంజనీరింగ్ అధికా రులతో సమావేశం ఏర్పాటు చేసుకుని దానిపై లోతుగా విచారణ చేపడతాం. అవినీతి ఆరోపణలుంటే వారిపై చర్యలు తీసుకుంటాం.

# మహిళా బిల్లును ఆమోదించి తీరుతాం

పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టడానికి తాము ఎంతగానో ప్రయత్నించామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కాంగ్రెస్, ఎస్పీ వంటి ప్రతిపక్ష పార్టీల నీచ రాజకీయాల వల్లే ఆ చట్టం అమల్లోకి రాకుండా ఆగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు అభివృద్ధి చెందడం, అసెంబ్లీలు, పార్లమెంట్‌లకు రావడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని..అందువల్లే 40 ఏళ్లుగా ఈ బిల్లును అడ్డుకుంటూనే ఉన్నారని అన్నారు. తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. మహిళా రిజర్వేషన్ అమలు చేయడానికి కృషి చేస్తూనే ఉంటామన్నారు. వారణాసిలో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడమనే మహా యజ్ఞం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నానని..అందుకు మాతృమూర్తుల ఆశీస్సులు తీసుకునేందుకు వారణాసి వచ్చానని ప్రధాని పేర్కొన్నారు. ఈ బిల్లును తేవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని..ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదని అన్నారు. సాధారణ కుటుంబాల మహిళలు పార్లమెంటు, అసెంబ్లీలకు రావాలని కోరుకున్నానని తెలిపారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం అధికారం తమ కుటుంబాలకే పరిమితం కావాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లపై తమ పోరాటం ముగిసిపోలేదని, చట్టాన్ని అమలు చేసే వరకు పోరాడుతూనే ఉంటామన్నారు.

# గూగుల్ ..ఎపికి గేమ్ ఛేంజర్

ఓడరేవుల వంటి రంగాల్లో పని చేస్తున్న ప్రతిష్ఠాత్మక సంస్థ అదానీ.. ప్రజలకు కమ్యూనికేషన్‌తో అనుసంధానం చేస్తున్న మరో సంస్థ ఎయిర్‌టెల్.. ఈ మూడు సంస్థలు ఎప్పుడూ నూతన ఆలోచనలు చేస్తుంటాయన్నారు. 2028 సెప్టెంబర్ నాటికి గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణం పూర్తి కావాలి. రెండు, మూడు నెలలు ముందుగానే పూర్తి చేసేందుకు సహకరిస్తాం. జులైలో భోగాపురం ఎయిర్‌పోర్టును జాతికి అంకితం చేస్తాం. భవిష్యత్‌లో అనకాపల్లి జిల్లా మరో రంగారెడ్డి జిల్లాగా మారుతుంది. వ్యాపార నిర్వహణ ఖర్చు.. మిగిలిన నగరాలకంటే చాలా తక్కువగా ఉంటుంది. జూన్ 1న దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రారంభమవుతుందని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఎంవోయూలకే పరిమితం కాదు.. ముందుకు ఎలా తీసుకెళ్లాలో చూపిస్తున్నాం. పెట్టుబడులు, ఒప్పందాలే కాదు.. ప్రారంభంలోనూ ముందున్నాం అని చంద్రబాబు అన్నారు. అలాగే విశాఖకు గూగుల్ రాక ఉత్తరాంధ్రకే గర్వకారణమని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటవుతోందని తెలిపారు. విశాఖను గూగుల్ ఎంపిక చేసుకోవడం ఏపీకి గర్వకారణమని వ్యాఖ్యానించారు. గూగుల్, ఎయిర్‌టెల్ రెండూ కీలక సంస్థలని వెల్లడించారు. సెప్టెంబర్ 2028 నాటికి గూగుల్ డేటా సెంటర్ పూర్తవుతుందని స్పష్టం చేశారు. అతి త్వరలో అన్నిరంగాల్లో ఏఐ సేవలు వస్తాయని వివరించారు. 60 రోజుల్లో అనకాపల్లి, విశాఖపట్నానికి గోదావరి నీళ్లు వస్తాయని చెప్పుకొచ్చారు. గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విశాఖకు అద్భుతమైన కనెక్టివిటీ ఉందని తెలిపారు. 2028 చివరినాటికి ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ తొలిదశ పూర్తి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏఐ సిటీగా విశాఖ ఉంటుందని.. తెలిపారు. టెక్నాలజీలో దేశానికే గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్ ఉందని వెల్లడించారు. పెట్టుబడిదారులే ఏపీకి భాగస్వాములని చెప్పారు. ఒప్పందాలే కాదని.. గ్రౌండింగ్ కూడా తమదే బాధ్యత అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# గాడి తప్పిన ఇంజనీరింగ్ శాఖ ఒకసారి చేతులు కలిపితే పూర్తి బాధ్యత మాదే:

ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా, విశాఖ అభివృద్ధిపై ప్రజా ప్రభుత్వ దార్శనికతను, లక్ష్యాలను ఆయన స్పష్టంగా వివరించారు. పెట్టుబడుల విషయంలో ఎంవోయూలపై కాకుండా, షేక్ హ్యాండ్‌లపై నమ్మకం ఉంచుతామని, ఒకసారి చేతులు కలిపితే ఆ ప్రాజెక్టును తమదిగా భావించి పూర్తి బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని, పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున ఏపీ, విశాఖలో పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గూగుల్ క్లౌడ్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాష్ కోలేతో పాటు 49 కంపెనీల ప్రతినిధులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. "దశాబ్దాలుగా దేశ ఖనిజ సంపదను ప్రపంచానికి అందించిన విశాఖ నగరం.. ఉక్కు పునాదులపై నిర్మితమైంది. కానీ నేడు, ఈ ఉక్కు నగర పునాదులను కృత్రిమ మేధ (ఏఐ) విప్లవంపై నిర్మించబోతున్నాం. మన దేశ భవిష్యత్తును వైజాగ్ నిర్మించబోతోందని నేను బలంగా విశ్వసిస్తున్నాను" అని లోకేష్ పేర్కొన్నారు. ప్రపంచం భారీ పరిశ్రమల నుంచి డిజిటల్ మౌలిక సదుపాయాల వైపు, తయారీ నుంచి మెషిన్ ఇంటెలిజెన్స్ వైపు వేగంగా మారుతోందని, ఈ మార్పులో విశాఖ కీలక పాత్ర పోషించనుందని తెలిపారు.

**15 బిలియన్ డాలర్ల పెట్టుబడి.. 2 లక్షల ఉద్యోగాలు**

గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటు చరిత్రాత్మకమని మంత్రి అభివర్ణించారు. దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అయిన 15 బిలియన్ డాలర్లతో పాటు, ఒక గిగా వాట్ సామర్థ్యం గల డేటా సెంటర్ ఎకోసిస్టమ్ ఇక్కడ రూపుదిద్దుకోనుందని తెలిపారు. తొలిసారిగా విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటు కానున్నాయని, కనెక్టివిటీ విషయంలో ఇతర రాష్ట్రాలతో దీటుగా పోటీ పడతామని చెప్పారు. "ఒకప్పుడు ఓడరేవులు ఈ నగరాన్ని ప్రపంచంతో భౌతికంగా కలిపితే, ఇప్పుడు ఈ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు డిజిటల్‌గా అనుసంధానిస్తాయి. ఈ పెట్టుబడి వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఇది కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు, ఆర్థికాభివృద్ధికి ఒక మల్టిప్లయర్," అని లోకేష్ వివరించారు.

**2047 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా విశాఖ**

2047 నాటికి విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. ఇటీవల ఆర్సెలార్ మిట్టల్‌తో కలిసి గ్రీన్ స్టీల్ సిటీకి శంకుస్థాపన చేశామని, అదేవిధంగా ఏఐ, డేటా, ఫార్మా, మెడికల్ డివైసెస్ రంగాల్లో భారీ అభివృద్ధి జరగనుందని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిని ఉదాహరణగా చూపుతూ, "ఒకప్పుడు సైబర్ టవర్స్ నిర్మాణానికి చంద్రబాబు గారు సంకల్పించినప్పుడు అందరూ ఎగతాళి చేశారు. కానీ, స్పష్టమైన విజన్‌తో అది సాధ్యమైంది. హైదరాబాద్‌లో 30 ఏళ్లలో సాధించిన అభివృద్ధిని, విశాఖలో రాబోయే 10 ఏళ్లలోనే సాధించి చూపిస్తాం," అని ధీమా వ్యక్తం చేశారు.

**అదే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది** ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్రమని, అందుకే తమలో అభివృద్ధి పట్ల కసి, పట్టుదల ఎక్కువగా ఉన్నాయని మంత్రి అన్నారు. "చరిత్రలో నాలుగుసార్లు రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవాల్సిన అవసరం మాకు పడింది. మొదట మద్రాసులో, తర్వాత కర్నూలు రాజధానిగా, ఆ తర్వాత హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుని విడిపోయాం. ఈ అనుభవమే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది. మమ్మల్ని ఒక స్టార్టప్‌లా చూడండి" అని పారిశ్రామికవేత్తలను కోరారు. మా కేబినెట్‌లో 25 మంది మంత్రుల్లో 17 మంది, శాసనసభ్యుల్లో సగం మంది కొత్తవారేనని, అందరం ఉత్సాహంతో పనిచేస్తున్నామని చెప్పారు.

# ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీ

వారిని తొలగించడం పెద్ద సమస్యగా మారిందన్నారు. రైలుకు చెందిన మహిళా బోగీ దెబ్బతిన్నదని, బాధితుల్లో అందరూ మహిళలే ఉన్నట్లు అధికారులు తెలిపారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు ఇనుపకడ్డీలను గ్రైండర్లతో కట్ చేశారు. స్థానికంగా తిరిగే లోకల్ కమ్యూటర్ రైలు తొలుత ఓ ట్యాక్సీ ఢీకొన్నదని, ఆ తర్వాత అది మళ్లీ దూరం వెళ్లే మరో రైలును ఢీకొన్నట్లు బాబీ తెలిపారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మంగళవారం నాడు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, ఇతర అధికారులు ఘనస్వాగతం పలికారు. అర్చకులు 'ఇస్తికఫాల్'తో సంప్రదాయబద్ధంగా ఆయనను ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం ఉపరాష్ట్రపతి ధ్వజస్తంభానికి నమస్కరించి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత వకుళమాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. టీటీడీ ఛైర్మన్, ఈవో కలిసి స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. ప్రధాన ఆలయానికి ఎదురుగా ఉన్న బేడీ ఆంజనేయస్వామిని కూడా ఆయన దర్శించుకున్నారు. ఈ పర్యటనలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దేశ ప్రజల శాంతి, శ్రేయస్సు, సౌభాగ్యం కోసం స్వామివారిని ప్రార్థించినట్లు ఉపరాష్ట్రపతి తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన, సోమవారం రాత్రి తిరుపతికి చేరుకున్నారు. ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాధాకృష్ణన్ తిరుమల రావడం ఇది రెండోసారి. గత ఏడాది సెప్టెంబర్ 25న కూడా ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. అప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి టీటీడీ నిర్మించిన 'వెంకటాద్రి నిలయం' యాత్రికుల వసతి సముదాయాన్ని ప్రారంభించారు.

# భూసేకరణలతో రైతుల గుండెల్లో రైళ్లు !

రాజధాని అమరావతికి ఇప్పటికే 32వేల ఎకరాలు సేకరించారు. మరో దశలో భూసేకరణకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటి వరకు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు సరైన పరిహారం దక్కలేదు. ప్లాట్లు కూడా దక్కలేదు. కౌలు కూడా అరకొరగా అందచేస్తున్నారు. అయినా రైతులు రాజధాని కోసం సర్వస్వం త్యాగం చేశారు. మరిన్ని భూములు సేకరించే ప్రయత్నంలో కొంత వ్యతిరేకత తప్పడం లేదు. మూడు పంటలు పండే, కృష్ణా పరివాహక భూములు ఇవ్వడం సాధ్యం కాదని అంటున్నారు. రైతులకు మంచి ధరలు ఇచ్చి కొనడంలో కూడా సర్కార్ మీనమేషాలు లెక్కిస్తోంది. గతంలో ఇచ్చిన భూముల రైతులకు పెద్దగా దక్కింది కూడా లేదు. ఇప్పుడది చాలదన్నట్టు 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 189 కిలోమీటర్ల పొడవున 250 మీటర్ల వెడల్పుతో ఔటర్ రింగురోడ్డు ఒఆర్ఆర్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో గుంటూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ప్రభావిత ప్రాంతాల రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పరిటాల నుండి ఇబ్రహీంపట్నం వరకూ కృష్ణానదికి సమీపంగా ఒఆర్ఆర్ నిర్మిస్తామంటూ అక్కడి భూయజమానులతో ఇటీవల అధికారులు చెప్పారు. దీంతో ఇప్పటికే మూడుసార్లు భూసేకరణ కింద భూమిని కోల్పోయామనీ, ప్రభుత్వానికి ఇంకెన్నిసార్లు భూములివ్వాలని రైతులు అభ్యంతరం తెలిపారు. మరోమారు భూసేకరణ పిడుగు పడడంతో వారు ఆందోళనలో ఉన్నారు. దేశంలో అనేక ముఖ్య నగరాల్లో ఒఆర్ఆర్, జాతీయ రహదారులు 70 మీటర్ల వెడల్పుతో నిర్మించగా అమరావతి రింగురోడ్డును 250 మీటర్ల వెడల్పుతో నిర్మించే ప్రతిపాదన సరికాదు. రైతుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్ఎఐ) డిపిఆర్ కూడా సిద్ధం చేసి, ముందుకు పోతుండడం రైతుల ప్రయోజనాలు దెబ్బతీయడమే. వారికి భూమికి భూమి ఇచ్చివుంటే సమస్యలు వచ్చి ఉండేవి కావు. రాజధాని నిర్మాణం, పట్టణాభివృద్ధి పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేయడం సరైన పద్ధతికాదు. అమరావతి కోసం తొలి దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు డెవలప్ చేసిన ప్లాట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. భూ యజమానులకు కౌలు, పేదలకు పింఛన్లు సరిగా అందడం లేదు. ఇబ్బందులిలా వుండగానే ఏలినవారు రెండవ దశ, అనంతరం మరింత విస్తరించడానికి భూములు సమీకరిస్తామని ఊరూరా తిరుగుతుంటే అన్నదాతల గుండెలు అదురుతున్నాయి. అదేపనిగా వేల ఎకరాలు సేకరించడం వెనక రియల్ మోసం ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తొలుత రాజధాని కోసం ప్రతిపాదించిన భూమితో సరిపెట్టుకోకుండా మరోమారు భూసేకరణకు దిగారు. ఇప్పుడు ఓఆర్ఆర్ ప్రతిపాదిస్తున్న మండలాలు, గ్రామాల పరిధిలో భూములు చాలా విలువైనవి. రైతులు, కూలీల జీవనం వాటిపైనే ఆధారపడి ఉంది. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్లో కోటి రూపాయల నుండి రెండుకోట్ల వరకూ ఉంటుంది. భూములు కోల్పోయే రైతులకు వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వకుండా కొన్ని గ్రామాల్లో సచివాలయాల ముందు భూముల సేకరణకు సంబంధించి సర్వే నెంబర్లు, ఎల్‌పి నెంబర్లు సేకరించే భూమి విస్తీర్ణం వంటి వివరాలతో నోటీసులు అతికించారు. ఇందులో ఏ రైతు భూమిని ఎంత విస్తీర్ణం ప్రభుత్వం సేకరించబోతోంది వంటి వివరాలు రైతుల వారీగా లేకపోవడంతో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం పత్రికల్లో చేసిన ప్రకటన, సచివాలయాల్లో వేలాడదీసిన పత్రాలు పారదర్శకంగా లేకపోవడంతో రైతులు భయాందోళనల్లో ఉన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు జరిపి సామాజిక ప్రభావ అంచనా వివరించి రైతులు, ప్రజల సమ్మతి పొందడం అవసరం. అటువంటి చట్టబద్ధమైన ప్రక్రియ అమరావతి ఔటర్‌రింగు రోడ్డు ప్రతిపాదిత గ్రామాల్లో ఇప్పటి వరకూ ఎక్కడా చేపట్టకపోవడం ప్రభుత్వానికి తగదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉన్న భూముల రేటుకు అనుగుణంగా ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్న రైతుల కోర్కె ఎంతో సమంజస మైనది. నయాయబద్ధమైనది కూడా. ఆ ప్రాంతం అభివృద్ధి చెందితే భూముల విలువలు ఎంతగానో పెరుగుతాయని భూ సమీకరణకు రైతులను అంగీకరింపజేయడానికి చెప్పిన ఏలికలు ఆ రైతులకు ఇప్పటి మార్కెట్ విలువనైనా పరిహారంగా చెల్లించలేదు. ఆర్‌ఆర్‌లో భూమి కోల్పోతున్న ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 71 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కొత్తగా జాతీయ రహదారి వేయాలనుకున్న ప్రాంతం కృష్ణానది బఫర్‌జోన్లో ఉందని, గతంలో వరదలు వచ్చిన సమయంలో పెద్దఎత్తున ముంపునకు గురయ్యా యని, నీటి ఒత్తిడి కూడా ఎన్‌టిఆర్ జిల్లావైపు ఉంటోందని, వరదలు వచ్చిన సమయంలో నష్టం ఎక్కువగా ఉండటంతోపాటు రోడ్డుకు దక్షిణభాగంలో ఉండే గ్రామాలన్నీ మునిగిపోతాయని ధర్మాసనం ఎదుట మొరపెట్టుకున్నారు.

అన్నదాతల వాదనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన పూర్తి వివరాలు కోర్టుకు సమర్పించాలని ఆర్‌అండ్‌బి, జలవనరులు, ఎన్‌హెచ్ఎఐ అధికారులను ఆదేశించింది. అభివృద్ధి పేరిట భారీగా భూములు గుంజుకుంటున్న ప్రభుత్వం ఇప్పటికైనా విచక్షణతో వ్యవహరించడం అవసరం. ఒఆర్ఆర్ ను 70 మీటర్లకే పరిమితం చేయడం విజ్ఞతగా ఉంటుంది. భూమి కోల్పోయే రైతులను, నష్టపోయే ప్రజలను భాగస్వాములను చేసి వారి ఆమోదంతోనే ముందుకు వెళ్లడం అన్ని విధాలా మంచిది.

అలాగే భూములు కావాల్సి వచ్చినప్పుడు బహిరంగ మార్కెట్ ధరలు చెల్లించి సేకరించడం అవసరం. అంతేగానీ రైతులను మహ్య పెట్టి, వారిని కూలీలుగా దిగజార్చే చర్యలు మాత్రం సహించరానివి.

# ఇరాన్ పతనం అంచున ఉంది.. వాళ్లే మాకు చెప్పారు: ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్య

### హర్మూజ్ దిగ్బంధనాన్ని ముగించాలని ఇరాన్ కోరిందన్న ట్రంప్

### ఇరాన్ తమ నాయకత్వాన్ని చక్కదిద్దుకునే పనిలో ఉందని వ్యాఖ్య

### అంతర్గత విభేదాలను వారు పరిష్కరించుకోవాలని సూచన

ఇరాన్ పతనం అంచున ఉందని, ఈ విషయాన్ని స్వయంగా ఆ దేశ ప్రతినిధులే తమకు చెప్పారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. వీలైనంత త్వరగా హర్మూజ్ జలసంధిని కూడా తెరవాలని వారు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. హర్మూజ్ దిగ్బంధనాన్ని ముగించాలని వారు తమను కోరారని 'ట్రూత్' సోషల్ మీడియా వేదికగా ఆయన పోస్టు పెట్టారు. ఇరాన్ తమ నాయకత్వాన్ని చక్కదిద్దుకునే పనిలో ఉందని ఆసక్తికర వ్యాఖ్య చేశారు. సుదీర్ఘ యుద్ధం కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, తమ దేశ ప్రతినిధులతో చర్చల విషయంలో ఇరాన్ ప్రభుత్వంలో ఉన్న అంతర్గత విభేదాలను వాళ్లు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. అయితే ఇరాన్ నుంచి ఎవరి ద్వారా తనకు ఈ సమాచారం అందిందనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. అలాగే ఈ సంభాషణ నేరుగా జరిగిందా లేక మధ్యవర్తి ద్వారా తెలిసిందా? రిపబ్లికన్ ప్రభుత్వంలో ఎవరికి ఈ సమాచారం అందింది? అనే ప్రశ్నలపై కూడా వైట్ హౌస్ స్పందించలేదు.



# పోలింగ్‌కు ముందు నాటుబాంబులు లభ్యం... ఎన్ఐఏకు ఎన్నికల సంఘం కీలక సూచన




పశ్చిమ బెంగాల్‌లో రెండో దశలో జరగనున్న సమస్యాత్మక పోలింగ్ పోలింగ్ బూత్‌లకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఈడీకి కీలక సూచన చేసింది. పోలింగ్‌కు కొన్ని రోజుల ముందు రాష్ట్రంలో నాటు బాంబులు లభించడం, స్వల్ప పేలుడు ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం అప్రమత్తమైంది. రెండో దశ పోలింగ్ కోసం ఈసీ అన్ని ఏర్పాట్లు చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా భద్రతను మోహరించింది. కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడం, ఓటింగ్‌కు అంతరాయం కలిగించేందుకు దుండగులు బాంబులను ఉపయోగించే ప్రమాదం ఉందని ఈ పరిస్థితుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు సూచించింది. రాష్ట్రంలో పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ తెలిపింది. దక్షిణ పరగణాలు జిల్లాలోని భాంగర్ ప్రాంతంలో ఇటీవల ఒక ఇంట్లో నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఎన్ఐఏ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టింది. బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు గాను 152 చోట్ల తొలి దశలో ఈ నెల 23న పోలింగ్ పూర్తయింది. మిగతా 142 స్థానాల్లో రేపు (ఏప్రిల్ 29) పోలింగ్ జరగనుంది.

# నిజాలు రాస్తే హత్యలు చేస్తారా..?

**కర్నూలు బ్యూరో.ఏప్రిల్ 28 . (నంది పత్రిక ):** చిత్తూరు జిల్లా, వీ కోట ఆంధ్ర జ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్య బాధాకరమని, హత్య చేసిన వారిని, ప్రోత్సహించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (×జీఖ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీకొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు ఎన్ వీ సుబ్బయ్య, కే నాగరాజు, రాష్ట్ర సమితి సభ్యులు వైవీ కృష్ణా రెడ్డి, మధు సుధన్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజి, జిల్లా సహాయ కార్యదర్శులు శివ, అవినాష్, వెంకటేష్, ఉపాధ్యక్షుడు దస్తగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరు మధు, చిరంజీవి, ఏపీ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఫీ, జిల్లా అధ్యక్షుడు ఎన్ సుధాకర్, వీడియో

- ఆంధ్ర జ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్య దారుణం
- శ్రీ గంధం స్మగ్లర్లను వెంటనే అరెస్ట్ చేయాలి
- జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలి
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఏప్రిల్ 29న జరిగే ఆందోళనలను జయప్రదం చేయండి
- ఏపీయూడబ్ల్యూజే పిలుపు

జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు స్నేహల్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మీడియా తో మాట్లాడారు. చిత్తూరు జిల్లాలో శ్రీగంధం మాఫియా పై జగన్మోహన్ రెడ్డి ఇటీవల వార్తలు రాశారన్నారు. అయితే ఇది జీర్ణించుకోలేని వ్యక్తులే జగన్మోహన్ రెడ్డిని హత్య చేశారన్న అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు.

అందుకే ఈ హత్య పై లోతుగా దర్యాప్తు చేయాలని, హత్య చేసిన వారిని, ప్రోత్సహించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టులపై హత్యలు, దాడులు మాత్రం ఆగడం లేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం స్పందించి జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి హత్య కు నిరసిస్తూ.. ఏప్రిల్ 29(బుధవారం)న కర్నూలు జిల్లా వ్యాప్తంగా జరిగే ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళనలో మండల, తాలూకా కేంద్రాల్లో ఉన్న జర్నలిస్టులంతా పాల్గొని ఈ హత్యను ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# రైతుల కోసం ఎల్‌నినోను ఎదుర్కొనే మార్గాలపై అవగాహన



### ఏపీ సీ ఎన్ ఎఫ్ ఆధ్వర్యంలో సహజ వ్యవసాయ శిక్షణ కార్యక్రమం

### గుంతకందాల ఆర్ ఎస్ కె లో వ్యవసాయ శిక్షణ రైతులకు మార్గదర్శకం

**వెలుగోడు, ఏప్రిల్ 28 (నంది పత్రిక):** వెలుగోడు మండలంలోని గుంతకందాల గ్రామ రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి స్వాతి అధ్యక్షత వహించారు. ఈ శిక్షణలో వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది మరియు ఏపీ సీ ఎన్ ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్) క్షేత్ర సహాయ సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఈ ఏడాది ఎదురయ్యే ఎల్‌నినో వాతావరణ ప్రభావాలను రైతులు ఎలా ఎదుర్కోవాలో ఏపీ సీ ఎన్ ఎఫ్ యూనిట్ ఎఫ్ఎమ్ టి ఎస్. సుబ్బరాయుడు వివరించారు. ఈ సందర్భంగా పెల్లేటిజేషన్ ద్వారా విత్తనాల శుద్ధి, వెదజల్లే పద్ధతి, బీజామృతం, ఘనజీవామృతం తయారీ విధానాలు, వివిధ రకాల సహజ కషాయాల తయారీ మరియు వాటి ఉపయోగాలను సిబ్బందికి వివరించారు. అదనంగా ఏటీఎం(అగ్రో ఎకాలజీ పద్ధతి) విధానంలో కూరగాయల సాగు విధానంపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా సిబ్బందిని గుంతకందాల గ్రామంలోని ఏటీఎం ప్లాట్స్‌కు తీసుకెళ్లి అక్కడ జరుగుతున్న సాగు విధానాలను ప్రత్యక్షంగా చూపించారు. అలాగే పెల్లేటిజేషన్ తయారీ విధానాన్ని ప్రదర్శించారు. కే.కే.బి.ఆర్.సి కేంద్రం ద్వారా పిఎండిఎస్ కిట్లు తయారు చేసి మొత్తం 60 కిట్లను సిద్ధం చేసి రైతులకు పంపిణీ చేశారు. అలాగే 30 రకాల పంట విత్తనాలను సుమారు 12 కిలోల పరిమాణంలో రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ సి యజమాని కె. కృష్ణస్వామి, మండల స్థాయి ఆర్ ఎస్ కె సిబ్బంది, ఏపీ సీ ఎన్ ఎఫ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులు సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించి వాతావరణ మార్పులకు తట్టుకునే విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.



# విజయగాథ - నంద్యాల జిల్లా



### అబ్బిపురం గ్రామం, మహానంది మండలం

### జలధార జలహారతి కార్యక్రమం కింద ఉప కాలువ పునరుద్ధరణ పనులకు శ్రీకారం

### కలెక్టర్ జి. రాజకుమారి ఆమోదంతో

### అబ్బిపురంలో కాలువ పునరుద్ధరణకు శ్రీకారం

### జలధారజలహారతి కింద సాగునీటి సదుపాయాలకు బలమైన అడుగు

### పూర్తయితే 94 ఎకరాలకు నీరుడ రైతుల పొలాలు పచ్చదనం వైపు

**నంద్యాల బ్యూరో. ఏప్రిల్ 28. (నంది పత్రిక ):** మహానంది మండలంలోని అబ్బిపురం గ్రామంలో "జలధార – జలహారతి" కార్యక్రమం కింద ఉప కాలువ (సబ్ మైనార్ కెనాల్) పునరుద్ధరణ పనులు వారం రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ కాలువను పునరుద్ధరించాలనే రైతుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఈ పనులకు పరిపాలనా అనుమతి మంజూరు చేశారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, సాగునీటి కొరత కారణంగా పంటలు దెబ్బతింటున్న విషయాన్ని గుర్తించిన కలెక్టర్ , ఈ కాలువ పునరుద్ధరణ అత్యవసరమని భావించి వెంటనే చర్యలు తీసుకున్నారు. ఆమె ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి పనులను ప్రారంభించారు. ఈ చర్యలతో గ్రామ రైతుల్లో నమ్మకం పెరిగి, త్వరలోనే తమ పొలాలకు నీరు అందుతుందనే ఆశాభావం నెలకొంది. మందా రామకృష్ణ పొలం నుండి ఈర్ల సునిత పొలం వరకు సాగుతున్న ఈ పనులు రూ. 2,31,966 వ్యయంతో చేపడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 730 మ్యాండేస్ ఉపాధి కల్పించబడుతోంది. పనులు పూర్తయిన తర్వాత తెలుగుగంగ కాలువ 9వ బ్లాక్ నుండి నీరు సాఫీగా ఈ కాలువలో ప్రవహించేలా చర్యలు చేపడుతున్నారు. ఈ కాలువ ద్వారా ముందుగా బుక్కాపురం గ్రామంలోని బొల్లవానికుంటకు నీరు చేరి, అక్కడి నుండి నంద్యాల మండలం ఎ. కోడూరు గ్రామం వరకు సాగునీరు అందనుంది. సుమారు 5 ఎకరాల విస్తీర్ణం గల బొల్లవానికుంట కూడా నిండిపోవడం వల్ల పరిసర ప్రాంతాలకు అదనపు ప్రయోజనం కలుగనుంది. ఈ పనులు పూర్తయితే దాదాపు 32 మంది రైతులకు చెందిన 94 ఎకరాల భూమికి సాగునీరు అందుతుంది. ఇప్పటి వరకు వర్షాలపై ఆధారపడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఇది గొప్ప ఊరటనివ్వనుంది. కాలువలో నీరు ప్రవహించడం ప్రారంభమైతే, రైతుల పొలాలు పచ్చగా కళకళలాడుతూ మంచి దిగుబడులు అందించనున్నాయి. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ముందుచూపు, సమయోచిత నిర్ణయం వల్ల ఈ పనులు ప్రారంభమవడం గ్రామాభివృద్ధికి కీలకంగా మారింది.



"జలధార – జలహారతి" కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి వనరులు మెరుగుపడుతూ రైతుల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకు వస్తున్నాయి. అబ్బిపురం గ్రామానికి చెందిన రైతు పాలుస్వామి మాట్లాడుతూ, తమ గ్రామంలో చేపడుతున్న తెలుగు గంగ కాలువ పూడికతీత పనులు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా 9వ బ్లాక్ పరిధిలో జరుగుతున్న ఈ పనుల వల్ల వర్షపు నీరు ఎలాంటి అడ్డంకులు లేకుండా సజావుగా కాలువ గుండా ప్రవహించి 'గొల్లవాని కుంట'లో చేరుతుందని ఆయన పేర్కొన్నారు. దీంతో సాగులో ఉన్న పంటలకు నీటి ముంపు ప్రమాదం తగ్గి, రైతులకు భద్రత కలుగుతోందని అన్నారు. అలాగే ఈ పనుల ద్వారా గ్రామంలోని కూలీలకు ఉపాధి అవకాశాలు కలగడం ఆనందకరమని, గత పది రోజులుగా పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. మొత్తంగా, ఈ పూడికతీత పనులు గ్రామ వ్యవసాయానికి రక్షణగా నిలిచేలా ఉండటమే కాకుండా, గ్రామ ప్రజలకు ఆర్థికంగా కూడా మేలు చేస్తున్నాయని పాలు స్వామి అభిప్రాయపడ్డారు.



# ఈర్నపాడులో ట్యాంకు కూల్చేశారోచ్

నంది పత్రిక కథనానికి స్పందన






**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 28:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు గ్రామంలోని ట్యాంకును మంగళవారం ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కూల్చివేశారు. గత 15 సంవత్సరాలుగా గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిరుపయోగంగా ఉన్న కారణంగా శిథిలావస్థకు చేరుకుంది. దీనితో బ్యాంకు పిల్లర్స్ కూడా బాగా దెబ్బతిన్నాయి. జనావాసం ప్రాంతంలో ట్యాంకు ఉండటంవల్ల ఎప్పుడు కూలిపోతుందోనని గ్రామ ప్రజలు ఆందోళనతో కాలం గడిపారు. ట్యాంకు శిథిలావస్థకు చేరిన విషయాన్ని, ఈనెల 13న ఈ ట్యాంకు కూల్చివేసి పుణ్యం కట్టుకోండి అంటూ నంది పత్రికలో వార్త ప్రచురించడం జరిగింది. ఇదే విషయాన్ని పలుమార్లు ఆర్డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి పల్లె నంది విలేకరి తీసుకొని పోవడం జరిగింది. ప్రోక్లైన్ డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో ట్యాంకు కూల్చివేతకు ఆటంకం ఏర్పడింది. మంగళవారం ఈర్నపాడు గ్రామానికి ప్రోక్ లైనర్ ను రప్పించి ఓవర్ హెడ్ ట్యాంకును కూల్చివేశారు. ఈ విషయంపై స్పందించిన ఆర్డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మీనరసింహకు, నంది దినపత్రికకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ట్యాంకును కూల్చి వేసే సమయంలో ఎంపీడీవో గాయత్రి, డిప్యూటీ ఎంపీడీవో అన్నం పురుషోత్తం, ఇన్చార్జి కార్యదర్శి సుబ్బారావు ఇక్కడే ఉండి పరిస్థితిని సమీక్షించారు.

# మే 2న ఎస్వీ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



**శ్రీశైలం :** శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభి వృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆత్మకూరు లోని ఎస్.వి.డిగ్రీ కళాశాల ఆవరణము నందు మే 02న జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి. శ్రీకాంత్ రెడ్డి తెలియ జేశారు. ఈ జాబ్ మేళాకు సంబంధించి పట్టణ , మరియు మండల టిడిపి నేతలు ఆత్మకూరు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఈ జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు ఈ జాబ్ మేళాకు 10ప్రైవేట్ కంపెనీలు క్విస్కార్ప్,అమరరాజ ఎనర్జీ మరియు మొబిలిటీ, స్కాలిన్ వర్క్ పీపుల్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ,నవత రోడ్ ట్రాన్స్ పోర్ట్, యాక్సెస్ బ్యాంక్, హెటిరో ల్యాబ్, ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ కంపెనీ, చోళ మండలం గోల్డ్ లోన్, డిక్సెన్ మరియు సుజల పైప్స్ చెందిన ప్రతినిధులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనుటకు పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, దీ.ఎవఎష్ట్ర,దీ/ఙ/వీ్రాష్టుతీఎ్ఖఎ మరియు పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హుల న్నారు. కావున జిల్లా లోని నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగము చేసుకో గలరని తెలియ జేశారు. వీటికి సంబంధించిన ఇతర వివరముల కొరకు 9951400588, 9154830286 నెంబరుకు లేదా ఖుఙజూబఅఖుఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ సంప్రదించాలని తెలియజేశారు.

# కామ్రేడ్ సుదర్శన వర్మ నాగిరెడ్డిల ఆశయాలను కొనసాగిద్దాం: సిపిఎం



**వెలుగోడు, ఏప్రిల్ 28 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలో కామ్రేడ్ సుదర్శన వర్మ, నాగిరెడ్డిల వర్ధంతి సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వారి సమాధుల వద్ద ఘనంగా నివాళి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సమాధుల వద్ద పూలమాలలు వేసి స్మరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఏ. రాజశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఏసురత్నం, మాజీ ఎంపీపీ ఎల్లాల కృష్ణుడు, వెలుగోడు మాజీ సర్పంచ్ జయపాల్, యాదాటి రవీంద్రుడు, సిపిఎం కార్యదర్శి మహమ్మద్ రఫీ, సిఐటియు జిల్లా నాయకులు రామాంజనేయులు, ఆవాజ్ నాయకులు నూరుల్లా, తెలుగు రమణ,తదితరులు పాల్గొన్నారు. సభ సిపిఎం కార్యదర్శి మహమ్మద్ రఫీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేదల సంక్షేమం, కష్టజీవుల హక్కుల కోసం అహర్నిశలు పోరాడి ప్రాణత్యాగం చేసిన సుదర్శన వర్మ, నాగిరెడ్డిల సేవలు ఎర్రజెండా ఉన్నంతవరకు చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. కుల, మత భేదాలు లేకుండా ప్రజల సంక్షేమం కోసం పోరాటం చేసిన వీరులను ప్రజలు ఎప్పటికీ మరువరని పేర్కొన్నారు. కాంగ్రెస్ గుండాల చేత హత్యకు గురైన ఈ నేతలు కష్టజీవుల పక్షాన నిలిచిన నిజమైన ప్రజా నాయకులని వారు తెలిపారు. నేటి పాలకులు కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో ప్రజలను విభజిస్తూ వారి సమస్యలను పక్కన పెడుతున్నారని విమర్శించారు. అధికారమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రస్తుత పాలకుల్లో నీతి, నిజాయితీ కనిపించడం లేదని అన్నారు. వెలుగోడు పట్టణం మరియు పరిసర గ్రామాలలో పేదలు, అణగారిన వర్గాల కోసం అనేక సేవలు చేసిన సుదర్శన వర్మ, నాగిరెడ్డిలను ప్రజలు ఇప్పటికీ స్మరించుకుంటున్నారని చెప్పారు. వారి ఆశయాలు, సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేయాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వెంకటయ్య, నాగమోహన్, ఎర్రబాషా, గాడి మల్ల భాష, రామకృష్ణ, నూరుల్లా తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పైలట్ రోహిత్ రెడ్డికి బెయిల్

సంచలనం సృష్టించిన మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి ఊరట లభించింది. దాదాపు ఒకటిన్నర నెలలుగా జైలులో ఉన్న ఆయనకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.కేసు వివరాల్లోకి వెళితే... గత మార్చి 14వ తేదీ రాత్రి మొయినాబాద్‌లోని ఫాంహౌస్‌పై పోలీసులు జరిపిన దాడుల్లో కొకైన్, విదేశీ మద్యం, ఇతర నిషేధిత వస్తువులు లభ్యమయ్యాయి. ఈ క్రమంలో రోహిత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు రితేశ్ రెడ్డి, వ్యాపారవేత్త నమిత్ శర్మలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ రాత్రి పార్టీలో పాల్గొన్న 11 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో ఆరుగురికి డ్రగ్స్ తీసుకున్నట్లు పాజిటివ్‌గా తేలింది. ఈ కేసులో రోహిత్ రెడ్డి తరఫు న్యాయవాదులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, బెయిల్ మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. బెయిల్ ప్రక్రియ పూర్తి కావడంతో, రేపు చంచల్‌గూడ జైలు నుంచి ఆయన విడుదలయ్యే అవకాశం ఉంది.

# నవధాన్యాల సాగుతో నేలకు పోషకాలు




**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 28:** తొలకరి ఆరంభంలో ఈ దిశగా విస్తరణ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ అన్నారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్కే, ఏపీ సీఎఎన్ ఎఫ్ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ నవధాన్యాల సాగు వల్ల నేల సాలవంతమై ప్రధాన పంటలకు అవసరమైన పోషకాలు లభిస్తాయని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తాయని, దీనివల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని రైతులకు కూడా కట్టెలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ దిశగా రైతులు అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఆధునిక విధానాలు తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం క్షేత్రస్థాయిలో రామసుబ్బారెడ్డి అనే రైతు సాగుచేసిన పిఎండిఎస్ పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తారణ సిబ్బంది లక్ష్మయ్య, సాయి హిమబిందు అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది చక్రి,మధు, రామకృష్ణ,సుహాసిని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఈశ్వరయ్య, శివకుమార్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు



## ముందస్తు అడ్మిషన్ల పేరుతో దోపిడీ చేస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలి: విద్యార్థి సంఘాలు

### అక్రమ ప్రచార ఫ్లెక్సీలు తొలగించిన బిసి విద్యార్థి సంఘాలు

### డీఈఓ, ఆర్ఐఓ నిర్లక్ష్యంపై విద్యార్థి సంఘాల ఆగ్రహం



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** కర్నూలు నగరంలో విద్యను వ్యాపారంగా మార్చుతున్న ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, పిడిఎస్యు, వైఎస్ఆర్ఎస్యు, ఆర్పీఎసేఎఫ్, బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాజ్ విహార్, సి-క్యాంపు, చెక్‌పోస్ట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, పిడిఎస్యు జిల్లా నాయకులు రమణకుమార్, వైఎస్ఆర్ఎస్యు రాష్ట్ర కార్యదర్శి కటారి కొండ సాయి, ఆర్పీఎసేఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గిరీష్ మాట్లాడుతూడ ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా లాభాల వ్యాపారంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్ల పేరుతో అక్రమ ప్రచారాలు నిర్వహిస్తూ నగరమంతా భారీ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి తల్లిదండ్రులు, విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తున్నప్పటికీ జిల్లా డీఈఓ, ఆర్ఐఓ అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. అందరికీ కనిపించే విధంగా నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు విద్యాశాఖ అధికారులకు మాత్రమే కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన అలెన్, ఎడిఫై, వేదాంత్ విద్యాసంస్థల భారీ హోర్డింగ్‌లను తొలగించినట్లు తెలిపారు. తక్షణమే జిల్లా యంత్రాంగం స్పందించి నగరంలో ఉన్న అన్ని అక్రమ బ్యానర్లు, హోర్డింగ్‌లను తొలగించాలని, ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకొని అవసరమైతే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నగర్ కార్యదర్శి అశోక్ నాయకులు అభి ఏఐఎస్ఏ జిల్లా సహాయ కార్యదర్శి సాయి పవన్ నాయకులు సూర్య, నాని పిడిఎస్యు నాయకులు వీరేష్,కిరణ్ మహేష్ వైఎస్ఆర్ ఎస్యు,ఆర్పిఎస్ఎఫ్,బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు..



# రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలి





### రీ సర్వే కి ముందు ప్రతి రైతుకు ముందస్తు నోటీసులు తప్పనిసరి ఇవ్వాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** జిల్లాలో చేపట్టిన రీ-సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించడంతో పాటు ప్రతి రైతుకు ముందస్తు నోటీసులు తప్పనిసరిగా అందజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో జరుగుతున్న 5వ దశ రీ-సర్వే ప్రక్రియను జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో సుమారు 10,542 ఎకరాల విస్తీర్ణంలో జరుగుతున్న రీ-సర్వే పనులను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వే ప్రక్రియలో పొలం సరిహద్దుల నిర్ధారణ, భూమి రికార్డుల సమీక్ష, రోవర్ సాంకేతిక విధానాల వినియోగం వంటి అంశాలను జాగ్రత్తగా అమలు చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా, సమయపాలన పాటిస్తూ రీ సర్వే పనులను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రీ-సర్వేలో భాగంగా రైతులకు ముందస్తు సమాచారం అందించడం అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి రైతుకు వ్యక్తిగతంగా నోటీసులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతుల సహకారం లేకుండా ఈ ప్రక్రియ విజయవంతం కాదని, కాబట్టి వారికి పూర్తి అవగాహన కల్పిస్తూ పారదర్శకంగా ముందుకు సాగాలని తెలిపారు. అదే విధంగా, వేసవి కాలంలో భూములను ఖాళీగా ఉంచకుండా పీఎండీఎస్ పద్ధతిలో వివిధ రకాల పంటలను సాగు చేయడం ద్వారా భూమి సారవంతం పెరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

జిల్లాలో రీ-సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడం ద్వారా భూ సంబంధిత వివాదాలు తగ్గిపోవడంతో పాటు రైతుల హక్కులు మరింత బలపడతాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జిల్లా సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మిక ప్రమాదాల పై తీసుకునే చర్యలు పటిష్టంగా ఉండాలి




### మాక్ డ్రిల్ ను సక్రమంగా ప్రమాణాలతో నిర్వహించాలి

### రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ ఎండి ప్రఖర్ జైన్

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** ఈ నెల 30 వ తేదీన అన్ని జిల్లాలలో నిర్వహించనున్న మాక్ డ్రిల్ ను సక్రమంగా ప్రమాణాలతో నిర్వహించాలి అని ఆకస్మిక ప్రమాదాల పై తీసుకునే చర్యలు పటిష్టంగా ఉండాలి అని జిల్లా అధికారుల ను రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ ఎండి ప్రఖర్ జైన్ ఆదేశించారు. మంగళవారం ఉదయం విజయవాడ నుండి రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ ఎండి ప్రఖర్ జైన్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఈ నెల 30 వ తేదీన రాష్ట్రమంతటా నిర్వహించనున్న మాక్ ఎక్సర్సైజ్ పై , ఏర్పాట్ల పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ... ప్రమాదం జరిగిన వెంటనే సంబంధిత అధికారులకు అందరికీ సమాచారాన్ని వేగంగా అందజేయాలని, ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి అన్ని విధాల అన్ని వసతులు సమకూర్చుకొని చర్యలు చేపట్టాలని కోరారు. ఆయిల్ మరియు కెమికల్ ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదం తీవ్రతను అంచనా వేయగలగాలి , ప్రమాదం జరిగిన ప్రదేశంలో కావలసిన పరికరాలు , దుస్తులు , మంటలను ఆర్పుటకు నీరు - ఫోమ్, అగ్నిమాపక యంత్రాలు అంబులెన్సులు, స్ట్రెచర్లు, అనుభవం కలిగినడాక్టర్లు , మందులు అన్నీ ఉండేలాగా గాయపడ్డ వారిని అక్కడే వైద్యం చేయటానికి షెల్టర్ మరియు ఆసుపత్రులకు తరలించడానికి సౌకర్యాలు కల్పించాలని , ప్రమాద తీవ్రతను అంచనా వేసే విధంగా జిఐఎస్ మ్యాప్,సైట్ మ్యాప్ లు ఉంచుకోవాలని కోరారు. ప్రమాదం జరిగిన కంపెనీలో ఎంత మంది ఉద్యోగులు ఉన్నారు ఎంతమంది ప్రమాదానికి గురైనారు అన్న విషయాలు వెంటనే బేరీజు వేసుకొని కంపెనీని జోన్లుగా ఏర్పాటు చేసుకుని బాధితులకు సపర్యలు చేయాలని తెలిపారు అవసరమైతే రోడ్లను బ్లాక్ చేసి బాధితులను తరలించేందుకు ఏర్పాటు చేయాలని కోరారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కలగ చేసుకోవాలని కోరారు. స్థానిక పోలీసులు కూడా ఇందులో పాల్గొని సేవలు అందించాలని కోరారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ రిటైర్డ్ కమాండెంట్ ఆదిత్య కుమార్ మాట్లాడుతూ...చాకచక్యం తో పరిస్థితులను అంచనా వేసుకుని సమిష్టి కృషితో ఆస్తి




ప్రాణనష్టాన్ని నివారించాలని ప్రమాద తీవ్రతను వెంటనే తగ్గించే చర్యలు తీసుకోవాలని కోరారు .ఈ సమావేశంలో డి ఆర్ ఓ చిరంజీవి, జిల్లా ఇన్స్పెక్టర్ అఫ్ ఫాక్టోరీస్ నారాయణ రెడ్డి, డిజాస్టర్ మానేజ్మెంట్ డి పి ఎం సురేష్ కుమార్, డిస్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ అవినాష్ జయసింహా,జి ఎం ఇండస్ట్రీస్అశోక్ కుమార్,జి జి హెచ్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు,డి సి హెచ్ ఎస్ డాక్టర్ జాఫరూల్లా,డి ఎం హెచ్ ఓ కామేశ్వర్ రావు,డి ఈ ఓ సుధాకర్,పొల్యూషన్ కంట్రోల్ ఈ ఈ కిషోర్ రెడ్డి, మున్సిపల్ డాక్టర్ విషవేశ్వర్ రెడ్డి, హెచ్ పి సి ఎల్ మేనేజర్ ముకుంద రాఘవ, అనంతపురం అభిమన్యు దార్ ,సివిల్ సప్లై డి ఎం వెంకటరాముడు,మహేశ్వర్ రెడ్డి ఈ ఈ ట్రాన్సకో, ఎస్ డి ఆర్ ఎఫ్ బీసీ నాయక్, మహేంద్ర నాయక్, 108 అనిల్ కుమార్ ప్రవేట్ ఆసుపత్రుల యాజమాన్యం, పోలీస్ మొదలగు వారు పాల్గొన్నారు.

# వక్ఫ్, దేవాదాయ భూములను ఆక్రమణలకు గురి కాకుండా రక్షించాలి




### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** వక్ఫ్, దేవాదాయ భూములు ఆక్రమణలకు గురి కాకుండా రక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు...మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వక్ఫ్ మరియు ఎండోమెంట్ భూముల పరిరక్షణ పై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వక్ఫ్, దేవాదాయ భూములలో అక్రమ కట్టడాలు లాంటివి జరగకుండా ఫెన్సింగ్ వేయించి, బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వక్ఫ్, దేవాదాయ భూముల సర్వే నెంబర్ ల వివరాలను జిల్లా రిజిస్ట్రార్‌కు, సబ్ రిజిస్ట్రార్లకు పంపించాలని తద్వారా వాటిని రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నిషేధిత జాబితాలో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా వక్ఫ్ భూమిలో నిర్మాణాలు ఏమైనా చేపడితే ముందుగా వారికి నోటీస్ లు ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. అదే విధంగా అటువంటి నిర్మాణాలకు విద్యుత్ కనెక్షన్ కట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న వక్ఫ్ ఖాళీ స్థలాల్లో న్యాచురల్ ఫెన్సింగ్ వేయాలని, మొక్కలు నాటాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో వక్ఫ్, దేవాదాయ భూములపై దృష్టి సారించాలని కలెక్టర్ మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు.. భూములను రిజిస్ట్రేషన్ చేసే సమయంలో నియమ నిబంధనలు పాటించాలని కలెక్టర్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను ఆదేశించారు.. భవన నిర్మాణాలకు అనుమతుల విషయంలోనూ నియమ నిబంధనలను పాటించాలని కలెక్టర్ మునిసిపల్ కమిషనర్ లను ఆదేశించారు..దేవాదాయ శాఖకు సంబంధించి పెండింగ్ లో ఉన్న భూములను కూడా వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సుమారు 22,000 ఎకరాలకు సంబంధించి రీకాన్సిలేషన్ ప్రక్రియ సాగుతోందన్నారు. ఇందులో ఇప్పటికే 12,000 ఎకరాల పని పూర్తయిందని, డబుల్ ఎంట్రీలు ఉన్న 3,500 ఎకరాలను తొలగించామని కలెక్టర్ పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, ఆన్లైన్ ద్వారా ఆర్డీవోలు,మునిసిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు..



# సంక్షేమ వసతి గృహాలను “నెట్ జీరో & హెల్తీ క్యాంపస్”లుగా అభివృద్ధి చేయడం లక్ష్యం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**జిల్లాలోని అన్ని సంక్షేమ రెసిడెన్షియల్ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు మరియు హాస్టళ్లను “నెట్ జీరో & హెల్తీ క్యాంపస్ లుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూల్స్ హాస్టళ్లలో నెట్ జీరో మరియు హెల్తీ క్యాంపస్ లుగా రూపొందించే అంశంపై సంక్షేమ శాఖలు, విద్యుత్, నెడ్ క్యాప్ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వసతి గృహాలను ప్రభుత్వం నెట్ జీరో & హెల్తీ క్యాంపస్ లుగా తీర్చిదిద్దడం లో భాగంగా నెట్ జీరో ఎనర్జీ, పచ్చదనం పెంపు, నీటి సంరక్షణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మొదటి దశలో రెసిడెన్షియల్ స్కూల్స్, తదుపరి దశలో సంక్షేమ వసతి గృహాలలో ఈ ప్రక్రియ అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నెట్ జీరో ఎనర్జీ ఏర్పాటు లో భాగంగా సంబంధిత హాస్టల్స్ విద్యుత్ వినియోగాన్ని అంచనా వేసి, తదనుగుణంగా సౌర రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ మరియు నెట్ క్యాప్ అధికారులను ఆదేశించారు. వసతి గృహంలో వంటగది వ్యర్థాల నిర్వహణ లో భాగంగా వెజిటబుల్ డీకంపోజింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, తడి మరియు పొడి/రీసైకిల్ వ్యర్థాల వర్గీకరణ వ్యవస్థను అమలు చేసి సమర్థవంతమైన రీసైక్లింగ్‌ను సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంచాలని, సోక్ పిట్స్ ద్వారా ఉపయోగించిన నీటిని తిరిగి వినియోగించే చర్యలు చేపట్టాలన్నారు. హాస్టళ్లలో మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని, కిచెన్ గార్డెన్ లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డి ఆర్ డి ఎ, డ్వామా శాఖల అధికారులు ఇందుకోసం తగిన సహకారం అందించాలన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, సంక్షేమ విద్యాసంస్థలను పర్యావరణహిత మరియు ఆరోగ్యకర క్యాంపస్‌లుగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

**హాస్టల్ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలి** అరికేర వసతి గృహాల్లో ఇటీవల జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులను క్రమశిక్షణతో నడిపించడం అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణతో పాటు, , కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. వసతి గృహాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, విద్యార్థుల భద్రత,



ఆరోగ్యం మరియు ప్రవర్తనపై క్రమం తప్పకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా, వసతి గృహాల్లోని టాయిలెట్ల మరమ్మత్తులను జూన్ 15 నాటికి పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన మరియు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంక్షేమ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాధిక, జిల్లా బీసీ వెల్ఫేర్అధికారి ప్రసూన,డ్వా మా పిడి నరసింహారెడ్డి, డి.ఆర్.డి.ఎ పిడి రమణారెడ్డి, డిపివో భాస్కర్, నెట్ క్యాప్ అధికారి వీరేంద్ర, రెసిడెన్షియల్ స్కూల్స్ కో ఆర్డినేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పట్టణంలో వివిధ కాలనీలో నీటి సమస్యలను తీర్చండి

## మండగిరి డిఎల్పిఓ ఆఫీసర్ కి వైసీపీ నేతలు వినతి పత్రం అందజేత



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని పట్టణంలోని శ్రీరామ్ నగర్, స్టేట్ బ్యాంక్ కాలనీ, సీతారాం నగర్ కాలనీ లో నీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం వైసీపీ నేతలు మండగిరి డిఎల్పిఓ ఆఫీసర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది అనంతరం వైఎస్ఆర్సిపి ఆదోని పార్టీ పట్టణ అధ్యక్షులు బి దేవా మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ కాలనీ శ్రీరామ నగర్ తిరుమల నగర్ సీతారాం నగర్ పోస్టల్ కాలనీ ఈ ఏరియాలో వారం ఒక్కసారి గంట లేక అరగంట మంచినీళ్లు అవి కూడా అరకొర ఒక్కొక్కసారి 15 రోజులకు ఒకసారి ఇలా ఇష్టానుసారంగా నీళ్లు వదలక ప్రజలకు మంచి నీటి సమస్యను తీవ్రతం చేస్తా ఉన్నారు మరి అధికారులు ఈరోజు పంచాయతీ టాక్సు వసూలు చేస్తూ ప్రజలకు అరకొర సేవలు చేస్తూ కాలయాపన చేస్తా ఉన్నారు మరి స్థానికంగా ఎమ్మెల్యే పార్థసారథి గారు మీడియాలో భారీగా ఉపన్యాసాలు ఇస్తా ఉంటారు ఆదోని రెండో ముంబై గా ఏపీ లోనే పెద్ద మున్సిపాలిటీ పెద్ద పంచాయతీ గా ఉన్న సమస్యలు మాత్రం తీర్చే నాధుడే కరువైనారు ఎన్నికల ముందేమో అబద్దాల ప్రచారాలతో ఎమ్మెల్యే గెలిచినటువంటి పార్థసారథి అభివృద్ధి చేయడంలో జీరోగా మిగిలిపోయారు ఆదోని అభివృద్ధి అనే మాట శూన్యంగా మిగిలిపోయింది ఈ పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి ఏరియాలో అంతా కూడా వారం కు రెండుసార్లు మంచినీళ్లు కనీసం రెండు మూడు గంటలైనా ఇవ్వాలి లేనిపక్షంలో వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో పంచాయతీ ఆఫీస్ ముట్టడిస్తామని సంబంధిత అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మనీ తాయెర్ హారికృష్ణ ప్రభు తదితరులు పాల్గొన్నారు

# ఏపీలో పెట్రోల్ డీజిల్ సంక్షోభం..

## కృతిమ కొరత సృష్టిస్తున్న కూటమి నేతలు ? వైసీపీ





దేశంలో ఎక్కడా లేనివిధంగా కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే పెట్రోల్ డీజిల్ సంక్షోభం మొదలైంది ఇది కచ్చితంగా కూటమి నేతలు సృష్టిస్తున్న కృతిమ కొరత అని వైసిపి నేతలు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ కొరత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నేడు నంద్యాల పట్టణం డేనియల్ పురం నయారా పెట్రోల్ బంక్ వద్ద మాజీ శాసనసభ్యులు కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నేతలు ఎమ్మెల్సీ ఇసాక్ బాష, .... నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే పెట్రోల్ డీజిల్ సంక్షోభం ఉండడం కూటమి నాయకులు వేసిన స్కెచ్ అని వారే కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని ఆరోపించారు. గత కొద్దిరోజులుగా ఈ సమస్య మరింత తీవ్రమైందని అయినా కూటమి ప్రభుత్వంలో కనీసం చలనం కనిపించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో 4510 పెట్రోల్ బంకులు ఉండగా 70% వాటిలో నో స్టాక్ బోర్డులు పెట్టారని తెలిపారు. అక్క రాష్ట్రమైన తమిళనాడు కర్ణాటక తెలంగాణలలో ఎక్కడా పెట్రోల్ డీజిల్కు కొరతలేదని ఎటువంటి సరఫరాలో సంక్షోభం లేదని స్పష్టం చేశారు. పెట్రోల్ డీజిల్ కొరతపై వైఎస్ఆర్సిపి ఎంపీలు కేంద్ర మంత్రులను సంప్రదిస్తే సరఫరా లో ఎక్కడ లోటు లేదని పెట్రోల్ బంక్ లో నుంచి ఒక్క ఇండెంట్ కూడా పెండింగ్ లేకుండా సరఫరా చేస్తున్నామని చెప్పారని పేర్కొన్నారు. అయితే ఇక్కడ పెట్రోల్ డీజిల్ కొరత ఎందుకు ఏర్పడింది అందుకు కారణం ఎవరు అన్నది కూటమి ప్రభుత్వ నేతలు చేర్చాల్సి ఉందన్నారు. ఆయుధాలు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్ డీజిల్ ధరలు పెంచుతారు అన్న ప్రచారం జోరుగా సాగుతుందని దీనిని బట్టి డీలర్లు స్టాక్ ఉన్నా కూడా నో స్టాక్ బోర్డులను ఉంచుతున్నారని ఆరోపించారు. పెట్రోల్ డీజిల్ కొరత వల్ల రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలగజేస్తుందని, ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ రత్నాబాబు చౌదరి, రాష్ట్ర మహిళ విభాగం సెక్రటరీ శశికల రెడ్డి,వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్,అధికార ప్రతినిధి అనిల్అమృతరాజ్,మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు కారురవి కుమార్, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడుటివి రమణ , జిల్లా సెక్రటరీ లు దేవనగర్ భాషా, శివ నాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్స్ ఆరిఫ్ నాయక్, కలాం భాష,చింపింగ్ బాసిద్, మునయ్య,మేష చంద్రశేఖర్, వైసీపీ నాయకులు కిరణ్ కుమార్, రహంతుల్లా, సాయిరాం రెడ్డి, శ్రీరాములు, శంకర్ నాయక్, దండే సుధాకర్, గోపాల్ రెడ్డి,జలీల్, బాబు తదితరులు పాల్గొన్నారు

# నేల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం..

# ఆరోగ్య భద్రతను ఇద్దాం! - ఏఓ జి. సుమతి

## రైతు సేవా కేంద్రాల, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ



**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 28 (నంది పత్రిక):** మండల కేంద్రంలో మంగళవారం రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మరియు ప్రకృతి వ్యవసాయ విభాగం (ఏపీసీఎన్ఎఫ్) సిబ్బందికి రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జి. సుమతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాగు మెళకువలు, భూసార రక్షణపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోరు బావుల సౌకర్యం ఉన్న ప్రతి రైతు తమ పొలంలో తప్పనిసరిగా 30 రకాల విత్తనాలు కలిగిన ముందస్తు పొడి విత్తన సాగు కిట్లను వేసేలా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఒకవేళ వర్షాలు ఆలస్యమైనా, ఈ కిట్లలోని ఆకుకూరలు, కూరగాయల ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, నేల ఆరోగ్యాన్ని పెంపొందించడం ద్వారానే నాణ్యమైన పంటలు పండుతాయని ఆమె పేర్కొన్నారు. తద్వారా మానవాళికి ఆరోగ్య భద్రత కల్పించడంలో వ్యవసాయ శాఖ సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేవలం లక్ష్యాల కోసమే కాకుండా, రైతుల మేలు కోసం వెలుగు సిబ్బందితో కలిసి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి రాజు, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి శంకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** నగరంలో నిర్వహించే పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం తగదని, ప్రజలు సంతృప్తి చెందేలా విధులు నిర్వర్తించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. మంగళవారం ఆయన ఆశోక్ నగర్, పాతబస్తీ, కల్లూరు ప్రాంతాల్లో ఆయన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చిన్న, మధ్య స్థాయి కాలువల్లో ప్రతి వారం పూడికతీత పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న సమయంలో ప్రత్యేకంగా గ్యాంగ్ వర్కర్లతో పూడికతీత పనులు నిర్వహించాలని సూచించారు. పూడికతీత అనంతరం తీసిన వ్యర్థాలను 24 గంటలలోపు పూర్తిగా తొలగించాలని కమిషనర్ స్పష్టం చేశారు.కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రాజు, మునిస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన కమిషనర్





**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన చల్లా ఓబులేసు మంగళవారం కర్నూలు ఎంపీ బస్తీపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలను వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. నగరాభివృద్ధి, ప్రాధాన్యత పనులపై చర్చించారు.

# జిల్లాలో మత్తు పదార్థాల రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలి

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....**జిల్లాలో మత్తు పదార్థాల రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో నార్కోటిక్స్ కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా సంస్థల వద్ద మత్తు పదార్థాల విక్రయాలపై గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సు ల ద్వారా మత్తు పదార్థాల రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్ స్క్రీనింగ్ కిట్ లను మరి కొన్ని తెప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ నగరంలో ఉన్నటువంటి చీకటి ప్రదేశాలలో కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేసి, మంచి లైటింగ్, పెయింటింగ్ మరియు జజుం కెమెరాలను అమర్చాలని తద్వారా సంబంధిత ప్రమాదకరమైన ప్రాంతాలు సురక్షితమైన ప్రదేశాలుగా మారిపోయే అవకాశం ఉంటుందన్నారు. ఎక్కడైనా గంజాయి సేవిస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు అనుమానం వచ్చినట్లయితే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం చేరవేయాలని ఎస్పి అధికారులకు సూచించారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, డిఇఓ సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, డిటీసి శాంత కుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక, బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన పాల్గొన్నారు.



# “నంద్యాలలో మృతి చెందిన భవన కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటాం - ఫిరోజ్“



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 28 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని 39వ వార్డు ఖైర్మల్ స్ట్రీట్ శిరీష హాస్పిటల్ ప్రక్క వీధిలో జరిగిన దుర్ఘటనపై తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీవీణ ఫిరోజ్ గారు స్పందించారు. ఈరోజు ఉదయం పాత భవన మరమ్మత్తుల కొరకు భవన నిర్మాణ పనులు చేస్తుండగా ఇంటి స్లాబ్ చరియలు అకస్మాత్తుగా విరిగి పడటంతో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.వీరిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ సమాచారం అందుకున్న వెంటనే చీవీణ ఫిరోజ్ గారు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గాయపడిన భవన కార్మికుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 39వార్డు టీడీపీ ఇంచార్జ్ జాకీర్,వార్డు నాయకులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





## ఎమ్ ఆర్‌వో రత్న రాధిక జనా భా గణన అవగాహన కార్యక్రమం



**ఆత్మకూరు మండలం నంది పత్రిక** ఆత్మకూరు మండలం కరివేన గ్రామం లో తహసీల్దార్ శ్రీమతి రత్నా రాధిక గారు జనాభా గణన కు సంబంధించి స్వీయ గణన ప్రక్రియ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే మండలం లోని ప్రజలందరూ మే 1 నుండి ప్రారంభం అయ్యే హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ లో పాల్గొని సహకరించాల్సిందిగా తెలిపారు. ఈ ప్రక్రియలో బాబా సాహెబ్ పీర్, జూనియర్ అసిస్టెంట్ ఖాజా, ఎ=వా, సచివాలయం సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ అనుమతి పొందిన కంపెనీల విత్తనాలు విక్రయించాలి.

### ప్రత్తి విత్తన శుద్ధి కేంద్రాలు,దుకాణాలు తనికి.



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 28 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని వివిధ ప్రత్తి విత్తన శుద్ధి కేంద్రాలు,దుకాణాలు తనికి చేసినట్టు సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ కమిషనర్ గారి ఆదేశాల మేరకు గత 2 రోజులుగా అనగా 27.04.2026 , 28.04.2026 వ తేదీలలో కమిషనరేట్ వ్యవసాయ శాఖ నుంచి సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వర్లు ,వ్యవసాయ అధికారి లక్ష్మి రెడ్డి , మండల వ్యవసాయ అధికారి నంద్యాల ప్రసాద రావు తో కలిసి మండలములో గల ప్రత్తి విత్తన శుద్ధి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయడము జరిగినది. ఈ కార్యక్రమములో బాగంగా ప్రత్తి విత్తన శుద్ధి కేంద్రాలలో తనిఖీలు నిర్వహించి రికార్డులను పత్తి నిల్వలను, ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమము లో బాగంగా విత్తన శుద్ధి కేంద్రాలలో ఏు టెస్ట్ నిర్వహించడం జరిగింది,ఇందులో ఏు నెగెటివ్ వచ్చినది. ప్రతి యొక్క విత్తన శుద్ధి కేంద్రం యొక్క యజమాని విత్తన శద్ధి కేంద్రానికి సంబంధించిన అన్ని రిజిస్టర్లు నిర్వహించాలని తెలియచేసారు.అలాగే మండలం యందలి పలు రిటైల్ దుకాణాల లో తనిఖీ నిర్వహించి దుకాణాలలో స్టాక్ రిజిస్టర్, రషీదులు పరిశీలించడం జరిగింది. అదేవిధంగా పలు ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీస్ ని పరిశీలించి వివిధ ప్రాంతాల నుంచి విత్తన విక్రయాల గురించి ఆరా తీయడం జరిగింది.ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేవలము వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే



విక్రాయించాలని అలాగే విత్తనాలు కొన్న రైతులకు రషీదులు ఇవ్వాలని, ప్రతీ రోజు స్టాక్ రిజిస్టర్ అప్డేట్ చెయ్యాలని అలాగే విత్తనాల నిల్వ మరియు ధరల పట్టికను నిర్వహించాలని సూచించడం జరిగింది . ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే వారిపై విత్తన చట్టము 1966 మరియు విత్తన నియంత్రణ క్రమము 1983 ప్రకారము చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి ప్రాణాలు కాపాడుకోండి

### కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్

### రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం

### వీడియోల ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.

### " నేను ట్రాఫిక్ మిత్ర " ఫిర్యాదులపై చర్యలు అవగాహన కౌన్సెలింగ్

### సురక్షిత ప్రయాణమే లక్ష్యం



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన కల్పించేందుకు కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ మాట్లాడుతూ...నేను ట్రాఫిక్ మిత్ర' ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించామని తెలిపారు. కౌన్సెలింగ్‌లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక వీడియోలను ప్రదర్శించి, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాల రికవరీని వేగవంతం చేశామని, వాహనదారులు పెండింగ్ చలానాలను వెంటనే చెల్లించాలని సూచించారు.నిబంధనల ఉల్లంఘన పునరావృతమైతే డ్రైవింగ్ లైసెన్స్‌ల రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు.కర్నూలు ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ కోరారు.

## కొత్తూరు సుబ్బరాయునికి "వెండి గంట" విరాళం..!

### ఆలయ ఈవో యం.రామక్రిష్ణ.

**పాణ్యం ప్రతినిధి. ఏప్రిల్ 28. నంది పత్రిక:** ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి వెండి గంట విరాళంగా మంగళవారం భక్తులు సమర్పించారని ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. వెలుగోడు మండలానికి చెందిన పలస రాము వారి ధర్మపత్ని పలస ప్రత్యూష కుటుంబ సభ్యులు, వారికి స్వామివారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా 30 తులాలు సుమారు 72,000-/ వేలు విలువగల "వెండి గంటను" విరాళంగా సమర్పించారు, వారికి ఆలయ మర్యాదలతో స్వామివారికి అభిషేకం, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి, శేష వస్త్రములతో ఘనంగా సన్మానించి ప్రసాదము వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల నారాయణస్వామి, ఆలయ సిబ్బంది మరియు దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలి

### అన్ని శాఖలు సమన్వయంతో రహదారి భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి





**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**జిల్లాలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించి, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా రోడ్డు రవాణా శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, సంబధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణను అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని, ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి గ్రామంలో రోడ్డు విస్తరణ కు సంబంధించిన భూసేకరణ సమస్యలు పెండింగ్‌లో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వాటిని వారం రోజుల్లో పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అనంతపురం దిశగా వెళ్లే ఎన్.హెచ్-44 రహదారిపై రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు రోడ్డు భద్రతను మెరుగుపరచాలని పేర్కొన్నారు. రోడ్డు మరమ్మతుల సమయంలో ఆర్ & బి (=&దీ) మరియు పైపులైన్ విభాగాలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని, ప్రణాళికతో పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నగర పరిధిలో ఆర్ & బి మరియు మున్సిపల్ శాఖలు కలిసి రోడ్లపై ఉన్న గుంతలను (పాట్ హోల్స్) గుర్తించి, మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బి మరియు పంచాయతీరాజ్ రోడ్డు ఇరువైపుల పెరిగిన చెట్ల పొదలను తొలగించి, డ్రైవర్‌లకు స్పష్టమైన విజిబిలిటీ కల్పించాల్సిన అవసరం ఉందని, ప్రమాదాలు జరుగు ప్రదేశాలలో స్పీడ్ బ్రేకర్లను వేయవలసిందిగా ఆదేశించారు.కర్నూలు పట్టణంలోని ఆనంద్ టాకీస్ సమీపంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జ్‌కు చేపట్టనున్న మరమ్మత్తుల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు అలాగే, కిడ్స్ వరల్డ్ పార్క్ నుంచి కలెక్టరేట్ వరకు ఉన్న ప్రధాన రహదారిని విస్తరించి ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఇక పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న అడ్డదిడ్డంగా ఉన్న తోపుడు బండ్ల దుకాణాలను క్రమబద్ధీకరించి, రహదారి సౌకర్యాన్ని మెరుగుపరచాలని స్పష్టం చేశారుఆర్డీవోలు ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని తమ పరిధిలో ఉన్న రోడ్ బ్లాక్ స్పాట్లను గుర్తించి, పూర్తి వివరాలతో నివేదికలను సమర్పించాలని సూచించారు.ట్రాన్స్కో సంబంధిత పనులు రోడ్డుపై చేసేటప్పుడు సంబంధిత ఎస్ఈ ల పర్మిషన్ మరియు మున్సిపల్ కార్పొరేషన్ పర్మిషన్లు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూడ జాతీయ రహదారులపై సమగ్రంగా, నిరంతరంగా లైటింగ్ సదుపాయాలు కల్పించేందుకు సంబంధిత శాఖలు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి వేళల్లో ప్రమాదాల నియంత్రణలో సరైన వెలుతురు అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, జాతీయ రహదారులపై సంచరించే వాహనాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో రోడ్డు భద్రతను మెరుగుపరచడానికి ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కచ్చితంగా అమలు చేసి, ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా డిటిసి శాంతకుమారి మాట్లాడుతూ జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటివరకు కాంపౌండ్ల రూపంలో రూ.52 లక్షల 30 వేలకుపైగా వసూళ్లు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా స్కూల్ బస్సుల ఫిట్నెస్ టెస్టులు నిర్వహిస్తూ, రాత్రి సమయంలో దీర్ఘదూర వాహనాల డ్రైవర్ల కోసం ఫేస్ వాష్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ చర్యలన్నీ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి,ఎస్ఈ పి ఆర్ ప్రభాకర్ రెడ్డి,ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, డి టీ సీ శాంత కుమారి, ఆర్టీవో భరత్ చౌహన్, డి ఎం అండ్ హెచ్ వో కామేశ్వరరావు , కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేష్ , మున్సిపల్ ఎస్ ఈ రమణమూర్తి, ఎన్ టి ఆర్ హెల్త్ కోర్డినేటర్ భాస్కర్ రెడ్డి ,ఎన్ హెచ్ పిడి లు,ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు . వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కర్నూలు పత్తికొండ ఆదోని ఆర్డీవోలు పాల్గొన్నారు...



# ఏబీఎన్ ఆంధ్రజ్యోతి జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి హత్య దారుణం

### నిందితులను కఠినంగా శిక్షించాలి

### విలేఖరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 28 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలో తాలూకా పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కాంప్లెక్స్ జర్నలిస్ట్ కార్యాలయంలో జర్నలిస్టు నాయకుల సమావేశం నిర్వహించారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి దినపత్రిక జర్నలిస్ట్ జగన్ మోహన్ రెడ్డి హత్య దారుణమని సీనియర్ జర్నలిస్ట్ సీఎం నాగేంద్ర పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా వి కోట లో జరిగిన జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి హత్యను ఖండించిన జర్నలిస్ట్ సీఎం నాగేంద్ర మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కష్టపడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తుతెలియని దుండగులు సోమవారం వీ కోట లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి దినపత్రిక విలేఖరి జగన్మోహన్ రెడ్డిని అత్యంత దారుణంగా హత్య చేయడం పాశవిక చర్య అని పేర్కొన్నారు. నిజాలను వెలికితీస్తే అవినీతి అక్రమ చర్యలకు వ్యతిరేక వార్తలు రాస్తే హత్యలు చేస్తారని ప్రశ్నించారు. గత కొద్దిరోజులుగా చిత్తూరు జిల్లాలో శ్రీగంధం మాఫియా పై జగన్మోహన్ రెడ్డి వార్తలు రాశారని ఇది జీర్ణించుకోలేని వ్యక్తులే ఏబీఎన్ ఆంధ్రజ్యోతి జర్నలిస్ట్ జగన్ మోహన్ రెడ్డిని హత్య చేశారని అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ విషయంలో ప్రభుత్వం లోతుగా దర్యాప్తు చేయాలని హత్యకు ప్రోత్సహించిన వారిని హత్య చేసిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని దుండగల చేతిలో ప్రాణాలు కోల్పోయిన జగన్మోహన్ రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇటువంటి దాడులు హత్యలతో నిజాల నోరు మూయించలేరని నిర్భయంగా వార్తలు రాసే విలేకరులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని ప్రభుత్వాలు మారిన జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు హత్యలు ఆగడం లేదని ప్రత్యేకమైన రక్షణ చట్టంతో వీటికి అడ్డుకట్ట వేయాలని జర్నలిస్టు సీఎం నాగేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు సీఎం నాగేంద్ర, పిచ్చికే హనుమంతు, రామన్న, జక్కల సుధాకర్, రాము, పెద్దన్న, గిరి, కటారి కృష్ణ, నాగరాజు, వేణుగోపాల్ తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

## జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి హత్య హేయం

### సిపిఐ నంద్యాల జిల్లా సమితి



**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 28. (నంది పత్రిక ):**చిత్తూరు జిల్లా వి. కోటలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డిని దుండగులు దారుణంగా హత్య చేయడం పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ నంద్యాల జిల్లా సమితి తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ క్రూరమైన చర్యను సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫకృద్దీన్ ఒక సంయుక్త ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.జగన్మోహన్ రెడ్డి ప్రతిరోజూలాగే ఉదయం వాకింగ్‌కు వెళ్లిన సమయంలో, ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగులు కత్తులతో వెంటాడి కిరాతకంగా నరికి చంపడం సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన జర్నలిస్టులపై ఇలాంటి భౌతిక దాడులు జరగడం పత్రికా స్వేచ్ఛను అణచివేయడమేనని వారు మండిపడ్డారు. ఈ హత్యకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రౌడీ షీటర్ తమీమ్‌తో పాటు, ఈ ఘటన వెనుక ఉన్న వారందరినీ తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో జర్నలిస్టుల రక్షణ ప్రశ్నార్థకంగా మారిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు. విధి నిర్వహణలో ఉన్న విలేఖరులకు భద్రత కల్పించడంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి దారుణాలకు పాల్పడే శక్తులను ఇనుప పాదంతో అణచివేయాలని రంగనాయుడు, బాబా ఫకృద్దీన్ డిమాండ్ చేశారు.

## ఉపాధి లేక కూలీల ఆకలి కేకలు!

### పీడీకి వినతిపత్రం అందజేసిన వ్యవసాయ కార్మిక, రైతు సంఘం నాయకులు

**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 28 . (నంది పత్రిక ):**కొలిమిగుండ్ల మండలంలోని చింత లాయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు అటకెక్కడంతో కూలీల పరిస్థితి దయనీయంగా మారింది. చింతలాయపల్లి, మదనంతపురం, ఎస్.చెన్నంపల్లి, రాఘవరాజుపల్లి గ్రామాల్లో సుమారు 400 మందికి పైగా కూలీలు పనులు లేక ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సమస్యపై స్పందించిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సోమన్న, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి భూమని శ్రీనివాసులు మంగళవారం జిల్లా పీడీ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేసవి కాలం సగభాగం గడిచినా కొలి మిగుండ్ల మండలంలో ఉపాధి పనులు ప్రారంభించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గత రెండు నెలలుగా 'రేపు-మాపు' అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో పనులు మొదలుపెట్టిన దాఖలాలు లేవన్నారు. మే నెల ముగిస్తే వర్షాలు ప్రారంభమై వ్యవసాయ పనులు మొదలవుతాయని, అప్పుడు ఉపాధి పనులు నిలిచిపో తాయని కూలీలు ఆవేదన చెందుతున్నట్లు పేర్కొన్నారు. చట్ట ప్రకారం ప్రతి కార్డుదారునికి 125 రోజుల పని దినాలు కల్పించాల్సి ఉండగా, అధికారుల ఉదాసీనత వల్ల కూలీల కుటుంబాలు ఆర్థిక ఇబ్బం దుల్లో కూరుకుపోతున్నాయని వారు విమర్శించారు. మహిళా కూలీలు ఇతర పనులు లేక ఇళ్ల వద్దనే ఖాళీగా ఉంటున్నారని, తక్షణమే ఈ నాలుగు గ్రామాల్లో ఉపాధి పనులు మంజూరు చేయా లని డిమాండ్ చేశారు. పీడీకి అందజేసిన వినతి పత్రంలో, వారం రోజుల్లోగా పనులు ప్రారం భించనిపక్షంలోపెద్దఎత్తునఆందోళనకార్యక్రమాలుచేపడతామనివారుఈసందర్భంగాహెచ్చరించారు



# జగన్మోహన్ రెడ్డిని హత్య చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

- శ్రీగంధం మాఫియా పై వార్తలు రాసినందుకే హత్య
- నిజాలు రాస్తే హత్యలు చేయడం దారుణం
- లోతుగా దర్యాప్తు చేసి హత్య వెనుక ఉన్న వారిని అరెస్ట్ చేయాలి
- జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలి
- హత్య చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

**అమరావతి, ఏప్రిల్ 28:** చిత్తూరు జిల్లా, వీ కోట ఆంధ్ర జ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డిని హత్య చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి జయరాజ్, ఐజేయూ సెక్రటరీ జనరల్ డి సోమసుందర్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏచూరి శివ, ప్రధాన కార్యదర్శి రామచంద్ర రావు, సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఏపీ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు.

మంగళవారం వారు మీడియా తో మాట్లాడారు. చిత్తూరు జిల్లాలో శ్రీగంధం మాఫియా పై జగన్మోహన్ రెడ్డి ఇటీవల వార్తలు రాశారన్నారు. అయితే ఇది జీర్ణించుకోలేని వ్యక్తులే జగన్మోహన్ రెడ్డిని హత్య చేశారని ఆరోపించారు. ఈ హత్య పై లోతుగా దర్యాప్తు చేయాలని, హత్య చేసిన వారిని, హత్య వెనుక ఉన్న వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మీడియా స్వేచ కోసం భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు జరగకుండా జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి హత్య కు నిరసిస్తూ..

రాష్ట్ర వ్యాప్త శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చారు. జర్నలిస్టులంతా ఆందోళనలో పాల్గొని ఈ హత్యను ముక్తకంఠంతో ఖండించాలని కోరారు.

# నేలమట్టమైన వరి పైర్లు

## అకాల వర్షం అన్నదాతకు నష్టం



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 28 :** అకాల వర్షం కారణంగా రైతులు ఆర్థిక నష్టాన్ని చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బండి ఆత్మకూరు మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం రైతుల పాలిట శాపముల మారింది. రెండు రోజుల క్రితమే చిన్నదేవ లాపురం గ్రామంలో వరి ధాన్యాన్ని కోసి ధాన్యాన్ని పొలాల్లో ఆరుబయట ఆరబోసుకున్నారు. ఊహించని రీతిలో అకాలంగా వర్షం కురియడంతో ధాన్యంపై ప ట్టలు కప్పుకునేందుకు పంట పొలాల్లోకి రైతులు పరుగులు తీశారు. అప్పటికే చాలా మంది రైతులకు సంబంధించిన దాన్యం తడిసిపోయాయి. కంచర్ల రంగయ్య, గోవిందు అనే రైతులకు సంబంధించిన 450 బస్తాలు తడిసి ముద్ద అయిపోయాయి. ఎస్సీ కాలనీ చెందిన లాజర్, ఆంజనేయులు, రాగాలి దాసు,అబ్రహం, కడపటి సుధాకర్,మహేశ్వరమ్మ, శేఖర్, వెంకటరమణ ,విజయ్ లకు సంబంధించిన ధాన్యం కూడా తడిసి ముద్దయ్యాయి. ప్రస్తుతం మార్కెట్లో షుగర్ లెస్ ధాన్యం ధర బస్తా 1580 ఉండడంతో, అకాల వర్షం కారణంగా ధాన్యం తడిచిపోయాయని, ధాన్యాన్ని కొనేందుకు వ్యాపారస్తులు ముందుకు రాకపోతే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. చిన్నదేవలాపురం ప్రాంతంలో దాదాపు 150 ఎకరాలు అకాల వర్షం కారణంగా నేలమట్టం అయిపోయాయి. ప్రభుత్వం తమను ఆదుకొని ధాన్యం కొనుగోలు అయ్యేలా చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**పిడుగులతో భీతిల్లిన ప్రజలు** బండి ఆత్మకూరు మండలంలో ఉరుమురు మెరుపులతో కురిసిన వర్షానికి



ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఉరుములతో పాటు విపరీతంగా పిడుగు శబ్దాలు రావడంతో చిన్న పెద్ద తోపాటు, ప్రజలందరూ భయంతో వణికిపోయారు. చిన్నదేవలాపురం గ్రామంలో వరి పంట నేలమట్టం కాగా, అకాల వర్షం కారణంగా మొక్కజొన్న పంటలు కూడా బాగా దెబ్బతిని పరిస్థితులు ఏర్పడ్డాయి. బండి ఆత్మకూరులో కూడా వరి ధాన్యం కుప్పలు తడిచిపోవడంతో రైతులు తలడిల్లి పోతున్నారు.ఎండ వేడిమికి, ఉక్క పోతతో తల్ల డిల్లిపోయిన ప్రజలకు అకాల వర్షం కాస్త ఊరట కలిగించినప్పటికీ, రైతులను మాత్రం ఆర్థికంగా దెబ్బతీసింది.

# శ్రీశైలం దేవస్థానంలో ధర్మకర్తల మండలి సమావేశం







**శ్రీశైలం ఏప్రిల్28 (నంది పత్రిక)** దేవస్థానం ధర్మకర్తల మండలి 6వ సమావేశం నిర్వహించబడింది. కార్యాలయ భవనములోని మీటింగ్ హాల్ నందు ఈ ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించబడింది. కాగా సమావేశంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్నాయుడు, సభ్యులు శ్రీ బోడేపూడి వెంకటసుబ్బారావు, శ్రీమతి జవ్వాజి రేఖాగౌడ్, వీడియోకాన్ఫరెన్సు ద్వారా పాల్గొన్నారు. కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, తక్కిన పలువురు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు ప్రత్యక్షంగా ఈ సమావేశంలో పాల్గొన్నారు.సమావేశంలో మొత్తం 22 అజెండా అంశాలు చర్చించబడ్డాయి. వీటిలో 15 అంశాలు ఆమోదించబడ్డాయి. తక్కిన వాటిలో 5 అంశాలు వాయిదా వేయడం జరిగింది. మిగిలిన 2 అంశాలు తిరస్కరించబడ్డాయి.సమావేశం ప్రారంభంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు మాట్లాడుతూ మౌలికసదుపాయాల కల్పనపై ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. అదేవిధంగా క్షేత్రాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోబడుతాయన్నారు. ముఖ్యంగా భక్తులరద్దీకనుగుణంగా ఆయా ఏర్పాట్లను చేయడం జరుగుతుందన్నారు. భక్తుల నుంచి పూర్తిస్థాయి సంతృప్తి వచ్చేవిధంగా ఆయా ఏర్పాట్లను చేయడం జరుగుతుందన్నారు. కాగా సమావేశంలో క్షేత్రపరిధిలో భక్తులరద్దీకనుగుణంగా గుర్తించిన మొత్తం 20 ప్రదేశాలలో బి.ఓ.టి పద్ధతిన అన్ని సౌకర్యాలతో శాశ్వత శౌచాలయాల ప్రాంగణాలను ( పర్మనెంట్ పబ్లిక్ టాయిలెట్స్) నిర్మించాలని తీర్మానించడం జరిగింది. రాబోవు 6 మాసాలలోగా ఈ పని పూర్తి చేయాలని నిర్ణయించడమైనది.టోల్గేట్ సమీపం నుంచి కుమారసదనం వరకు రూ. 24లక్షల వ్యయంతో సి.సి రోడ్డు నిర్మించాలని తీర్మానించడమైనది. వర్కుషాపు నుంచి పాతాళగంగ పాతమెట్ల వరకు రూ. 36,50,000 లక్షల అంచనా వ్యయంతో అండరు గ్రౌండ్ డ్రైనేజీ బైపాస్ పనులు చేపట్టుటకు తీర్మానించడమైనది. దేవస్థానం గో సంరక్షణశాలలో గోవులకు అవరమైన వరిగడ్డి మరియు పచ్చిగడ్డి సరఫరాకు సంబంధించిన టెండరును ఆమోదించడమైనది. సిద్ధరామప్ప షాపింగ్ కాంప్లెక్సు నందు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు నూతన శాఖను ఏర్పాటు చేసుకొనుటకు ఆమోదాన్ని తెలపడం జరిగింది. ఇంకా సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. రోజురోజుకు పెరుగుతున్న భక్తులరద్దీకనుగుణంగా క్యూకాంప్లెక్సునిర్మాణాన్ని త్వరలో చేపట్టాలని నిర్ణయించబడింది. అదేవిధంగా సామాన్య భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు క్షేత్రపరిధిలో పలుచోట్ల ఉన్న ప్రస్తుత డార్మిటరీలను ఆధునీకరించడంతో పాటు నూతనంగా మరిన్ని డార్మిటరీలను నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించబడింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాబోవు వర్షాకాలంలో క్షేత్రపరిధిలో పలుచోట్ల కనీసం ఆరువేల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకోవడం జరిగింది.

# విలేఖరి హత్య అత్యంత బాధాకరం

## డిసిసి అధ్యక్షులు బి క్రాంతి నాయుడు

**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** ఆంధ్రజ్యోతి విలేకరిని హత్య చేయడం అత్యంత బాధాకరమైన విషయమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి క్రాంతి నాయుడు తెలియజేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి పత్రికా ప్రకటన విడుదల చేస్తూ చిత్తూరు జిల్లా, వి కోట విలేఖరి జగన్మోహన్ రెడ్డి హత్య తీవ్రంగా కలచి వేసిందనీ అత్యంత దారుణంగా నరికి చంపడం చాలా దురదృష్టకరం అత్యంత దుర్మార్గం, విలేకరి జగన్మోహన్ రెడ్డి కి మా అశ్రునివాళి, మంగళవారం ఒక ప్రెస్ రిపోర్టర్ను అత్యంత దారుణంగా హత్య చేశారు. విలేకరులు సమాజంలో అత్యంత ముఖ్యమైన భూమిక పోషిస్తారు. సమాజంలో జరుగుతున్న నిజాలను వెలికి తీసి భయపడకుండా బయటపెడతారు. మన సమాజంలో వారిది కీలక భూమిక అలాంటి విలేకరులకే భద్రత లేదంటే శోచనీయం దానికి కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదుడ కానీ హత్య బాధాకరమైన విషయమని, ఏ కారణం అయినా సరేడ హింసకు ఎప్పటికీ తావు ఉండకూడదని ఈ ఘటనపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుని, దోషులపై ఎలాంటి కనికరం




లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. న్యాయం జరగాలి నిజం బయటకు రావాలి. ఇది ఒక్క వ్యక్తి విషయం మాత్రమే కాదుడ మన సమాజంలో ప్రతి ఒక్కరి భద్రత గురించి అలాగే ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తూ వారి కుటుంబానికి కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ప్రభుత్వం వెంటనే ఇలాంటి చర్యల్ని పూర్తిగా తుడిచిపెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నానని క్రాంతి నాయుడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, మైనార్టీ కాంగ్రెస్ నాయకుడు షేక్ మాలిక్ భాష, 48 వ వార్డు ఇంచార్జి షేక్ షబ్బీర్ పాల్గొన్నారు.

## రవ్వలకొండ పై నరసింహ జయంతి మరియు స్వాతి వేడుకలు

**బనగానపల్లె ఏప్రిల్ 28నందిపత్రిక** బనగానపల్లె పట్టణ శివారులో భానుముక్కల గ్రామము, రవ్వలకొండ పై వెలసిన, శ్రీ శ్రీ శ్రీ చెంచులక్ష్మి సమేత పావన నరసింహ స్వామి దేవస్థానము నందు, 30 వ తారీఖున నరసింహ జయంతి మరియు మే 1న స్వాతి వేడుకలు జరుగునని దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రధాన అర్చకులు బాలిశెట్టి పావన నరసింహ మూర్తి తెలిపారు. స్వామి వారి భక్తులు ఈ అవకాశాన్ని, వినియోగించుకోవాలని ఆయన తెలియజేశారు



## ఓటర్ జాబితా ఖచ్చితత్వం కోసం సమగ్ర చర్యలు

### కర్నూలు నియోజకవర్గ ఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు

### రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

### బూత్ లెవెల్ వద్ద సమన్వయం పెంపు అవసరం



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** ఓటర్ జాబితా ఖచ్చితత్వం కోసం చేపడుతున్న సమగ్ర చర్యలకు రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. మంగళవారం వెంకటరమణ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూడ ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. డెమోగ్రాఫికల్ సెమిలర్ ఎంట్రీలను గుర్తించి తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయించడం, తప్పుల సవరణలు, తొలగింపుల కోసం ఫారం 6, 7, 8 లను సమర్థవంతంగా వినియోగించడం అత్యంత అవసరమన్నారు.ఎన్నికల సంఘం తరపున బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్, డిఎస్ఈ, ఫారం 6, 7, 8ల ప్రక్రియను నిర్వహిస్తున్నారని, ఈ ప్రక్రియలో బూత్ స్థాయిలో సమన్వయం పెంపు ద్వారా ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయవచ్చన్నారు. ఎన్నికల శుద్ధి, పారదర్శకత మరియు ఖచ్చితత్వం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా సహకరించాలని కోరారు.అదేవిధంగా ఓటర్ నమోదు, సవరణలపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎస్ఈ రమణమూర్తి, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రం లో ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారు

### ఏ రాష్ట్రం లో లేని పెట్రోల్, డీజిల్ సమస్య మనకే ఎందుకు

### విజనరీ అన్న బాబు ఎక్కడున్నారు.. మాజీ ఎమ్మెల్యే కాటసాని



**బనగానపల్లె ఏప్రిల్ 28నందిపత్రిక** రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని దాని ఫలితమే ఇప్పుడు పెట్రోల్ డీజిల్ సమస్య అని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన బనగానపల్లె పట్టణంలోని నయారా పెట్రోల్ బంకును పరిశీలించి వాహనదారులు పెట్రోల్ డీజీల్ కోసం పడుతున్న అవస్థలను గమనించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఐదు రోజుల నుంచి డీజిల్,పెట్రోల్ కొరతతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు రాష్ట్ర చరిత్రలో కూటమి ప్రభుత్వంలో బనగానపల్లె నియోజకవర్గంలో కనివిని ఎరగని రీతిలో డీజిల్, పెట్రోల్ కొరత ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు

**ముందుచూపు విజినరీ అంటున్న బాబు ఎక్కడ....ఉన్నావు...** మాది విజనరీ 2047 ప్రభుత్వం అని గొప్పలు చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. నాడు కరోనా కష్టకాలంలో కరోనాను సమర్థంగా ఎదుర్కొన్న నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రజలు, రైతులు, నిరుద్యోగులు అందరు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్రంలో ముందు చూపు లేకపోవడం తోనే ఈ కష్టాలని డీజిల్ ,పెట్రోల్ కొరత ఇలాగే కొనసాగితే వైఎస్ఆర్సిపి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు.కార్యక్రమం లో అధికార ప్రతినిధి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, బనగానపల్లె పట్టణ వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు అబ్దుల్ ఫైజ్, భానుముక్కల ప్రాథమిక సహకార సంఘం మాజీ చైర్మన్ నీలి శ్రీనివాసులు, ఎంపీటీసీ తాహెర్ హుస్సేన్, మాజీ వార్డ్ మెంబర్ సూరి, ఖానిక్, గౌస్ పీరా,కలాం,రాము, మద్దయ్య, వైఎస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

### యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యుజెఎఫ్)డిమాం డ్



**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** చిత్తూరు జిల్లా,వి.కోట,ఆంధ్రజ్యోతి విలేఖరి జగ న్మోహన్ రెడ్డి దారుణ హత్యను యునైటెడ్ జర్న లిస్ట్ ఫోరం(యుజెఎఫ్)తీవ్రంగా ఖండించింది.ఈ మేరకు మంగళవారం ఆంధ్రజ్యోతి విలేఖరి జగ న్మోహన్ రెడ్డి దారుణ హత్య చేసిన నిందితుల ను కఠినంగా శిక్షించాలని యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యుజెఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షులు నీ లం సత్యనారాయణ,సభ్యులు యూసుఫ్ ఖాన్ రాజశేఖర్,జి.వి జయ్ కుమార్,నాగేంద్ర,కిషోర్, వై.వి.రెడ్డి,వి.విజయ్ కుమార్,మెట్రోమధు,ప్ర సాద్ లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి తమ ప్రగాడ సానుభూ తి తెలిపారు.అదేవిదంగా జగ న్మోహన్ రెడ్డి కు టుంబానికి ప్రభుత్వం అన్నివిధాలుగా సహాకారం అందించాలని కోరారు.సుప్రీం కోర్టు,హైకోర్టులు జ ర్నలిస్ట్ లపై దాడులను ఖండిస్తూ ఆదేశాలు జారీ చేసిన కూడా రాష్ట్ర వ్యాప్తంగా దాడులు కొనసా గుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.భ విష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కా కుండా ప్రభుత్వం జర్నలిస్ట్ రక్షణ చట్టం అమలు చేయాలనీ వారు డిమాం డ్ చేశారు.

## కేసీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన మల్లు రవి

బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఎంపీ మల్లు రవి కౌంటర్ ఇచ్చారు. పార్లమెంటులో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా కేసీఆర్ మాట్లాడటం సరికాదని మల్లు రవి హితవు పలికారు. కేసీఆర్ ఎక్కువగా ఫాంహౌస్కే పరిమితం కావడం వల్ల బయటి విషయాలపై ఆయనకు అవగాహన తగ్గుతోందని విమర్శించారు. ముఖ్యంగా లోక్సభలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటును అవమానిస్తూ మాట్లాడినప్పుడు కాంగ్రెస్ ఎంపీలు మౌనంగా ఉన్నారన్న కేసీఆర్ ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలు చేసిన వెంటనే తాము పార్లమెంటులోనే నిరసన తెలిపామని, ఆయన క్షమాపణ చెప్పాలని గట్టిగా డిమాండ్ చేశామని మల్లు రవి గుర్తు చేశారు. అసలు విషయం తెలుసుకోకుండా కాంగ్రెస్ నేతలపై బురదజల్లడం కేసీఆర్ మానుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ఎప్పుడూ గౌరవిస్తుందని, కానీ కేసీఆర్ మాత్రం తన రాజకీయ ఉనికి కోసం అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.

## వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

### -జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఖాసీం వల్లి



**పోరుమామిళ్ల, ఏప్రిల్ 28 ( నంది పత్రిక ):** వేసవి సెలవులలో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానవంతులు కావాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఖాసీం వల్లి అన్నారు.మంగళవారం పోరుమామిళ్ల గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఆఫ్రిది ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఖాసీం వల్లి మాట్లాడుతూ... విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకొని బహుముఖ ప్రజ్ఞావంతులు కావాలన్నారు. విద్యార్థులకు పలు రకాల కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థి కథల పుస్తకాలు చదివి అందులోని నీతిని గ్రహించి ఉత్తమ నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం, గణిత ఆటలు, పర్యావరణ అవగాహన, ఆంగ్లంపై పట్టు సాధించడం, చెస్, క్యారం తదితర అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. వేసవిలో పిల్లలు బయట తిరగకుండా గ్రంధాలయానికి వచ్చి పుస్తకాలు చదివి విజ్ఞాన వంతులు కావాలని జెవివి జిల్లా నాయకులు దాదాపీర్ అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంధాలయ పాఠకులు పవన్ కుమార్, సుబ్బారావు, సంజీవరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రావు బహదూర్ బీపీ శేషారెడ్డి 141వ జయంతి.

### మే 1 న క్రికెట్ టోర్నమెంట్.




**బేతంచెర్ల ఏప్రిల్ 28 (నంది పత్రిక )** బేతంచెర్ల పట్టణంలో మాజీ ఎమ్మెల్యే రావు బహుదూర్ బీపీ శేషారెడ్డి 141వ జయంతి పురస్కరించుకొని, మే 1వ తేదీన పట్టణంలోని ఓపెన్ టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించడం జరుగును..శేషారెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్ లో విజేతకు ప్రథమ బహుమతిగా 50 వేలు రూపాయలు,ద్వితీయ బహుమతిగా రూ 30వేలు, తృతీయ బహుమతిగా రూ 20 వేలు రూపాయలు అందించి నున్న ట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వివరాల కోసం 95814 04374. 91103 56008. 66885 29808 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

## 30న ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ ను విజయవంతం చేయాలి.

### జిల్లా ఇన్చార్జి డిఆర్వో వెంకటపతి



**కడప, బ్యూరో చీఫ్ ఏప్రిల్ 28 నంది పత్రిక :** ఈ నెల 30వ తేదీన కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిసరాల్లోని అదీప్ ల్యాబొరేటరీ యూనిట్ లో నిర్వహిస్తున్న ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ చేపట్టి.. విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి డిఆర్వో వెంకటపతి పేర్కొన్నారు.మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్రంలో ఆయిల్, కెమికల్ ఉత్పత్తి కేంద్రాల్లో విపత్తులను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించే.. "ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహణ"పై ఏపీఎస్ డిఎంఏ అధికారులు అన్ని జిల్లాల సంబందిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా ఇంచార్జి డిఆర్వో వెంకటపతి, ఇండస్ట్రీస్ ఇన్స్పెక్టర్ చీఫ్ చిన్నారావ్ సంబందిత శాఖల అధికారులు హాజరయ్యారు ఈ సందర్భంగా రాష్ట్ర సీఎస్ అన్ని జిల్లాల అధికారులతో ఆయిల్, కెమికల్ విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనే చర్యలపై అవగాహనను పెంచే.. ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం ఇన్చార్జి డిఆర్వో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు, జిల్లా వ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల నిర్వహణ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు మరియు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఈ నెల 30వ తేదీన ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ మాక్ డ్రిల్ ప్రక్రియ.. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (చీఐఏపీా) మార్గదర్శకాల ప్రకారం నిర్వహించబడుతుందన్నారు. జిల్లాలోని కొప్పర్తి పరిశ్రమల ప్రాంతంలో ఉన్న "అదీప్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్" మరియు సమీపంలోని పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ మాక్ డ్రిల్ ప్రక్రియలో భాగంగా.. అగ్ని ప్రమాదం, ప్రమాదకర రసాయనాల లీకేజీ వంటి అత్యవసర పరిస్థితులను మోడల్ రూపంలో ప్రదర్శించి, సంబంధిత విభాగాల సమన్వయాన్ని పరీక్షించనున్నారన్నారు. మాక్ డ్రిల్ సమయంలో కొప్పర్తి పరిసర ప్రాంతాల్లో భద్రతా కారణాల రీత్యా కొన్ని పరిమితులు అమలులో ఉంటాయన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, అధికారుల సూచనలను పాటిస్తూ ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ మాక్ డ్రిల్ పూర్తిగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగమే అని ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతను దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న ఈ విన్యాసానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కెఎంసి కమిషనర్ రాకేష్ చంద్రం, ఇండస్ట్రీస్ ఇన్స్పెక్టర్ చీఫ్ చిన్నారావ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇండస్ట్రీస్, విద్యుత్, ఫైర్, ఆర్టీవో, వ్యవసాయ అనుబంధ శాఖలు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ డీజిల్ గ్యాస్ కొరతలను నివారించాలి దిగుమతులను పెంచాలి,,

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె రామాంజనేయులు

**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక కలెక్టర్ కార్యాలయం ముందు నగర సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు అధ్యక్షతన ధర్నా జరిగినది ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కే రామాంజనేయులు సిపిఐ సీనియర్ నాయకులు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కే జగన్నాధం ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ అమెరికా ఇజ్రాయిల్ ఇరాన్ యుద్ధం జరిగితే మనకేమీ సంబంధం లేదు అన్నట్టు ఎవరిస్తున్న మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ తక్కువ ధరకే క్రూడాలని సరఫరా చేసే రష్యాని వదులుకొని అమెరికా చెప్పినట్టు వింటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మన దేశ ప్రధానిని కూర్చోమంటే కూర్చుంటున్నాడు లే అంటే లేస్తున్నాడు దేశ ప్రజలను తిడుతున్నా కూడా పట్టించుకోని మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారు అమెరికా వారికి అడుగులకు మడుగులు ఒత్తుతూ వారి అడుగుజాడల్లో నడుచుకుంటున్న నరేంద్ర మోడీ దేశంలో పెట్రోలు డీజిల్ గ్యాస్ సామాన్య ప్రజానీకానికి అందక నానా ఇబ్బందులు పడుతుంటే నాకు ఏమీ సంబంధం లేదు అన్నట్టు వ్యవహరిస్తున్న నరేంద్ర మోడీ నరేంద్ర మోడీని పొగుడుతున్న లేదా భజన చేస్తున్నా చంద్రబాబు నాయుడు ప్రజలు పెట్రోల్ బంకుల దగ్గర గ్యాస్ డీలర్ల ఏజెన్సీల దగ్గర క్యూ లైన్లు నిలబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్న రాష్ట్రంలో ఆయిల్ కొరత లేదని గ్యాస్ కొరతలేదని ఉపదంపుడు ఉపన్యాసాలు చెప్పే డబల్ ఇంజన్ సర్కార్ నేతలు ఒకసారి పేద ప్రజలు పడుతున్న ఇబ్బందులు బాధలను చూడాలని వారన్నారు సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కర్నూలు నగరంలో గత నాలుగైదు రోజులుగా కార్మికులు మధ్యతరగతి ఉద్యోగులు మధ్యతరగతి ప్రజలు పడుతున్న బాధలను అధికారపక్ష నేతలకు కనిపించడం లేదని రోజు రెక్క ఆడితే గాని డొక్కానిందని కార్మిక వర్గాన్ని దృష్టిలో ఉంచుకొని గ్యాస్ డీజిల్ పెట్రోల్ కొరత లేకుండా కృత్రిమ కొరతను సృష్టిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ వ్యాపారస్తులు పెద్ద పెద్ద క్యాన్లకు పెట్రోలు డీజిల్ తీసుకెళ్లి బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికైనా సివిల్ సప్లై అధికారులు ఇట్లాంటి సమయంలోనైనా సక్రమంగా డ్యూటీలు చేయాలని అప్పుడే సామాన్య జనానికి సమస్యలు ఉండవని అక్రమాలకు పాల్పడుతున్న డీలర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి చింతల మహేష్ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు బిసన్న అన్వర్ రైతు సంఘం నాయకులు రాముడు గిడ్డ రెడ్డి శ్రీరాములు తదితరులు ఈ ధర్నా కార్యక్రమం పాల్గొన్నారు.




## గంగ జాతరకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేద్దాం.

### ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.



**తిరుపతి బ్యూరో చీఫ్ ఏప్రిల్ 28నంది పత్రిక** తిరుపతి నగరంలో నిర్వహించనున్న తాతయ్యగుంట గంగజాతరకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేసి, విజయవంతం చేయాలని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులకు సూచించారు. గంగజాతర ఏర్పాట్లపై మంగళవారం అన్ని విభాగాల అధికారులతో ఇంచార్జి కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గంగ జాతర లో ఎవరికీ కేటాయించిన విధులను వారు చక్కగా నిర్వహించి విజయవంతం చేయాలని తెలిపారు. ముఖ్యంగా ఆలయ పరిసరాలతో పాటు, నగరంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగ్గా చేపట్టాలని తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా పలు ప్రాంతాల్లో త్రాగునీరు సౌకర్యం, మజ్జిగ పంపిణీ చేయాలని తెలిపారు. అలాగే పోలీస్ అధికారులతో కలసి సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పొంగళ్ళు పెట్టేందుకు మార్కెట్ లో అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొబైల్ టాయిలెట్స్, అగ్ని ప్రమాదాలు జరగకుండా అన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. వాహనాలు ఎక్కడపడితే అక్కడ ఉంచకుండా పోలీస్ అధికారులతో కలసి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జంతు బలులు కేటాయించిన స్థలంలోనే జరిగేలా చర్యలు చేపట్టి, ఎప్పటికప్పుడు నీటితో శుభ్రం చేయాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో వచ్చిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపి ఖాన్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, అర్బన్ తహసీల్దార్ సుధాకర్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీలు పాల్గొన్నారు.

## చేనేత జౌళి రంగాన్ని బలోపేతం చేసి ఎగుమతులను ప్రోత్సహించాలి..!



### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప,బ్యూరో చీఫ్ ఏప్రిల్ 28నంది పత్రిక :** భారతీయ వస్త్ర రంగాన్ని ప్రపంచ మార్కెట్ లో మరింత బలోపేతం చేసే దిశగా.. జిల్లాలో జౌలు పరిశ్రమను, ఉత్పత్తుల ఎగుమతులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం "టెక్స్ టైల్ ఎగుమతుల విజన్2030" ప్రణాళికపై రాష్ట్ర చేనేత జౌలు శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సిసోడియా.. ఆ శాఖ కమిషనర్ రేఖరాణితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ ఛాంబర్ లో.. రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, కమీషనర్ వారి సూచనల మేరకు జిల్లా అధికారులకు టెక్స్ టైల్ ఎగుమతుల విజన్2030 ప్రణాళికపై జిల్లా కలెక్టర్ పలు ఆదేశాలు, సూచనలిచ్చారు.భారతీయ వస్త్ర (టెక్స్ టైల్) రంగాన్ని ప్రపంచ స్థాయిలో మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం "టెక్స్ టైల్ ఎగుమతుల విజన్2030"ను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈ ప్రణాళిక ద్వారా 2030 నాటికి దేశ టెక్స్ టైల్ ఎగుమతులను 100 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం 2024-25 ఆర్థిక సంవత్సరంలో టెక్స్ టైల్ ఎగుమతులు 37.76 బిలియన్ డాలర్లుగా ఉండగా, ఈ రంగంలో సుమారు 4.5 కోట్ల మందికి ఉపాధి లభిస్తోందన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలంటే వచ్చే ఐదు సంవత్సరాల్లో దాదాపు 2.7 రెట్లు వృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారన్నారు. మన దేశంలో పత్తి, జూట్, పట్టు మరియు మాన్-మేడ్ ఫైబర్స్ ఉత్పత్తిలో ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్నప్పటికీ, టెక్స్ టైల్ ఎగుమతుల్లో మాత్రం ఆరో స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా 527 జిల్లాల్లో ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ, కేవలం 25 జిల్లాల నుంచే 68 శాతం ఎగుమతులు జరగడం గమనార్హం అన్నారు. ప్రపంచ మార్కెట్‌లో మాన్-మేడ్ ఫైబర్స్, ఫాస్ట్ ఫ్యాషన్, టెక్నికల్ టెక్స్ టైల్ మరియు సస్టైనబుల్ ఉత్పత్తుల వైపు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో భారత్ వేగంగా తన ఉత్పత్తి విధానాలను సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ లక్ష్య సాధన కోసం కేంద్ర టెక్స్ టైల్ మంత్రిత్వ శాఖ నాలుగు దశల కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందన్నారు. మొదటి దశలో కాన్సెప్ట్ నోట్‌ను రాష్ట్రాలకు పంపించి అభిప్రాయాలను సేకరించగా, రెండో దశలో జాతీయ స్థాయి కన్సల్టేటివ్ వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుతం మూడో దశలో రాష్ట్రాల స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ జిల్లాల వారీ ఎగుమతుల సామర్థ్యాలను గుర్తించడం జరుగుతోందన్నారు. తదుపరి దశలో జాతీయ సదస్సులో తుది కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయనున్నారన్నారు.అయితే ఈ రంగం అభివృద్ధికి కొన్ని కీలక సవాళ్లు కూడా ఉన్నాయని, ఎగుమతులు ప్రధానంగా అమెరికా, యూరప్ మార్కెట్లపైనే ఆధారపడటం, పత్తి ఉత్పత్తులపై అధిక మొగ్గు చూపడం, రవాణా మరియు విద్యుత్ ఖర్చులు అధికంగా ఉండడం, సస్టైనబిలిటీ ప్రమాణాల్లో లోపాలు, అలాగే మీవీజు రంగంలో ఆర్థిక, సాంకేతిక పరిమితులు మొదలైన అంశాలు టెక్స్ టైల్ రంగం వృద్ధికి ఆటంకంగా మారుతున్నాయన్నారు.ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక అవకాశాలు ఉన్నట్లు గుర్తించారన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, గుంటూరు, పల్నాడు జిల్లాలను చాంపియన్ జిల్లాలుగా ఎంపిక చేయగా, తూర్పు గోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలను ఆస్పిరేషనల్ జిల్లాలుగా గుర్తించడం జరిగిందన్నారు.కాగా.. సమన్వయంతో కూడిన ప్రణాళిక, రాష్ట్రాల భాగస్వామ్యం, మరియు సమర్థవంతమైన అమలు ద్వారా భారత్ టెక్స్ టైల్ రంగంలో విశేష ప్రగతి సాధించి, 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ఎగుమతి లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలు ఉన్నాయని ఆ దిశగా జిల్లాలోని టెక్స్ టైల్ ఉత్పత్తి వనరులను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకుని.. భారత వస్త్ర ఉత్పత్తుల ఎగుమతుల వృద్ధిలో మనం కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లాలో ఉన్న చేనేత, జౌళి ఉత్పత్తులను గుర్తించి.. ఎగుమతులను ప్రోత్సహించాలన్నారు. ఇంకను ఎవరైనా కొత్త యూనిట్లను ప్రారంభించే ఆలోచన ఉన్న ఔత్సాహికులకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. కొత్త యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన వనరులను గుర్తించాలన్నారు. చేనేత సంఘాలను కూడా ప్రోత్సహిస్తూ జిల్లాలో చేనేత జౌలు పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్స్ ఏడి పిచ్చేశ్వర నాయుడు, ఏపీఐఐసి జెడ్ఎం శ్రీనివాసమూర్తి, ఇండస్ట్రీస్ జిఎం చాంద్ బాషా, హ్యాండ్లూమ్స్ ఏడిఓ శేషగిరిరావు, టెక్సానా కంపెనీ హెచ్ఆర్ హరికృష్ణ, ఆదిత్య బిర్లా హెచ్ఆర్ ప్రభాకర్, సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## జర్నలిస్టుల భద్రతపై పెరుగుతున్న ఆందోళనలు పోరుమామిళ్లలో నిరసనలు ఉధృతం

### వెంటనే జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలి

### రాష్ట్ర, జిల్లా స్థాయి జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీలు ఏర్పాటు చేయాలి

**పోరుమామిళ్ల ఏప్రిల్ 28 (నంది పత్రిక ):**చిత్తూరు జిల్లా వి.కోటలో ఆంధ్రజ్యోతి విలేకరి జగన్‌మోహన్‌రెడ్డి హత్య జరగడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. నడిరోడ్డుపై జరిగిన ఈ పాశవిక హత్య సంఘటన జర్నలిస్టుల భద్రతపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్థంభంగా భావించే మీడియా ప్రతినిధులు ఇలాంటి దారుణాలకు గురవడం సమాజానికి, ప్రభుత్వ యంత్రాంగానికి ఒక హెచ్చరికగా భావించాల్సిన అవసరం ఉంది.జగన్‌మోహన్‌రెడ్డి హత్య వెనుక ఉన్న అసలు కారణాలను పోలీసులు పూర్తిగా వెలికితీసి, ఎటువంటి ఒత్తిడులు లేకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని ప్రజలు, జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నిందితులు ఎంతటి ప్రభావశీలులు అయినా సరే కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట పడుతుంది.ఇటీవలి కాలంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, హత్యాయత్నాలు పెరుగుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం ఈ అంశాన్ని అంతగా ప్రాధాన్యత ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జర్నలిస్టులు తమ విధి నిర్వర్తనలో భాగంగా నిజాలను వెలికితీయడం, అవినీతి, అక్రమాలను బయటపెట్టడం వల్లే కొందరి లక్ష్యంగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో వారి భద్రతకు ప్రత్యేక చట్టపరమైన రక్షణ అత్యవసరమైంది.మహారాష్ట్రలో అమలులో ఉన్నట్లుగా జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా వెంటనే అమలు చేయాలని డిమాండ్ పెరుగుతోంది. అలాంటి చట్టం అమల్లోకి వస్తే జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి చట్టబద్ధమైన బలం లభిస్తుంది.అదే విధంగా రాష్ట్ర మరియు జిల్లా స్థాయిల్లో ప్రత్యేక "జర్నలిస్టుల రక్షణ కమిటీలు" ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలలో ఉన్నతాధికారులు, పోలీసు ప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ఉండేలా చూసి, తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహించాలి. జర్నలిస్టులపై వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిశీలించి చర్యలు తీసుకునే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలి. ఈ దారుణాన్ని ఖండిస్తూ మంగళవారం కడప జిల్లా పోరుమామిళ్లలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక గాంధీబొమ్మ నుంచి పోలీస్ స్టేషన్ వరకు జర్నలిస్టుల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహించారు. "జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి", "దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి" అంటూ నినాదాలు చేశారు. ఈ నిరసనలో పలువురు జర్నలిస్టులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడాలంటే మీడియా స్వేచ్ఛ, భద్రత అత్యంత కీలకం. జర్నలిస్టులు భయపడకుండా నిజాలు వెలికితీయగలగాలి. అలాంటి పరిస్థితులను సృష్టించడం ప్రభుత్వ బాధ్యతగా భావించాలి. ఈ నేపథ్యంలో దారుణంగా హత్యకు గురైన జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జర్నలిస్టుల భద్రతపై ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన నిర్ణయాలు తీసుకోవాలని సమాజం మొత్తం కోరుకుంటోంది.




## దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎంఎల్ఏ మురళీ నాయక్.

**కేసముద్రం, ఏప్రిల్ 28(నంది పత్రిక):** ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను రైతులు కొనుగోలు కేంద్రాల్లో పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని మహబూబాబాద్ శాసన సభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్ అన్నారు. మంగళవారం కేసముద్రం మండల పరిధిలోని ఉప్పరపల్లిలో గ్రామంలో దన్నసరి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్ పర్సన్ అల్లం రామ నాగేశ్వర్ రావు, స్థానిక నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులకు పెద్దపీట వేసిందని, రైతు సంక్షేమం కోసం రైతులు పండించిన దాన్యం పంటకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ని కూడా ఇస్తుందని, రైతు భరోసా నిధులు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి, ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశ్రు నాయక్, బండారు వెంకన్న, నీలం దుర్గేష్, వార్డ్ కౌన్సిలర్లు కిషోర్, తరాల వీరేష్, మార్కెట్ డైరెక్టర్స్ చింతకుంట్ల యాదగిరి, ఎండి.అయూబ్ ఖాన్, మహబూబాబాద్ జిల్లా యూత్ ఉపాధ్యక్షులు అల్లం గణేష్, సిఈఓ మల్లారెడ్డి, ఏఓ వెంకన్న, అధికారులు, సర్పంచ్లు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ప్రణాళిక లోపంతో రైతులకు ఇబ్బందులు.

### రైతు సంఘం మండల అధ్యక్షుడు నీరుటి జలంధర్

**కేసముద్రం, ఏప్రిల్ 28(నంది పత్రిక):** మొక్కజొన్నల కొనుగోలులో ప్రభుత్వం ప్రణాళిక లోపంతో రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు నీరుటి జలంధర్ అన్నారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు జలంధర్ కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ను సందర్శించి, మాట్లాడుతూ గత సంవత్సరం క్వింటాలకు 2400 రూపాయలకు పైగా వ్యాపారులు కొనుగోలు చేయడంతో ఈ సంవత్సరం రైతులు మొక్కజొన్నను అధికంగా సాగు చేయడంతో దిగుమతి ఎక్కువ మోతాదులో వచ్చిందని, ఇదే అదునుగా మొక్కజొన్నలను వ్యాపారులు క్వింటాలుకు 1800కు మించి కొనుగోలు చేయడం లేదని, రూ. 2400 రూపాయల మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొన్న ధాన్యాన్ని సరఫరా చేయలేక, రైతులకు సరిపడా బస్తాలను అందియలేక ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మిర్చిలో చీడపీడలు, ఇతర అపరాల పంటలు సాగుకు కోతుల బెడదతో రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న మొక్కజొన్నలకు కూడా డీజిల్ సమస్యతో లారీలు రావడం లేదని, రైతులకు సరిపడా బస్తాలు అందివ్వలేకపోవడం శోచనీయమన్నారు. మార్కెట్ యార్డుల నిండా మొక్కజొన్న బస్తాలు ఉండడం, మరోపక్క వరి కోతలు ప్రారంభమై వరి ధాన్యం కూడా మార్కెట్ కు రావడం మూలంగా మార్కెట్ లోని సరుకులు ఖాళీ అయ్యేంతవరకు రైతులు మొక్కజొన్నలు తీసుకురావద్దని అధికారులు ప్రకటించారని, నగర శివారులలో పోలీసులు మార్కెట్ కు వచ్చే మొక్కజొన్న ట్రాక్టర్లు రాకుండా అడ్డుకుంటున్నారు. మిల్లులో తక్కువ ధరకు అమ్ముకొని రైతులు మద్దతు ధర కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల వచ్చే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారనీ, ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు కోరారు.



## తక్కువ నీరు అవసరమయ్యే చిరుధాన్యాలు పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి.

### మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ రెడ్డి.



**బేతంచెర్ల ,ఏప్రిల్ 28, (నంది పత్రిక ).** బేతంచెర్ల మండల వ్యవసాయ అధికారి విజయ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఎస్కే, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పై,తొలకరికి ముందు నవ ధాన్యాల సాగుపై,విస్తరణ సిబ్బంది రైతులకు అవగాహన కలిగించాలని, నవధాన్యాల సాగువల్ల నేల సారవంతమై ప్రధాన పంటలకు అవసరమైన పోషకాలు లభిస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలు ఆరోగ్య కరమైన ఆహారాన్ని అందిస్తాయని, పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని, రైతులకు పంట సాగు ఖర్చులు తగ్గుతాయని వివరించారు. ఈ దిశగా రైతులు అడుగులు వేయాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం, ఆధునిక విధానాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

## ఎవరెస్ట్ ను ముద్దాడిన రంగాపురం నీలకంటి మధు తనూజ




**బేతంచెర్ల ఏప్రిల్ 28 (నందిపత్రిక )** బేతంచెర్ల మండలంఆర్ ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన వినికిడి లోపం కలిగిన విద్యార్థిని నీలకంటి మధు తనూజ అరుదైన గౌరవంను సాధించింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న మధు తనూజ,ఎవరెస్ట్ బేస్ క్యాంపు యాత్రలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేసింది. సాధారణ కార్మిక కుటుంబానికి చెందిన తనూజ, చిన్న వయసులోనే ఇలాంటి అరుదైన అవకాశాన్ని అంది పుచ్చుకుని, తన ప్రతిభను చాటుకుంది.ఈనెల 15 న యాత్ర ప్రారంభించి,25న ఎవరెస్టు బేస్ క్యాంపు చేరుకుంది. ఎపి.విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, హై స్కూల్ హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, బంధువులు, గ్రామస్తులు తనూజను అభినందించారు.

# పెట్రోల్ బంకుల్లో వరి కోత యంత్రాలకు ప్రత్యేక ప్రాధాన్యత

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 28నంది పత్రిక** జిల్లాలో డీజిల్ సరఫరా పరిస్థితుల నేపథ్యంలో వరి కోతలు ఎక్కడా ఆగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం హార్వెస్టింగ్ యంత్రాలకు డీజిల్ సరఫరా వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 1,40,000 ఎకరాల్లో వరి కోతలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. ఈ విస్తీర్ణంలో కోత పనులు నిరవధికంగా సాగేందుకు అవసరమైన డీజిల్ సరఫరాను నిర్ధారించడం అత్యంత కీలకమని అన్నారు. హార్వెస్టింగ్ యంత్రాలకు డీజిల్ కొరత కారణంగా ఎక్కడా కోతలు నిలిచిపోకుండా జిల్లా యంత్రాంగం సమగ్ర ప్రణాళికతో పనిచేస్తోందని తెలిపారు. ఒక హార్వెస్టింగ్



యంత్రానికి రోజుకు 70 లీటర్ల డీజిల్, ట్రాక్టర్కు 20 లీటర్ల డీజిల్ సరఫరా చేసే విధంగా రైతు సమైక్య కేంద్రాల ద్వారా కూపన్లను జారీ చేస్తున్నామని వివరించారు. పెట్రోల్ బంకుల్లో ఈ కూపన్ల ఆధారంగా డీజిల్ అందించేందుకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వరి కోత యంత్రాలకు ప్రాధాన్యతనిస్తూ వేగంగా డీజిల్ సరఫరా జరిగేలా విఆర్వోలు, పోలీస్ సిబ్బంది ప్రత్యక్ష పర్యవేక్షణలో చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే బంకుల వద్ద రెండు వేర్వేరు క్యూ లైన్లు ఏర్పాటు చేసి ముందుగా హార్వెస్టింగ్ యంత్రాలకు డీజిల్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా డీజిల్ నిల్వలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి సంబంధితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డీజిల్ సరఫరాలో ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు. త్వరలోనే డీజిల్ సరఫరా పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుంటుందని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వ్యవసాయ కార్యకలాపాలకు, అలాగే సాధారణ ప్రజానీకానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్.వెంకటేశ్వర్లు, భీమవరం ఎడిఎ ప్రసాద్, పాలకొల్లు ఏడీఏ మురళీకృష్ణ, అత్తిలి వ్యవసాయ అధికారి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## నాదెండ్ల భాస్కర్ రావు మృతికి మంత్రుల నివాళి

### మంత్రి నాదెండ్ల మనోహర్ ను పరామర్శించిన మంత్రులు



**బనగానపల్లె ఏప్రిల్ 28నందిపత్రిక** ఆంధ్రరాష్ట్ర మాజీ ఆపద్ధర్మ ముఖ్యమంత్రి శ్రీ. శే. నాదెండ్ల భాస్కర్ రావు మృతికి కూటమి ప్రభుత్వ మంత్రులు నివాళి అర్పించినట్లు మంత్రి కార్యాలయం బుధవారం తెలిపారు. మంత్రులు బీసి జనార్దన్ రెడ్డి, అచ్చెనాయుడు, అనగాని సత్య ప్రసాద్, సత్యకుమార్ యాదవ్ హైదరాబాద్ లోని నాదెండ్ల మనోహర్ స్వగృహంలో నాదెండ్ల భాస్కర్ రావు చిత్రాటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ ను కుటుంబ సభ్యులను పరామర్శించారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆక్వా, వ్యవసాయ రైతులు అవసరానికి మించి డీజిల్ కొనుగోలు చేయవద్దు



### ప్రస్తుతం డీజిల్ కొరత లేదు
### అన్ని బంకుల్లో తగినంత స్టాక్ అందుబాటులో ఉంది
### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 28నంది పత్రిక** జిల్లాలో డీజిల్ సరఫరా పరిస్థితి సాధారణంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఆక్వా మరియు వ్యవసాయ రంగ రైతులు అవసరానికి మించి డీజిల్ కొనుగోలు చేయవద్దని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. జిల్లాలో ఎటువంటి డీజిల్ కొరత లేదని, అన్ని పెట్రోల్ బంకుల్లో తగినంత స్టాక్ అందుబాటులో ఉందని ఆమె స్పష్టం చేశారు. భీమవరం పట్టణంలోని విస్సాకోడేరు వంతెన వద్ద రిలయన్స్ పెట్రోల్ బంక్, ఫ్లైఓవర్ సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్, ఉండి రోడ్డులోని హెచ్పి పెట్రోల్ బంక్లను మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ వివరాలు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు. అలాగే డీజిల్ వినియోగదారులతో మాట్లాడి సరఫరా పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొంతమంది రైతులు ముందస్తు జాగ్రత్తల పేరుతో అధిక పరిమాణంలో డీజిల్ నిల్వ చేసుకోవడం వల్ల కృత్రిమ కొరత పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఇటువంటి చర్యలు ఇతర రైతులకు ఇబ్బందులు కలిగించడమే కాకుండా సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెంచుతాయని తెలిపారు. అందువల్ల ఎటువంటి అపోహలకు లోనవకుండా అవసరానికి అనుగుణంగా మాత్రమే డీజిల్ కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. జిల్లాలో డీజిల్ సరఫరాను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ సమానంగా డీజిల్ అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. బంక్ల వద్ద విఆర్ఓలు మరియు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి డీజిల్ కొనుగోళ్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరానికి మించి కొనుగోలు చేసే వారిని గుర్తించి అరికట్టాలని సూచించారు. అక్రమ నిల్వలను పూర్తిగా నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు డీజిల్ వినియోగంపై అవగాహన కల్పించి, సమర్థవంతమైన వినియోగ విధానాలపై మార్గదర్శనం చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆక్వా రైతులు తమ అవసరాలను ముందుగానే ప్రణాళిక చేసుకుని డీజిల్ వినియోగాన్ని సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. రైతులు సహకరించి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ఎటువంటి కొరత పరిస్థితులు లేకుండా సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంలో తహసిల్దార్ రావి రాంబాబు, వన్ టౌన్ సిఐ ఎం.నాగరాజు, బంక్ యజమానులు వి.విశ్వనాథ్ రాజు, మానేపల్లి నాగేశ్వరరావు, రెవెన్యూ ఆర్.ఐ లు, తదితరులు ఉన్నారు.




## డీజిల్, పెట్రోల్ కొరత లేకుండా చూడాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.



**మహబూబాబాద్, ఏప్రిల్ 28(నంది పత్రిక):** మహబూబాబాద్ జిల్లాలో ప్రజలకు పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా చూడాలని అధికారులను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో హెచ్పిసిఎల్, బిపిసిఎల్, ఐఓసిఎల్ కంపెనీ ప్రతినిధులు, పెట్రోల్, డీజిల్ డీలర్లతో అదనపు కలెక్టర్ అనిల్ కుమార్, సంబంధిత అధికారులతో కలిసి డీజిల్, పెట్రోల్ కొరతపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా డీజిల్, పెట్రోల్, గ్యాస్ ఆయిల్ వంటి ఇంధనాలను అందించాలని, ప్రస్తుత డిమాండ్ కనుగుణంగా లభ్యతను స్వీకరించి సరఫరా చేయుటలో వేగం పెంచాలని సూచించారు. కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే చర్యలు తీసుకుంటామని, అధిక ప్రాధాన్యత వ్యవసాయ ఆధారిక వాహనాలు హార్వెస్టింగ్, ట్రాక్టర్ తదితర వాటికి ప్రాముఖ్యత కల్పించి ఇంధనాలు అందించాలని, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, కంపెనీ ప్రతినిధులు, డీలర్లతో నిత్యం మాట్లాడుతూ సమస్యలు రాకుండా ఉత్పత్తులను అందించాలని ఆదేశించారు. పెట్రోల్ బంకులలో డబ్బాలలో డీజిల్, పెట్రోల్ తీసుకు వెళ్లడం రాదని, అవసరం లేకున్నా అధికంగా వినియోగించరాదని, సూచించారు. ప్రభుత్వం అత్యంత వేగంగా డీజిల్, పెట్రోల్ సరఫరాకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పెట్రోల్ పంపుల వద్ద ఎలాంటి ఆందోళన పరిస్థితులు లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పెట్రోల్ పంపు యజమానులకు సూచించారు. ఈ సమావేశంలో పౌర సరఫరా శాఖ అధికారి రమేష్, ఆయిల్ కంపెనీ సెల్స్ ప్రతినిధులు ప్రణీత్, సౌమ్యదీప్, హరీష్ రాజ్, పెట్రోల్, డీజిల్, డీలర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి ప్రజలు రెవెన్యూ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలి

### 15 విడతల రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 310 దరఖాస్తులకు పరిష్కారం
### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 28నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్‌లు జిల్లాలో మంచి ఫలితాలు ఇస్తున్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజలకు భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంతో పాటు సమాంతరంగా రెవెన్యూ క్లినిక్‌లను కూడా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 2025 డిసెంబర్ 29న ప్రారంభమైన ఈ క్లినిక్‌లు 2026 ఏప్రిల్ 27 వరకు మొత్తం 15 విడతలుగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కాలంలో జిల్లావ్యాప్తంగా మొత్తం 609 దరఖాస్తులు అందగా, అందులో 310 దరఖాస్తులకు పరిష్కారం కల్పించామని చెప్పారు. 93 దరఖాస్తులు నిరాకరించగా, ఇంకా 299 దరఖాస్తులు వివిధ దశల్లో పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. డివిజన్‌ల వారీగా వివరాలు: భీమవరం డివిజన్ ఆకివీడు, భీమవరం, పాలకోడేరు, గణపవరం, కాళ్ల, ఉండి, వీరవాసరం



మండలాల్లో 262 దరఖాస్తులు అందగా, 90 దరఖాస్తులు పరిష్కరించబడ్డాయి. 39 దరఖాస్తులు తిరస్కరించగా, ఇంకా 133 పెండింగ్‌లో ఉన్నాయి. నరసాపురం డివిజన్ఆచంట, పాలకొల్లు, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు, మొగల్తూరు, యలమంచిలి, నరసాపురం మండలాల్లో 231 దరఖాస్తులు అందగా, 85 పరిష్కరించబడ్డాయి. 39 దరఖాస్తులు తిరస్కరించగా, ఇంకా 107 పెండింగ్‌లో ఉన్నాయి. తాడేపల్లిగూడెం డివిజన్ అత్తిలి, తణుకు, తాడేపల్లిగూడెం, పెంటపాడు, ఇరగవరం మండలాల్లో 116 దరఖాస్తులు అందగా, 42 పరిష్కరించబడ్డాయి. 15 దరఖాస్తులు తిరస్కరించగా, ఇంకా 59 పెండింగ్‌లో ఉన్నాయి.

మిగిలిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా భూ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం లభిస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## బ్లాక్ మార్కెట్ చేసే వాళ్లతో ప్రభుత్వం కుమ్మక్కయింది: అవినాశ్ రెడ్డి

ఏపీలో కొనసాగుతున్న ఇంధన సంక్షోభంపై వైసీపీ తన పోరాటాన్ని ఢిల్లీ స్థాయికి తీసుకెళ్లింది. పార్టీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ఈరోజు కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్‌ను కలిసి రాష్ట్రంలోని పరిస్థితులపై ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో సుమారు 70 శాతం పెట్రోల్ బంకులు 'నో స్టాక్' బోర్డులు పెట్టాయని, బైక్‌లకు కూడా రూ. 200 కంటే ఎక్కువ పెట్రోల్ పోయని దుస్థితి నెలకొందని ఆయన కేంద్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# 'పీఎం-రాహత్' పథకంపై ప్రజలకు పూర్తి అవగాహన అవసరం

**రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్యం**

**గుడ్ సమారిటన్ పథకం కింద సహాయకులకు రూ.25,000 ప్రోత్సాహకం**

**ప్రైవేటు ఆసుపత్రులన్నీ టీఎంఎస్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**




**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 28నంది పత్రిక** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం-రాహత్' పథకంపై అన్ని వర్గాల ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం భీమవరం కలెక్టరేట్‌లోని విశిష్ట సమావేశ మందిరంలో పోలీస్, రెవెన్యూ, రవాణా, వైద్య శాఖల అధికారులతో 'పీఎం - రాహత్' పథకం అమలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం ప్రయోజనాలపై సమాచారాన్ని అందించే గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదం సంభవించిన వెంటనే బాధితులను సమీప ఆసుపత్రికి తరలించడం ద్వారా 'పీఎం-రాహత్' పథకం కింద రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్యం పొందవచ్చని తెలిపారు. ఈ పథకం వల్ల బాధితుల కుటుంబ సభ్యులు తక్షణ ఆర్థిక భారంపై ఆందోళన చెందకుండా అత్యవసర చికిత్స పొందే వీలుంటుందని చెప్పారు. పథకం సమర్థవంతమైన అమలుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు ఆసుపత్రులు టీఎంఎస్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా పూర్తి చేయాలని వైద్య అధికారులను ఆదేశించారు. దీనిని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పథకం అమలులో చురుకుగా ఉండాలని సూచించారు.

రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే మొదటి గంటను 'గోల్డెన్ అవర్'లి గా పరిగణిస్తారని, ఈ సమయంలో అందించే వైద్యం ప్రాణాలను కాపాడడంలో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గోల్డెన్ అవర్‌లో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అలాగే ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించడంలో సహాయం చేసే వ్యక్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'గుడ్ సమారిటన్' పథకాన్ని అమలు చేస్తున్నదని తెలిపారు. ఈ పథకం కింద ప్రమాద స్థలంలో సహాయం చేసి బాధితులను సమీప ఆసుపత్రికి చేర్చిన వారికి రూ.25,000 నగదు పురస్కారం అందజేయబడుతుందని చెప్పారు. సహాయం చేసిన వారికి ఎటువంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని స్పష్టం చేస్తూ, ప్రజలు ముందుకు వచ్చి ప్రాణాలను కాపాడడంలో భాగస్వాములు కావాలని కోరారు. జిల్లాలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపు కోసం పోలీస్, వైద్య, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అంబులెన్స్ సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. గ్రామ స్థాయి వరకు ఈ పథకాల వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతా భాయ్, డిసిహెచ్ఎస్ పీ.సూర్యనారాయణ, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రవణ్, జిల్లా రవాణా అధికారి కె.ఎస్.ఎం.వి. కృష్ణారావు, ఏఎంవిఐ రవికుమార్, 108 జిల్లా మేనేజర్ కృష్ణంరాజు, భీమవరం ట్రాఫిక్ సిఐ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# తరిగిన క్యూలైన్లు పెరిగిన డీజిల్ సరఫరా





**జిల్లాలో డీజిల్ పంపిణీ ప్రశాంతంగా కొనసాగుతోంది**

**డీజిల్ దొరకదేమో అనే ఆందోళన చెందవద్దు**

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**

**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 28నంది పత్రిక** జిల్లాలో ఇటీవల ఏర్పడిన డీజిల్ కొరత పరిస్థితి క్రమంగా చక్కబడుతోందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. రోజురోజుకూ డీజిల్ సరఫరా పెరుగుతుండగా, వినియోగదారులు అవసరం మేరకే కొనుగోలు చేయడం వల్ల పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుందని ఆయన వెల్లడించారు. మంగళవారం రాత్రి భీమవరం పట్టణంలోని ఉమామహేశ్వర ఆగ్రో సర్వీసెస్ పెట్రోల్ బంక్, పుష్ప పెట్రోల్ బంక్, ఉండి ఎన్ఆర్పి అగ్రహారంలోని పౌర సరఫరాల శాఖ పెట్రోల్ బంక్, గణపవరం లోని పెట్రోల్ బంకులను జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో డీజిల్ అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయిల్ నిల్వలు, సరఫరా విధానం, వినియోగ నియంత్రణ చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో డీజిల్ కొరతపై వ్యాప్తి చెందిన అపోహల కారణంగా కొంతమంది వినియోగదారులు అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారని గమనించామని తెలిపారు. ఇటువంటి అనవసర నిల్వల వల్ల తాత్కాలిక ఒత్తిడి ఏర్పడినప్పటికీ, ప్రస్తుతం సరఫరా పెరగడంతో పరిస్థితి మెరుగుపడిందన్నారు. వ్యవసాయ మరియు మత్స్యశాఖల సమన్వయంతో రైతుల నిజమైన అవసరాలను గుర్తించి కూపన్లను జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కూపన్ల ఆధారంగా మాత్రమే డీజిల్ సరఫరా జరగాలని ఆయిల్ బంక్ యజమానులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా, డీజిల్‌ను క్యాన్లు లేదా ప్లాస్టిక్ డబ్బాల్లో నిల్వ చేసుకునేందుకు విక్రయించరాదని ఆయన స్పష్టం చేశారు. ఇది భద్రతా పరమైన మరియు నియంత్రణ పరమైన చర్యగా తీసుకున్న నిర్ణయమని పేర్కొన్నారు. పెట్రోల్ బంక్ యజమానులు వినియోగదారులకు వేగవంతమైన మరియు సకాల సేవలు అందించేందుకు కట్టుబడి ఉండాలని, ముఖ్యంగా డీజిల్ కోసం వచ్చే వాహనాలను ఎక్కువసేపు క్యూలైన్లలో నిలిపివేయకుండా త్వరితగతిన సరఫరా చేయాలని సూచించారు. జిల్లాలో డీజిల్ సరఫరా పూర్తిగా నియంత్రణలో ఉందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని జాయింట్ కలెక్టర్ పునరుద్ఘాటించారు. వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు

# విద్యతోనే కురుబల అభివృద్ధి



**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**అమరావతి బ్యూరో చీఫ్ ఏప్రిల్ 28నంది పత్రిక** : విద్యతోనే కురుబల అభివృద్ధి సాధ్యమని, ఆ సామాజిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. కురుబలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ మార్కులతో ప్రతిభ చాటిన కురుబ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులను జిల్లాల వారీగా ఆ సామాజిక వర్గానికి చెందిన సంఘాలు సత్కరించాలని సూచించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కురుబ సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర కమిటీ సభ్యులు, ఆ సామాజిక వర్గీయులతో మంత్రి సవిత మంగళవారం సమావేశమయ్యారు. కురుబ యువత కేవలం తమ కులవృత్తికే పరిమితం కాకుండా, ఆధునిక విద్యను అందిపుచ్చుకుని అన్ని రంగాలలో రాణించాలన్నారు. కురుబలు రాజకీయంగా ఎదగాలంటే అది కేవలం విద్య, ఐక్యతతోనే సాధ్యమవుతుందన్నారు. కురుబల తమ బిడ్డల విద్యకు ప్రాధాన్యమివ్వాలన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ చాటిన కురుబ సామాజిక విద్యార్థులను ప్రోత్సాహించాలి, సత్కరించాలని సూచించారు. విద్యతోనే అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండగలన్నారు. కురుబ కార్పొరేషన్ ద్వారా విద్యార్థులకు అవసరమైన ఆర్థిక సాయం, ప్రోత్సాహకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి బీసీ కుటుంబం నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. దీనిలో భాగంగా కురుబ యువతకు ఎంఎస్ఎంఈ పార్కుల్లో వ్యాపారులుగా అవకాశమిస్తామన్నారు. ఖాదీ గ్రామీణాభివృద్ధి బోర్డు ద్వారా సబ్సిడీ రుణాలు అందజేసి, కురుబలతో గొర్రెలు, గేదెలు, కోళ్ల పెంపకం, పేపర్ ప్లేట్లు తయారీ వంటి యూనిట్లు మంజూరు చేస్తున్నామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుబలకు ప్రాధాన్యమిచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. త్వరలోనే గుడికట్ల పూజారులకు గౌరవ వేతనం అందించేలా చర్యలు తీసుంటామన్నారు. అనంతరం మంత్రి సవిను కురుబ సామాజిక వర్గీయులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కురుబ సంక్షేమ సంఘం చైర్మన్ మల్లికార్జున, ఆ సంఘ ప్రతినిధులు, వివిధ జిల్లాలకు చెందిన ఆ సామాజిక వర్గీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రభుత్వ వసతి గృహాల్లో చదివి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు ఆదర్శం

**మొదటి అవకాశాన్ని నిలబెట్టుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి**

**కష్టానికి ఫలితం తప్పకుండా ఉంటుంది భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**




**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 28 నంది పత్రిక** జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసించి వివిధ ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన 29 మంది విద్యార్థులు మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో విద్యార్థులు తమ విజయాన్ని పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ, వారు ఏయే కంపెనీలలో ఉద్యోగాలు సాధించారు, ఎంత వేతన ప్యాకేజీ లభించింది, వారి కుటుంబ నేపథ్యం వంటి అంశాలను తెలుసుకున్నారు. విద్యార్థుల కృషిని అభినందిస్తూ వారిలో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని మంచి స్థాయికి చేరుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. మీరు సాధించిన విజయాన్ని చూసి వసతి గృహాల్లో చదువుతున్న మరెందరో విద్యార్థులు స్ఫూర్తి పొందుతారని తెలిపారు. విద్యార్థులు తమ మొదటి ఉద్యోగ అవకాశాన్ని చిన్నదిగా భావించి వదులుకోకుండా, దానిని ఒక మంచి ప్రారంభంగా తీసుకుని కష్టపడి ముందుకు సాగాలని సూచించారు. ఉద్యోగంలో స్థిరపడుతూ అనుభవాన్ని పెంపొందించుకుంటే భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించగలరని తెలిపారు. "కష్టానికి ఎప్పుడూ ఫలితం ఉంటుంది, భవిష్యత్తు తప్పకుండా మంచిగా ఉంటుంది" అని ప్రేరణాత్మకంగా సందేశం ఇచ్చారు. భీమవరం, తాడేపల్లిగూడెంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలురు బాలికల కాలేజీ హాస్టల్స్ లో ఉంటూ 22 మంది బాలురు, ఏడు మంది బాలికలు మొత్తం 29 మంది చెన్నై, డెహ్రాడూన్, హైదరాబాద్ లలోని వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులందరికీ మెమొంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి.అరుణ కుమారి, సూపరింటెండెంట్ సత్యనారాయణ, హెచ్‌డబ్ల్యూఓలు సిహెచ్ భానుమణి, పి.సురేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆక్వాకల్చర్‌కు అండగా కూటమి ప్రభుత్వం

**- డీజిల్ సరఫరాలో ఎటువంటి అంతరాయం ఉండదు**

**- జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు నిరంతర పర్యవేక్షణ**

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతిబ్యూరో చీఫ్ , ఏప్రిల్ 28:నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వాకల్చర్ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,34,617 హెక్టార్లలో ఆక్వాకల్చర్ సాగు జరుగుతోందని, అందులో 1,21,829 హెక్టార్లలో చేపల పెంపకం, 1,12,788 హెక్టార్లలో ఉప్పునీటి సాగు జరుగుతోందని పేర్కొన్నారు. శ్రింప్, సీ బాస్ వంటి వాణిజ్య పంటలు సాగు చేస్తున్న సుమారు 1.2 లక్షల హెక్టార్లకు 24 గంటల నిరంతర విద్యుత్ అవసరం ఉందని మంత్రి తెలిపారు. విద్యుత్ అంతరాయం ఉన్న సమయంలో రైతులు డీజిల్ జనరేటర్లపై ఆధారపడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం రోజుకు సగటున 2 గంటల విద్యుత్ కోత ఉన్నట్లు అంచనా వేస్తూ, ఒక హెక్టారుకు రోజుకు సుమారు 5 లీటర్ల డీజిల్ అవసరం అవుతోందని వివరించారు. వారానికి ఒక హెక్టారుకు 40 లీటర్ల డీజిల్ అవసరం కాగా, మొత్తం 1.2 లక్షల హెక్టార్లకు వారానికి సుమారు 5000 కిలోలీటర్ల డీజిల్ అవసరం ఉంటుందని తెలిపారు. **డీజిల్ సరఫరా పర్యవేక్షణలో కట్టుదిట్టమైన చర్యలు** ఆక్వాకల్చర్ రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా డీజిల్ సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాల వారీగా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ప్రత్యేకంగా పరిస్థితిని సమీక్షిస్తూ, డీజిల్ అందుబాటును పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారుల సహకారంతో ప్రతి ప్రాంతంలో సమన్వయం కొనసాగుతోందని చెప్పారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ వారి పక్షాన నిలబడి, అవసరమైన మద్దతు అందిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఆక్వాకల్చర్ రంగ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# పిడుగుపాటుతో వానరం మృతి



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 28**: బండి ఆత్మకూరు లో అకాలంగా కురిసిన వర్షాల కారణంగా పిడుగుపాటుతో వానరం మృతి చెందింది. బండి ఆత్మ కూరులో మఠంపేటలో హుస్సేన్ షావలి దర్గా వద్ద ఉన్న చెట్టుపై ఓ వానరం సేద తీరుతూ ఉంది. మంగళవారం రాత్రి అకాల వర్షాలతో పాటు పిడుగులు సంభవించడంతో చెట్టు పైనున్న వానరం పిడుగుపాటుతో బెదిరి 15 అడుగుల పైనుండి కిందపడి రక్త గాయాల పాలయింది. స్థానికులు వానరాన్ని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వానరం చివరికి మృతి చెందడంతో ఈ సంఘటన అందర్నీ కలచి వేసింది. పిడుగుపాటు కారణంగా చాలామంది గృహాలలో సీలింగ్ ఫ్యాన్లు, టేబుల్ ఫ్యాన్లు పనికి రాకుండా పోయాయి.

# హిప్పోలను చంపాలనుకున్న కొలంబియా ప్రభుత్వం... అనంత్ అంబానీ విజ్ఞప్తి

మగ్దలీనా నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న 80 హిప్పోపొటమస్‌లను (నీటి ఏనుగులు) చంపేయాలని కొలంబియా ప్రభుత్వం నిర్ణయించడంపై రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ స్పందించారు. వాటిని చంపవద్దని, వాటికి తమ వంతారా జంతు సంరక్షణ కేంద్రంలో శాశ్వత నివాసం కల్పిస్తామని కొలంబియా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంత్ అంబానీ నిర్వహిస్తున్న 'వంతారా' ప్రపంచంలోనే అతిపెద్ద వన్యప్రాణుల రక్షణ కేంద్రాలలో ఒకటి. కొలంబియా పర్యావరణ, సుస్థిర అభివృద్ధి శాఖకు ఈ మేరకు అనంత్ అంబానీ అభ్యర్థనను పంపించారు. ప్రాణం ఉన్న జీవులకు జీవించే హక్కు ఉందని, వాటికి కావాల్సిన సదుపాయాలన్నింటిని, సురక్షితమైన పరిస్థితులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రతిపాదనను సమగ్రంగా అంచనా వేసేవరకు వాటిని చంపాలనుకునే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. త్వరలో కొలంబియా అధికారులను సంప్రదిస్తామని పేర్కొన్నారు. మగ్దలీనా నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న నీటి ఏనుగుల వల్ల అక్కడి జీవవైవిధ్యానికి, పర్యావరణ వ్యవస్థకు హాని కలుగుతుందని, వాటిని చంపేయాలని కొలంబియా ప్రభుత్వం నిర్ణయించింది. దీనితో వాటిని చంపకూడదని, తమ వంతారాలో రక్షణ కల్పిస్తామని అనంత్ అంబానీ ప్రతిపాదన చేశారు.

# జిల్లాలో పరిశ్రమల అనుమతులకు వేగం

# పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

### ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలు



**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 28నంది పత్రిక** జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి మరింత వేగం తీసుకురావాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సమావేశంలో పరిశ్రమల అనుమతుల పురోగతిని సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 86 పరిశ్రమలు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాయని, వాటిలో 65 పరిశ్రమలకు ఇప్పటికే అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోపు వేగంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ కింద జిల్లాకు కేటాయించిన 112 యూనిట్ల లక్ష్యానికి వ్యతిరేకంగా 195 యూనిట్లు మంజూరు చేయబడినట్లు తెలిపారు. అదనంగా, ఇప్పటికే 361 యూనిట్లు గ్రౌండింగ్ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల రూ.4.10 లక్షల విలువ గల 2 కొత్త యూనిట్లకు సబ్సిడీ మంజూరు చేసినట్లు వివరించారు. జిల్లాలో ముఖ్యంగా ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, సిమెంట్ ఇటుకల తయారీ యూనిట్లు, సేవారంగ పరిశ్రమలు, పాడి పరిశ్రమలు అధికంగా స్థాపించబడుతున్నాయని కలెక్టర్ తెలిపారు. పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఉన్నందున, పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ఇండస్ట్రియల్ గైడెన్స్ సెంటర్ సేవలను అన్ని పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని కోరారు. పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు, సమస్యలు, సబ్సిడీలు వంటి అంశాలపై జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు మరియు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సమన్వయంతో పనిచేసి సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. తాడేపల్లిగూడెంలో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ స్థాపనకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, పారిశ్రామికవేత్తలను పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలపై పారిశ్రామికవేత్తలకు సమగ్ర అవగాహన కల్పించి, వారికి మార్గదర్శనం చేయాలని తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో కొత్త యూనిట్ల స్థాపనకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ, సంబంధిత అధికారులు ఈ రంగంలో మరింత చొరవ చూపాలని సూచించారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్ లో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా లేబర్ ఆఫీసర్ ఎ.లక్ష్మి, ఏపీఎస్ఎఫ్‌సీ బి.ఎం డి. అపర్ణ, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి. స్వాతి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ ఎ.ఎస్.ఆర్.సి. మూర్తి, ఏపీఐఐసీ జీఎం కె. బాబ్జి, డీఎఫ్ఓ కె.శ్రీనివాసరావు, కేయూఐబీ ఏ.డి కే. అప్పారావు, డీపీఓ దోసిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ డి.వేణుగోపాల్, జిల్లా హార్టికల్చర్ అధికారి హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాల్లో ఇంధన సరఫరాపై ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్

### జిల్లాలో క్యూలైన్లు తగ్గాయి

### డీజిల్ సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందిలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 28నంది పత్రిక** రాష్ట్రంలో నెలకొన్న ఇంధన పరిస్థితులపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లతో నిరంతర సమీక్షలు నిర్వహిస్తూ పలు ఆదేశాలు, సూచనలు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, ప్రస్తుత ఇంధన పరిస్థితులపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణతో పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజల్లో ఆందోళన కలగకుండా పరిస్థితిని పారదర్శకంగా వివరించడంతో పాటు, అవసరానికి మించి డీజిల్ వినియోగాన్ని నియంత్రించే చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాలో రోజు రోజుకీ పరిస్థితి మెరుగవుతోందని, క్యూలైన్లు గణనీయంగా తగ్గాయని తెలిపారు. అలాగే డీజిల్ సరఫరా కూడా పెరిగి, ప్రస్తుతం నిరంతరాయంగా పంపిణీ జరుగుతోందని పేర్కొన్నారు. జిల్లాకు చేరుకుంటున్న ఆయిల్ ట్యాంకర్ల ద్వారా 100 శాతం నురుగు తొలగించిన ఇంధనం అందకపోవడం వల్ల కొంత పరిమాణంలో వ్యత్యాసం కనిపిస్తున్నదని కలెక్టర్ వివరించారు. అయినప్పటికీ, అందుబాటులో ఉన్న వనరులతో సమర్థవంతంగా సరఫరా నిర్వహిస్తూ పరిస్థితిని నియంత్రణలో ఉంచుతున్నామని తెలిపారు.బల్క్ వినియోగదారుల అవసరాలను కూడా సమాంతరంగా తీర్చాల్సి ఉన్నందున, అన్ని వర్గాలకు సరిపడేలా సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో నయారా మరియు జియో సంస్థలను భాగస్వామ్యం చేయడం ద్వారా ప్రస్తుత క్లిష్ట పరిస్థితిని అధిగమించడంలో గణనీయమైన సహకారం లభించిందని ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాలో ఇంధన సరఫరా పరిస్థితి క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటోందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ పునరుద్ఘాటించారు. వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి అవసరమైన మేరకే డీజిల్ కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ కృత్రిమ కొరతపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి





### రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత కారణమే డీజిల్ పెట్రోల్ కొరత వైకాపా రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 28 నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత కారణంగా డీజిల్ పెట్రోల్ కొరత వల్ల రైతులు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాడు ఆళ్లగడ్డ పట్టణంలోని భారత్ పెట్రోల్ బంకును మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి భూమా కిషోర్ రెడ్డి వైకాపా నాయకులతో కలిసి పరిశీలించారు.

**ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ** రాష్ట్రంలో డీజిల్ కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇతర రాష్ట్రాల నుండి ప్రయాణం చేసేవారు మన రాష్ట్రంలో డీజిల్ దొరక్క ఇబ్బందులు పడుతున్నారన్నారు పక్క రాష్ట్రంలో ఏ కొరత లేకుండా సరైన ఇండేట్ తో పకడ్బందీగా ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ఎలాంటి కొరత లేకుండా చేస్తున్నారని అన్నారు డీజిల్ కొరతకు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం అని గంగుల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. పెట్రోల్. బంకులలో ఇండెంట్లు సరిగా ఇవ్వక ప్రాబ్లం క్రియేట్ చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం కావలసినంత డీజిల్ పెట్రోల్ గ్యాస్ ఇస్తున్నామని స్వయానా కేంద్ర మంత్రి తెలిపారన్నారు కేంద్ర ప్రభుత్వమేమో , డీజిల్ కొరతలేదంటుంది, కానీ రాష్ట్ర ప్రభుత్వంలో సరైన పర్యవేక్షణ లేక ఈ పరిస్థితి నెలకొందని న్నారు. సీజన్లోవరి, మొక్కజొన్న పంటలు కోసేందుకు వరి కోత మిషన్లకు డీజిల్ లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు, రైతులకు ఇబ్బంది లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా డీజిల్ పెట్రోల్ కొరతలు వస్తున్నాయని మరి రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఎక్కడికి పోయారని ప్రశ్నించారు ఇప్పటికైనా పెట్రోల్ డీజిల్ కొరత లేకుండా చూడాలని ఆయన. డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి, గంగుల రామిరెడ్డి, సింగం వెంకటేశ్వర్ రెడ్డి, చింతకుంట్ల రాజారెడ్డి, యాదవాడ నరసింహారెడ్డి, పలచాని మల్లికార్జున్రెడ్డి, నాగిరెడ్డి పల్లె శంకర్ రెడ్డి,

హుస్సేన్ రెడ్డి, తోమంద్రు వినోద్ కుమార్, దామోదర్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, రమేష్ గౌడ్ వైకాపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు ,

# రసాయనిక పరిశ్రమలలో విపత్తు సమయములో నష్ట నివారణకు అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి



**ఏలూరు,బ్యూరో చీఫ్ ఏప్రిల్, 28 :నంది పత్రిక** రసాయనిక పరిశ్రమలలో విపత్తు సమయంలో నష్ట నివారణకు సంబంధిత శాఖల అధికారులు తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఈనెల 30వ తేదీన చింతలపూడిలో ఐఓసిఎల్ పైప్ లైన్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహణకు సంబంధించి టేబుల్ టాప్ ఎక్సరసైజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రసాయనిక పరిశ్రమలలో విపత్తులు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతోపాటు విపత్తు సమయంలో నష్టాలను నివారించడంతోపాటు ప్రాణ నష్టాలు నివారించడానికి తీసుకోవలసిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 30వ తేదీన ప్రతీ జిల్లాలోనూ రసాయనిక పరిశ్రమలలో విపత్తు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించవలసిందిగా ఆదేశించిందన్నారు. ఈ మాక్ డ్రిల్ లో సంబంధిత శాఖల అధికారులు తీసుకోవలసిన చర్యలపై తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈనెల 30వ తేదీన చింతలపూడిలోని ఐఓసిఎల్ పైప్ లైన్ వద్ద నిర్వహించే మాక్ డ్రిల్ లో సంబంధిత అధికారులు అందరూ తప్పనిసరిగా పాల్గొని, ఆ కార్యక్రమంలో తెలియజేసిన సూచనలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలు చేయవలసిన విధులను కలెక్టర్ తెలియజేసారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ రత్నబాబు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ త్రినాధ్ బాబు, డిఎంహెచ్ఓ డా.శోభ, పశుసంవర్ధక శాఖ డిడి డా. గోవిందరాజులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారా?... కేంద్రం ఏం చెబుతోందంటే...!

**ప్రస్తుతానికి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రతిపాదన లేదని కేంద్రం వెల్లడి**

**పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజలకు ప్రభుత్వం భరోసా**

**దేశంలో ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ నిల్వలు సరిపడా ఉన్నాయని స్పష్టీకరణ**

**అత్యవసర రంగాలకు ఇంధన సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదని హామీ**

**ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పెట్రోలియం శాఖ సూచన**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయనే ఆందోళనలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతానికి పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలను పెంచే ప్రతిపాదన ఏదీ లేదని మంగళవారం స్పష్టం చేసింది. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది.ఈ విషయంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్లలో పరిణామాలను ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని తెలిపారు. "దేశంలో ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ సరిపడా పరిమాణంలో అందుబాటులో ఉన్నాయి. ధరలు పెరగలేదు. కాబట్టి ఎవరూ ఆందోళన చెందవద్దు," అని ఆమె విజ్ఞప్తి చేశారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడి చమురు, ఎల్పీజీ, పీఎన్జీ దిగుమతులపై ప్రభావం పడిన మాట వాస్తవమేనని, అయితే సరఫరాలో అంతరాయాలు కలగకుండా చర్యలు తీసుకున్నామని శర్మ వివరించారు. గృహ వినియోగదారులకు, రవాణాకు ఉపయోగించే సీఎన్జీకి 100 శాతం సరఫరాను నిర్ధారించినట్లు తెలిపారు. వాణిజ్య ఎల్పీజీ సరఫరాపై పాక్షిక ప్రభావం పడినా, ప్రస్తుతం 70 శాతానికి పునరుద్ధరించామని, ఆసుపత్రులు, విద్యా సంస్థల వంటి కీలక రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. వలస కార్మికులు ఎక్కువగా ఉపయోగించే 5 కిలోల ఎల్పీజీ సిలిండర్ల సరఫరాను దాదాపు రెట్టింపు చేసినట్లు ఆమె వెల్లడించారు. ఫార్మా, స్టీల్, వ్యవసాయం వంటి కీలక పరిశ్రమలకు ఇంధన కొరత రాకుండా చూస్తున్నామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.



# సెల్ఫ్ సర్వీస్ కియోస్క్ మిషన్ల ఏర్పాటు





**శ్రీశైలం ఏప్రిల్ 28 (నంది పత్రిక)** భక్తుల సౌకర్యార్థమై దేవస్థానం పలుచోట్ల సెల్ఫ్ సర్వీస్ కియోస్క్ మిషన్ల ఏర్పాటు చేసింది. లడ్డూ ప్రసాదాల విక్రయకేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్లు ( 28.04.2026) సాయంత్రం దేవస్థానం కార్యనిర్వహణాధికారి మరియు ధర్మకర్తల మండలి సభ్యులు ప్రారంభించారు. ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి ముందుగా పూజాదికాలను జరిపి ఈ సెల్ఫ్ సర్వీస్ కియోస్క్ మిషన్లను ప్రారంభించడం జరిగింది.ఈ సెల్ఫ్ సర్వీస్ కియోస్క్ ద్వారా భక్తులు దర్శనాలు, ప్రసాదాలు మరియు కేశఖండన టికెట్లను పొందవచ్చు. అదేవిధంగా దేవస్థాన వివిధ పథకాలకు వీటి ద్వారా విరాళాలను కూడా చెల్లించవచ్చు. కాగా కేంద్ర విచారణ కార్యాలయం ( సెంట్రల్ రిసెప్షన్ ఆఫీస్), మల్లికార్జునసదన్, గంగాసదన్, కల్యాణకట్ట, పాత విరాళాల కేంద్రం మరియు గంగాధర మండపం వద్దగల కొత్త విరాళాల కేంద్రం వద్ద కూడా సెల్ఫ్ సర్వీస్



కియోస్క్ మిషన్లు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి మరియు ధర్మకర్తల మండలి సభ్యులు మాట్లాడుతూ భక్తులకు సాంకేతికతో కూడిన మరింత మెరుగైన సేవలను అందించడంలో భాగంగా ఈ కియోస్క్ మిషన్లను పలుచోట్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటి ద్వారా భక్తులు ఆయా టికెట్లను ఎవరికివారు నేరుగా పొందవచ్చునన్నారు. ఈ ఏర్పాట్ల వలను భక్తులు ఆయా టికెట్లను సులభతరంగా పొందే అవకాశం కలుగుతుందన్నారు. కాగా ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన మనమిత్ర వాట్సప్ ద్వారా దేవస్థానమునకు సంబంధించిన 17 రకాల టికెట్లను ముందస్తుగా పొందే అవకాశం కల్పించబడింది. అదేవిధంగా దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ మరియు దేవదాయశాఖ వెబ్‌సైట్ ఀఀఀ.ఖజఞ్వఎజూశ్రీవం.ఖజూ.స్త్రశీజ.అఅ ద్వారా కూడా దర్శనం, ఆర్జితసేవాటికెట్లను ముందస్తుగా పొంద వచ్చును. కాగా ఈ కియోస్క్ మిషన్లను కరూర్ వైశ్యబ్యాంకు వారు కార్పోరేట్ సామాజిక బాధ్యత క్రింద దేవస్థానానికి అందజేయడం జరిగింది.

# అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ

## ఆకలి తీర్చిన అపర దేవత

**పోరుమామిళ్ల ఏప్రిల్ 28 (నంది పత్రిక):** భారతీయ సంస్కృతిలో అన్నదానానికి ఉన్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అన్న నానుడిని నిజం చేస్తూ, కులమతాలకు అతీతంగా, ఎందరో ఆకలిని తీర్చిన ధన్యజీవి శ్రీమతి డొక్కా సీతమ్మ. తన ఇంటికి వచ్చిన వారు ఎవరైనా సరే, ఏ అర్ధరాత్రైనా సరే వారికి కడుపునిండా అన్నం పెట్టి పంపే గుణం ఆమెను సాక్షాత్తు అన్నపూర్ణాదేవి స్వరూపంగా నిలబెట్టింది.

**బాల్యం మరియు వివాహం** సీతమ్మ గారు 1841 అక్టోబరులో తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం తాలూకా మండపేట గ్రామంలో జన్మించారు. ఆమె తండ్రి అనిపిండి భవానీశంకరం గారు అడిగిన వారికి లేదు అనకుండా అన్నం పెట్టే గుణం కలవారు. అందుకే గ్రామస్థులు ఆయన్ను ప్రేమగా 'బువ్వన్న' అని పిలిచేవారు. తండ్రిలోని ఆ ఉదారగుణమే సీతమ్మ గారికి రక్తగతమైంది. చిన్నతనంలోనే తల్లి నరసమ్మ గారు మరణించడంతో, ఇంటి బాధ్యతలను స్వీకరించిన సీతమ్మ, ఆ తర్వాత లంకగన్నవరం గ్రామానికి చెందిన వేద పండితుడు, ధనవంతుడు అయిన డొక్కా జోగన్న గారిని వివాహం చేసుకున్నారు. అత్తవారింట్లో అడుగుపెట్టిన నాటి నుండి ఆమె దాతృత్వం మరింత విస్తరించింది.

**నిరతాన్నదాతగా ప్రస్థానం** లంక గ్రామాల మధ్య ప్రయాణించే వారికి సీతమ్మ గారి ఇల్లు ఒక ఆశ్రయంగా మారింది. గోదావరి వరదల సమయంలో నిరాశ్రయులైన వారికి ఆమె అండగా నిలిచారు. ఒకసారి అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం బయలుదేరిన ఆమె,



దారిలో కొంతమంది పిల్లలు ఆకలితో ఏడవడం చూశారు. "గన్నవరం వెళ్తే సీతమ్మ గారు అన్నం పెడతారు" అని ఆ పిల్లల తల్లిదండ్రులు అనుకోవడం విని, దైవ దర్శనం కంటే ఆకలి తీర్చడమే ముఖ్యం అని భావించి వెంటనే ఇంటికి తిరిగి వెళ్లి వారికి స్వయంగా వంట చేసి పెట్టారు. ఆమె దృష్టిలో ఆకలితో ఉన్న ప్రతి వ్యక్తిలోనూ ఆ శ్రీమహావిష్ణువే కనిపిస్తాడు.

**బ్రిటిష్ చక్రవర్తి ప్రశంసలు** సీతమ్మ గారి ఖ్యాతి కేవలం ఆంధ్రదేశానికే పరిమితం కాలేదు, సముద్రాలు దాటి ఇంగ్లాండు దాకా చేరింది. అప్పటి బ్రిటిష్ చక్రవర్తి (ఎడ్వర్డ్ ఎ××) ఆమె సేవలను గుర్తించి, ఆమె ఫోటోను పంపమని జిల్లా కలెక్టర్ ద్వారా కోరారు. ఆడంబరాలకు లోనుగాని ఆమె మొదట నిరాకరించినా, అధికారుల ఉద్యోగాల కోసం సమ్మతించారు. బ్రిటిష్ చక్రవర్తి తన పట్టాభిషేక వేడుకల్లో ఆమె చిత్రపటాన్ని ఉంచి గౌరవించడం ఆమె గొప్పతనానికి నిదర్శనం.

**విశ్వాసం మరియు దైవకృప** కరువు కాటకాలు వచ్చినప్పుడు కూడా ఆమె అన్నదానాన్ని ఆపలేదు. భర్త జోగన్న గారు భవిష్యత్తు గురించి ఆందోళన చెందినా, "మనం పెట్టేది దేవుడికే కదా, ఆయనే చూసుకుంటాడు" అని ధైర్యం చెప్పేవారు. ఆ విశ్వాసానికి తగ్గట్టే, వారి పొలంలో బంగారు నాణాల నిధి దొరకడం, దానితో ఆమె మరింత ఉధృతంగా అన్నదాన కార్యక్రమాలు కొనసాగించడం ఒక అద్భుతం.



**ముగింపు** ఆధునిక కాలంలో కూడా డొక్కా సీతమ్మ గారి పేరు వినగానే తెలుగు రాష్ట్రాల్లో గౌరవంతో తల వంగుతుంది. కుల, మత, జాతి విచక్షణ లేకుండా కేవలం 'మానవత్వం' అనే ధర్మంతో బతికిన ఆమె, 1909 ఏప్రిల్ 28న శివైక్యం చెందారు.

ఆమె భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆమె చూపిన సేవా మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకం. అన్నార్తుల ఆకలి తీర్చడమే నిజమైన పూజ అని నిరూపించిన ఆమెకు మన నివాళులు అర్పించడం అంటే, ఆమె ఆశయాలను మన వంతుగా కొనసాగించడమే.

"అన్నదానం పరమ దానం – అది సీతమ్మ గారికి ప్రాణ సమానం" రచన బొల్లు రామమోహన్, రచయిత, పోరుమామిళ్ల, కడప జిల్లా

# కాలువలకు మరమ్మత్తులు

## తెలుగుగంగ ద్వారా కృష్ణాజలాలు నిలిపివేత

తెలుగు గంగ ప్రాజెక్టు కింద చెన్నైకి సరఫరా చేస్తున్న కృష్ణా జలాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఆంధ్రరాష్ట్రంలోని కృష్ణానది నుంచి తెలుగుగంగ కాలువ ద్వారా విడుదల చేస్తున్న నీటిని ఏపీ సరిహద్దు ప్రాంతమైన కండలేరులో నిల్వవుంచుతారు. అక్కడి నుండి తెలుగుగంగ కాలువ ద్వారా తిరువళ్లూరు జిల్లాలోని పూండి రిజర్వాయర్‌కు మళ్లిస్తారు. ప్రస్తుతం కండలేరు–పూండి మధ్య తెలుగుగంగ ప్రాజెక్టులో ఏపీ ప్రభుత్వం చేపట్టిన మరమ్మతుల కారణంగా కృష్ణాజలాల సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. మరమ్మతులు ఈ నెలాఖరుకు పూర్తిచేశాక మే 1వ తేదీ నుంచి యథావిధిగా కృష్ణాజలాలను సరఫరా చేయనున్నట్లు ఏపీ అధికారులు హామీ ఇచ్చినట్లు రాష్ట్ర నీటిపారుదలశాఖ తెలిపింది. ఇదిలాఉండగా, నగరవాసులదాహార్తిని తీరుస్తున్న పూండి, చెంబరంబాక్కం, పుళల్, షోళవరం, కన్నన్‌కోట, తేర్వైకండిగై రిజర్వాయర్లలో ప్రస్తుతం 7,966 మిలియన్ ఘనపుటడుగుల నీటిని నిల్వవుంచినట్లు తెలిపారు. గత ఏడాది ఇదే రోజుకు నిల్వవుంచిన నీటిమమట్టం కంటే 36 మిలియన్ ఘనపుటడుగులు తక్కువని, ఈ వేసవి సీజన్‌లో తాగునీటి కొరత ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

డాలర్ కాస్త బలపడడం, గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం వంటి కారణాలతో మంగళవారం బంగారం ధర తగ్గుదల నమోదు చేసింది. భౌగోళిక, అంతర్జాతీయ రాజకీయ కారణాలతో కాస్త హెచ్చుతగ్గులకు లోనవుతోంది. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గుదల నమోదు చేసింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,000గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,250గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.650 మేర తగ్గింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,150గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,400గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. కిలోకు 4 వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా, బెంగళూరులో రూ.2.60 లక్షలుగా ఉంది.

# డీలిమిటేషన్: దక్షిణాది రాష్ట్రాల సెల్ఫ్‌గోల్!

ఏప్రిల్ 16, 17 తేదీలలో జరిగిన పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు వాడివేడిగా ముగిశాయి. ఎండాకాలం దుమారాన్ని తలపించేలా మాటల దాడులు హోరెత్తాయి. వేడి చల్లారాక ఇప్పుడు వెలుతురు ప్రసరిస్తోంది. ఆవేశం స్థిమితపడి తర్కం, ఆత్మవిమర్శ మొదలయ్యాయి. గెలుపోటములకు అతీతంగా ఏదో అసాధారణ పరిణామం అత్యున్నత చట్టసభలో చోటుచేసుకుందని అర్థమవసాగింది. అనుమానం పెనుభూతమై అసలుకే మోసం తెచ్చుకున్నామా? అనే మీమాంస మొదలైంది. లోక్‌సభ, అసెంబ్లీలలో మహిళలకు మూడోవంతు సీట్లు పదిహేనేళ్ల పాటు విధిగా కేటాయించటం ఇప్పటికే 106వ సవరణ రూపేణా రాజ్యాంగంలో భాగమైంది. ఇప్పుడు లోక్‌సభలో వీగిపోయిన 131వ సవరణ ద్వారా రెండు కీలక మార్పులకు సంకల్పించారు. మహిళలకు సీట్ల కేటాయింపు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)ను 2026 జనగణనతో సంబంధం లేకుండా చేయటం; లోక్‌సభ సభ్యుల సంఖ్యను యాభై శాతం పెంచటం. 2026 జనగణన పూర్తయ్యేవరకూ వేచివుండాల్సిన అవసరం లేకుండా నియోజకవర్గాల పునర్విభజనను వేగవంతం చేయటం, 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే ఆ ప్రక్రియను పూర్తి చేయటం ఇందులో సానుకూలాంశం. గత 25 ఏళ్లకు పైగా, పట్టణీకరణ శరవేగంగా పెరుగుతోంది. దీంతో, నియోజకవర్గాల మధ్య పరిమాణంలో అంతరం అంతకంతకూ పెరుగుతోంది. ఉదాహరణకు, గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలోని మల్కాజిగిరి నియోజకవర్గ జనాభా 50 లక్షలకు పైగా ఉంది. కాబట్టి, డీలిమిటేషన్ అవసరం. వీగిపోయిన బిల్లులు పార్లమెంటుకిచ్చిన అధికారమల్లా డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా తీసుకోవాల్సిన జనగణన సంవత్సరాన్ని నిర్ణయించటం. 2029 నాటికల్లా మొత్తం పునర్విభజనను పూర్తిచేయటానికి.. ఇప్పటివరకూ చివరిగా అందుబాటులో ఉన్న 2011 డీలిమిటేషన్ గణాంకాలను పార్లమెంటు ఆధారంగా చేసుకుంది. సభలో అధికారిక ప్రకటనలు ఈ మేరకు సూచించాయి. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచటం అనేకమందిలో ఉత్కంఠ రేపినట్లు కనిపిస్తోంది. కానీ మహిళా రిజర్వేషన్ లేదా రాష్ట్రాలకు సీట్ల కేటాయింపు అంశాలకు, దీనికి ప్రత్యక్ష సంబంధమేమీ ఉండదు. మన జనాభా భారీగా పెరిగిన రీత్యా, ప్రతినిధుల సంఖ్యను పెంచటం సబబైన ప్రతిపాదన. కానీ సగటు రాజకీయంలో కొట్టుకుపోకుండా పరిశీలిస్తే.. మహిళా ప్రాతినిధ్యం నేపథ్యంలో లోక్‌సభ బలాన్ని పెంచటం వల్ల ఒక నిజమైన ప్రయోజనాన్ని మనం గమనించవచ్చు. దీనివల్ల, ప్రస్తుతం సభ్యులుగా ఉన్నవారిలో చాలామంది బలవంతంగా తమ స్థానాల్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి తలెత్తదు. అదే, సీట్ల సంఖ్యను పెంచకుండా మహిళలకు రిజర్వేషన్ అంటే... పురుష రాజకీయవేత్తలు చాలా సందర్భాల్లో తమ కుటుంబాల్లోని మహిళల్ని కీలుబొమ్మ అభ్యర్థులుగా నిలబెడతారు. ఇదేమీ అకారణ భయం కాదు. అప్పుడు మహిళా సాధికారత మొక్కుబడి తంతులా మారుతుంది. ఇస్తినమ్మ వాయనం, పుచ్చుకుంటినమ్మ వాయనం పద్ధతిలో నిజమైన నాయకత్వం ఆవిష్కృతమవదు. ఇప్పటికే మన స్థానిక ప్రభుత్వాల్లో 'పంచ్‌పతులు'గా పిలుచుకునే ఓ ఆనవాయితీ ప్రబలింది. అక్కడ మహిళలు రిజర్వేషన్ ద్వారా ఎన్నికైనా, పేరుకే నాయకురాళ్లు. ఆవిడ భర్తో, తండ్రో నిజమైన అధికారాన్ని చలాయిస్తారు. ఈ కోణంలో లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచటం మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ప్రాధాన్యాంశం. ఇది మినహాయించి.. లోక్‌సభ బలానికి, రిజర్వేషన్లకు సంబంధం లేదు. కానీ, ప్రభుత్వం పరిష్కరించటానికి ప్రయత్నించిన పెద్ద సవాలు లోక్‌సభలో రాష్ట్రాలకు సీట్ల కేటాయింపు. ఇది జటిలమైన, సున్నితమైన, రాజకీయ విమర్శలకు ఆస్కారమున్న అంశం. ప్రతి రాష్ట్రానికీ సీట్ల కేటాయింపును ఏ పద్ధతిలో చేయాలో రాజ్యాంగంలోని 81(2) అధికరణంలో పేర్కొన్నారు. "సీట్ల సంఖ్య ఆచరణలో వీలైనంత వరకు రాష్ట్ర జనాభాకు నైష్పత్తికంగా ఉండేలా పునర్విభజన చేయాలి. అన్ని రాష్ట్రాల్లో ఇంచుమించు ఇదే తరహాలో ఉండాలి". 82వ అధికరణం కూడా ఇలా పేర్కొంటుంది: ప్రతి కులగణన తర్వాత, లోక్‌సభకు రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని.. తదనుగుణంగా మార్పుచేర్పుల్ని చేయాలి. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రతి రాష్ట్రానికీ కేటాయించిన సీట్లను 25 ఏళ్ల పాటు యథాతథంగా కొనసాగించారు. కుటుంబ నియంత్రణను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆ చర్య తీసుకున్నారు. 2001లో సీట్ల సంఖ్యలో ఆ స్తంభన వ్యవధి ముగిసింది. అయితే రాష్ట్రాలకు కేటాయించిన సీట్లలో యథాతథ స్థితిని మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలని అప్పటి వాజపేయి ప్రభుత్వాన్ని ఒప్పించటంలో నేను కీలకపాత్ర పోషించాను. అందుకోసం మేం జాతీయ స్థాయిలో ఒక రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాం. అప్పటి న్యాయశాఖ మంత్రి అరుణ్ జైట్లీ; జేఎం లింగ్డో నేతృత్వంలో ముగ్గురు ఎన్నికల సంఘం సభ్యులు; అన్ని రాష్ట్ర ఎన్నికల సంఘాల కమిషనర్లు, ఈ రంగంలో నిపుణులు హాజరయ్యారు. అప్పటి ప్రభుత్వం రకరకాల పార్టీల అతుకులబొంత సంకీర్ణం. ఇదే సమయంలో పోఖ్రాన్ అణు విస్ఫోటనం నేపథ్యంలో విదేశీ ఆంక్షల వల్ల ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లు తీవ్రమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో పునర్విభజన తుట్టెను కదిలించటం సమస్యలకు దారితీయవచ్చు. జాతీయ సమగ్రత అత్యంత ప్రాధాన్యాంశం.. అని మేం విజ్ఞప్తి చేశాం. పార్టీలు స్పందించాయి. 84వ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చాయి. 2026 వరకు రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల కేటాయింపును నిలుపుచేశాయి. సవరణ లేకుండా 2026 జనగణన ఆధారంగానే సీట్లను కేటాయిస్తే, రాజ్యాంగం ప్రకారం ఏడు రాష్ట్రాలు ప్రస్తుత లోక్‌సభ బలంలో 35 సీట్లను కోల్పోతాయి. ఆంధ్రప్రదేశ్ (5), తెలంగాణ (3), తమిళనాడు (10), కర్ణాటక (2), కేరళం (7), ఒడిశా (4), పశ్చిమ బెంగాల్ (4). నాలుగు రాష్ట్రాలు 34 సీట్ల మేర అదనంగా పొందుతాయి. యూపీ (+12), బిహార్ (+10), మధ్యప్రదేశ్ (+5), రాజస్థాన్ (+7). 2026 జనాభా ప్రకారం వివిధ రాష్ట్రాలకు అలా సీట్ల పంపకం జరిగితే, బీజేపీయే ప్రధానంగా లాభం పొందుతుందనేది ఎక్కువమంది అంగీకరించే అభిప్రాయం. అయితే, ఎవరూ ఊహించనిరీతిలో... తన ప్రయోజనాలకు విరుద్ధంగా ఎన్డీయే ప్రభుత్వం ప్రస్తుత రాష్ట్రాల వాటాను 1971 జనగణన డేటా ఆధారంగా స్తంభింపజేయటానికి ముందుకొచ్చింది (పేరుకి 2011 జనగణన అని సూచించినప్పటికీ వాస్తవానికి 1971 గణాంకాలే ప్రాతిపదికగా కొనసాగుతాయి). బీజేపీ అలా యథాతథ స్థితిని కొనసాగించటానికి చొరవ చూపటానికి అనేక కారణాలుండొచ్చు.

# అంతా శివ లీల

ఒక రోజు ఓ నాస్తికుడు అడవిలో అందాలను తన కెమెరా కళ్ళలో బంధించడానికి దట్టమైన అడవిలోకి వెళ్ళాడు...!మధ్యాహ్నం వరకు అడవంతా తిరిగి కొన్ని ఫోటోలు తీసుకున్నాడు..!సాయంత్రానికల్లా అడవి నుండి బయటపడాలని, తిరుగు దారి పట్టాడు..!అలా ఓ గంట నడిచాక కాని అతనికి అర్థం కాలేదు...!తాను దారి తప్పి పోయాడని..!అసలే అది క్రూర మృగాలు కూడా తిరిగే అడవి..!ఏదైనా కాని అని ధైర్యం తెచ్చుకుని మరో దారిలో ప్రయాణం కొనసాగించాడు..!ఆ దారిలో అతనికి పులి గాండ్రింపు వినిపించింది...! నడక సాగిస్తున్న అతను గుండె చేతిలో పట్టుకుని అక్కడే ఆగిపోయాడు..!అతనికి ఏం చేయాలో పాలుపోలేదు..!ఓ మర్రి చెట్టు పక్కన తల దాచుకుని,తెచ్చుకున్న కాసిన్ని నీళ్ళు కూడా తాగేసాడు..!పోనీ తన స్నేహితులకి,తనున్న లొకేషన్ షేర్ చేద్దామంటే,అక్కడ సిగ్నల్ అస్సలు లేదు...!తనకు తెలియకుండానే 'భగవంతుడా...!నాకేంటి ఈ పరీక్ష' అని సణిగాడు...!వెంటనే తనలో తాను 'నా పిచ్చి కాని భగవంతుడే లేడు,ఇంకా ఆయనొచ్చి నన్నేం కాపాడతాడు??' అని అనుకున్నాడు...!అయినా తన మనసులో ఓ మూల ఒక్కసారి భగవంతుడు తనని కాపాడమని కోరుకోవాలనుకున్నాడు..! వెంటనే ఆ నాస్థికుడు రెండు చేతులు జోడించి,తన మనసులో 'శివయ్య..!నువ్వే గనక ఉంటే నాకు బయటికెళ్ళే దారి చూపించి నన్ను రక్షించు...!' అని మొక్కాడు..!మొక్కిన వెంటనే తన పక్కన ఓ బాణం దూసుకు వచ్చి పడింది...!ఆ బాణం వేగంతో తన పక్కనే పడడం వల్ల ఒక్కసారి ఉలిక్కి పడి గావు కేక వేసాడు ఆ నాస్తికుడు...!ఏం జరిగిందో తనకి అర్థం కాలేదు...!అప్పుడే అక్కడికి ఓ వేటగాడు వచ్చి "దొర గారు,ఇటు పక్క ఓ తెల్లటి కుందేలు వచ్చింది!మీరేమైనా చూసారా?" అని అడిగాడు..! అందుకు ఆ నాస్తికుడు "నేను గంట నుంచి,ఈ చెట్టు కింద గుంట నక్కల కూర్చున్నా..!ఈ వైపు ఏ కుందేలు రాలేదు..!" అన్నాడు..!ఆ వేటగాడు ఆశ్చర్యంగా "నేను గంట సేపటి నుండి దాన్నే వేటాడుతూ వచ్చాను!ఎన్ని బాణాలు వేసినా తప్పించుకుని మీ దగ్గరికి వచ్చింది!ఇక్కడికొచ్చి చూస్తే ఆ కుందేలు కనిపించడం లేదు..!ఈ రోజు వేట వృథా అయినట్టే...." అంటూ అడవి నుంచి ఇంటి దారి పట్టాడు...!

వెంటనే ఆ నాస్తికుడు "ఆగు ఆగు..!నేను దారి మరిచి ఎలా వెళ్ళాలో ఇక్కడ కూర్చున్న..!నన్ను నీతో పాటు తీసుకెళ్ళవా...!" అంటూ కొంచం ధీనంగా అడిగాడు...!అందుకు,ఆ వేటగాడు–ఆ నాస్తికున్ని తనతో అడవి బయటి మార్గం వైపు తీసుకెళ్ళసాగాడు...!నాస్తికుడు,ఆ వేటగానితో మాటలు కలిపి "నిజానికి నేను దేవుడిని నమ్మను!ఈ అడవిలో మొదటి సారి భయం వేసినపుడు నన్ను కాపాడమని వేడుకున్నా...!ఆ దేవుడు వచ్చి నన్ను కాపాడ లేదు..!మనిషే కాపాడాడు..!నువ్వే దేవుడి కన్నా గొప్పవాడివి...!" అన్నాడు..!ఆ మాటలు విన్న వేటగాడు క్షణ కాలం ఆగి "ఏందయ్యా సామి??దేవుడు లేడంటావా?మా మన్యంలో నన్ను మించిన విలుకాడు లేడు..!అలాంటిది రామునికి మాయ లేడి కనిపించినట్టు,ఈ రోజు నాకు అలాంటి కుందేలు కనిపించింది..!ఏ జంతువైనా ఒకటి లేదా రెండు బాణాల్లో నేలకొరిగిస్తాను..!అలాంటిది,ఈ రోజు నాకు కనిపించిన కుందేలుకి ఎన్నో బాణాలతో కొట్టాను..!అయినా ఏ ఒక్క బాణం దానికి తగలలేదు..!నేనేంటి ఓ కుందేలుని కొట్టలేకపోవడం ఏంటి అని,పట్టుబట్టి దాని వెనకాల పరిగెడుతూ వస్తే చివరికి నీ దగ్గర మాయమయింది..!అంతా శివ లీల" అన్నాడు...!దానికి నాస్తికుడు "అంతా శివ లీలనా??ఇదంతా ఆ శివుడు చేయించే బదులు,శివుడే వచ్చి దారి చూపొచ్చు కదా...?" అని నవ్వుతూ ప్రశ్నించాడు..! అందుకు ఆ వేటగాడు "మీకు ఆకలేసినపుడు హోటళ్ళోకి వెళ్ళి కూర్చుంటే,అక్కడి సర్వర్లు మీకు వడ్డించి ఆకలి తీరుస్తారు



కాని ఆ హోటల్ యజమాని వచ్చి మీకు సేవ చేయడు కదా...!" అంటూ......ఆ నాస్తికుడు వెళ్ళాల్సిన చోటుకి,తన చూపుడు వేలుతో దారి చూపించాడు ఆ వేటగాడు...!ఆ వేటగానికి ఏమైనా కొంత డబ్బు ఇద్దామని బ్యాగు తెరిచి,కొంత డబ్బు తీసి,ఆ వేటగానికి ఇవ్వబోయాడు...!అలా ఇవ్వబోతూ ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యాడు...!అతని ముందు,వెనక,మరియు పక్కన తనకి దారి చూపించిన ఆ వేటగాడు కనిపించలేదు...! ఆ నాస్తికుడు గుండెలు పిండేసాయి! కళ్ళల్లోంచి వస్తున్న నీటిని ఆపుకోలేక తనలో తాను 'నన్ను రక్షించడం కోసం మాయా కుందేలుని సృష్టించుకుని,నన్ను ఈ దట్టమైన అడవిలోంచి బయట పడవేయడమే గాక నాస్తికత్వం అనే మాయలో నుంచి కూడా బయట పడేసావు..!నీవు శివుడివో?శివుడు పంపిన దూతవో నీకే తెలుసు శివయ్య....!ఇదంతా నిజంగా నీ లీలనే...!" అంటూ ఇంటి దారి పట్టాడు ఆ నాస్థికుడు..!ఇంతకీ ఆ నాస్తికుని పేరు చెప్పలేదు కదు...! అతని పేరు శివ కేశవ

సేకరణ– పెరుమాళ్ళ వెంకట సురేంద్ర
(రుద్రవరం ప్రతినిధి)

# పరిశోధనా భూముల జోలికి రాకండి!

నేటి అభివృద్ధి వేగం వ్యవసాయ పరిశోధనా సంస్థల భూముల పాలిట సమస్యగా మారుతున్నది. పాలకులు, అధికారులు అందరూ వ్యవసాయ పరిశోధనా క్షేత్రాలను భూములుగా మాత్రమే పరిగణిస్తూ వాటిని ఇతరత్రా అవసరాలకు వాడేందుకు సిద్ధమవుతున్నారు. పలు సందర్భాల్లో తాత్కాలిక ప్రయోజనం కోసం ఈ భూములను బలవంతంగానే తీసుకుంటున్నారు. బాపట్ల, రాజేంద్రనగర్, మారుటేరు, జగిత్యాల, నంద్యాల, కరీంనగర్, అనకాపల్లి, రుద్రూరు, తిరుపతి, నంద్యాల, రాగోలు, కూనారాం, సంగారెడ్డి, మల్లేపల్లి... ఇలా ఎన్నో ప్రాంతాలలోని పరిశోధనా క్షేత్రాలలో జరిగిన పరిశోధనలు, అక్కడ శోధించి సాధించిన పద్ధతులు, అభివృద్ధి అయిన వంగడాల ద్వారా ఎంతో సామాజిక అభివృద్ధి జరిగింది. ఉదాహరణకు బాపట్ల పరిశోధన కేంద్రం నుంచి వచ్చిన ధీూ 5204 గురించి ప్రపంచం అంతా తెలుసు. దీనిని ప్రామాణికంగా చేసుకుని రాజేంద్రనగర్ వారు తెచ్చిన డయాబెటిక్ రకం ఎంతో ప్రసిద్ధి పొందింది. ఇలా చెప్పుకుంటూపోతే ప్రతి పంటలోనూ ఈ వ్యవసాయ పరిశోధనా క్షేత్రాలు కాలానుగుణంగా రైతులోకానికి అందించిన వంగడాలు ఎన్నో ఉన్నాయి. వాణిజ్యపరంగా సాగుచేసే పత్తి, పసుపు, మిరప, చెరకు పంటలేగాక, కొబ్బరి, మామిడి, నిమ్మ, నేరేడు, జామ, అరటి, సీతాఫలం పండ్లలో కూడా ఈ క్షేత్రాలు మంచి ఫలితాలు అందించాయి. కానీ ఈ పరిశోధనా క్షేత్రాలకు చెందిన భూములను ప్రభుత్వాలు సాధారణ భూమిగా పరిగణిస్తూ కొందరు అధికార బలంతో చాలా సులువుగా ఆధీనపరచుకొని ఇతరత్రా సేవలకు వాటిని వినియోగిస్తున్నారు. భూముల ధరలకు రెక్కలు వచ్చిన ప్రాంతాల్లో వీటిని కేవలం రియల్ ఎస్టేట్ కోణంలోనే చూస్తున్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా అభివృద్ధి చేసిన ఔషధ వనాలు పోయాయి. దశాబ్దాల తరబడి శ్రమించి, కోట్లాది రూపాయలు వెచ్చించి రూపొందించిన జీవ వైవిధ్య పార్క్ నేలమట్టం అయింది. కారణాలు ఏవైనా ఒక్కో పరిశోధన క్షేత్రం తన ఉనికిని కోల్పోతూ రావటం బాధాకరం. ఇప్పుడు సరికొత్తగా 5204 వరి వంగడం పురుడుపోసుకున్న భూముల్లో బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని నిర్మిస్తున్నామంటూ బోర్డు పెట్టారు. పాలకులు, అధికారులు అధికారంతో కాకుండా రైతు నేస్తాలుగా ఆలోచించాలి. మీరు నిర్మించే భవనాలు జీవం లేని కట్టడాలు. కానీ వీటి కోసం మీరు తీసుకునే వ్యవసాయ కళాశాల, విశ్వవిద్యాలయం, పరిశోధనా క్షేత్రాల భూములు కేవలం భూములు కావు. అవి జాతి జీవన రహదారులు. దేశం ఇంతవరకు సాధించిన ఆహార భద్రత, వ్యవసాయరంగంలో సాధించిన స్వయం పోషకత్వం ఈ భూముల్లో జరిగిన పరిశోధనల సారంతోనే సుసాధ్యమయింది. మరోవైపు, పెరుగుతున్న జనాభాకు సరిపడా తిండి గింజల ఉత్పత్తి జరగాలి. ఆహార భద్రతతో పాటు పోషకాహార భద్రతా కావాలి. దీనికి తోడు వాతావరణంలో వస్తున్న మార్పులు కలవరపెడుతున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావం తప్పదన్న నిపుణుల అంచనాకు అన్ని దేశాల వాతావరణ శాస్త్రజ్ఞులూ మద్దతు పలుకుతున్నారు. ఇటువంటి విపత్కర సమయంలో పరిశోధన క్షేత్రాలలో అధికార భవనాలు కట్టడం మంచిదేనా? అదే భూముల్లో పరిశోధనలు కొనసాగితే ఎన్నో సమస్యలకు సానుకూల పరిష్కారం లభిస్తుంది. గతాన్ని పరిశీలిస్తే జెన్నారెడ్డి రఘోత్తమరెడ్డి వంటి వారు తమ 150 ఎకరాల మామిడి తోటను పరిశోధనల కోసం విశ్వవిద్యాలయానికి దానం చేశారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com